ఆస్పత్రిపై ఇజ్రాయిల్ దళాల దాడి

ఖాన్‌యూనిస్: దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్ నగరంలో ఉన్న అతిపెద్ద ఆస్పత్రిపై ఇజ్రాయిల్ సైన్యం దాడికి తెగబడింది. ఈ దాడిలో ఒకరు మృతి చెందగా 20మంది వరకు గాయాలపాలైనట్లు గాజా ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఇజ్రాయిల్ దాడి కారణంగా ఆస్పత్రిలోని సర్జికల్ భవనంలో మంటలు చెలరేగాయని తెలిపింది. అటు నాజర్ ఆస్పత్రిపై దాడి చేశామని ఇజ్రాయిల్ సైన్యం కూడా ధ్రువీకరించింది. ఆస్పత్రిలో హమాస్ మిలిటెంట్లు కార్యకలాపాలు సాగిస్తున్నారని...అందుకే దాడి చేశామని చెప్పుకుంది. గత 24 గంటల్లో గాజా ప్రాంతంలో ఇజ్రాయిల్ సైన్యం జరిపిన దాడుల్లో 26 పలస్తీనియన్లు ప్రాణాలు మృతి చెందారు. కాగా ఇజ్రాయిల్-హమాస్ యుద్ధంలో ఇప్పటివరకు 50వేల మందికి పలస్తీనియన్లు మృతిచెందారని గాజా ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఇంకా 1.13 లక్షల మంది గాయపడినట్లు వివరించింది. ఇదిలావుండగా... ఆదివారం ఖాన్ యూనిస్ నగరంపై ఇజ్రాయెల్ నిర్వహించిన దాడిలో హమాస్ కీలక నేత సలాహ్ అల్ బర్దావీల్(66) మృతి చెందారు. ఆయనతో పాటు భార్య కూడా ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయారు. ఖాన్ యూనిస్ శరణార్థి శిబిరంలో జన్మించిన బర్దావీల్, హమాస్ సీనియర్ నేత యాహ్యా సిన్వర్‌కు సన్నిహితుడు. హమాస్ రాజకీయ విభాగానికి నాయకుడు. ఇజ్రాయిల్ దాడుల్లో సిన్వర్, ముస్తాహాలు చనిపోయినప్పటి నుంచి బర్దావీలే హమాస్‌లో కీలకనేతగా ఉంటున్నారు.

అమెరికాది దుందుడుకు చర్య: గ్రీన్‌ల్యాండ్

నూక్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కార్యవర్గంలోని కీలక అధికారులు, సెకండ్ లేడీ ఉషా వాన్స్ తమ దేశంలో అనధికారిక పర్యటనకు రానుండటంపై గ్రీన్‌ల్యాండ్ అభ్యంతరం తెలిపింది. ఇదొక దుందుడుకు చర్య అని గ్రీన్‌ల్యాండ్ ప్రధాని మూట్ బి ఎగీడ్ వ్యాఖ్యానించారు. అమెరికా జాతీయ భద్రతా సలహాదారు వాల్ట్ పర్యటనపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తంచేశారు.

అమెరికా భద్రతా సలహాదారు గ్రీన్‌ల్యాండ్‌లో ఏం చేస్తారని ఆయన ప్రశ్నించారు. తమపై బల ప్రదర్శనకే ఆయన వస్తున్నారన్నారు. ఆ పర్యటనతో ట్రంప్ ప్రణాళికలపై అమెరికన్లకు నమ్మకం పెరుగుతుందన్నారు. మరోవైపు ఇటీవల ఎన్నికల్లో విజయం సాధించిన నేత ఫ్రెడ్రిక్ నీల్సన్ మాట్లాడుతూ తమ దేశమంటే చిన్నచూపును అమెరికన్ల పర్యటన తెలియజేస్తోందన్నారు. ఇక డెన్మార్క్ ప్రధాని ఫ్రెడ్రిక్సన్ మాట్లాడుతూ... అమెరికా ప్రతినిధి బృందం పర్యటనను కొంత తీవ్రంగానే తీసుకోవాల్సి ఉంటుందన్నారు. గ్రీన్‌ల్యాండ్‌లో జరిగే సంప్రదాయ డాగ్‌స్లెడ్ రేస్‌ను వీక్షించేందుకు ఉషావాన్స్ పర్యటించనున్నట్లు శ్వేతసౌధం వెల్లడించింది. అంతేకాదు.. ఉషతోపాటు ఆమె కుమారుడు, అమెరికా ప్రతినిధుల బృందం ఉంటుందని పేర్కొంది. గ్రీన్‌ల్యాండ్ సంప్రదాయాలను ఆమె తెలుసుకొంటారని పేర్కొంది. 1953 వరకు డెన్మార్క్ గ్రీన్‌ల్యాండ్ కాలనీగానే కొనసాగింది.

ఆ తర్వాత దానికి స్వయంపాలనకు సంబంధించిన అవకాశాలు వచ్చాయి. 2009లో తమ భూభాగంపై ఖనిజాలు, శాంతిభద్రతలు, కోర్టులు-చట్టాలపై అధికారాలు సంక్రమించాయి. ఇప్పటికీ డెన్మార్క్ చేతిలో భద్రత, విదేశాంగ విధానం, ద్రవ్య పరపతి విధానం ఉన్నాయి.

అమెరికా విద్యార్థి వీసాల్లో కోత

వాషింగ్టన్: విద్యార్థి వీసాల (ఎఫ్-1) సంఖ్యను అమెరికా కుదించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 41శాతం వీసా దరఖాస్తులను తిరస్కరించింది. గత దశాబ్దకాలంతో పోలిస్తే ఎఫ్-1 వీసాల తిరస్కరణ రెట్టింపు స్థాయికి చేరింది. అమెరికా విదేశాంగ శాఖ గణాంకాల ప్రకారం.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎఫ్-1 వీసాల కోసం 6.79 లక్షల దరఖాస్తులు రాగా... ఇందులో 2.79 లక్షల (దాదాపు 41శాతం) దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. అంతకుముందు 2022-23 ఆర్థిక సంవత్సరంలో 6.99 లక్షల దరఖాస్తుల్లో 2.53 లక్షల (36శాతం) అప్లికేషన్లకు అధికారులు ఆమోదం తెలపలేదు. 2013-14 ఆర్థిక సంవత్సరంలో 7.69 లక్షల మంది విద్యార్థి వీసాల కోసం దరఖాస్తు చేసుకోగా.. 1.73లక్షల (23శాతం) అప్లికేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. నాటితో పోలిస్తే గతేడాది సంఖ్య దాదాపు రెట్టింపుగా ఉంది. అయితే, దేశాలవారీగా తిరస్కరణకు గురైన వారి సంఖ్యను అమెరికా వెల్లడించలేదు. కానీ, గతేడాది డిసెంబరు 9 నాటి వరకు ఉన్న గణాంకాల ప్రకారం.. 2024 సంవత్సరం తొలి 9 నెలల్లో భారతీయ విద్యార్థులకు ఎఫ్-1 వీసాలు 38శాతం తగ్గినట్లు తెలిసింది. కోవిడ్ తర్వాత భారతీయ విద్యార్థులకు వీసాలు ఈ స్థాయిలో తగ్గడం ఇదే తొలిసారి. బ్యూరో ఆఫ్ కాన్సులర్ అఫైర్స్ నెలవారీ నివేదికల డేటా ప్రకారం.. 2024 జనవరి నుంచి సెప్టెంబరు మధ్య 64 వేల మంది భారతీయ విద్యార్థులకు ఎఫ్-1 వీసాలను జారీ చేశారు. అంతకుముందు 2023 ఇదే సమయంలో ఈ సంఖ్య 1.03 లక్షలుగా ఉండటం గమనార్హం. ఎఫ్-1 వీసా అనేది నాన్-ఇమిగ్రెంట్ వీసా. ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు అమెరికాలో ఫుల్ టైమ్ విద్యను అభ్యసించేందుకు ఈ వీసా అనుమతినిస్తుంది. ఆ దేశంలోని విద్యా సంస్థలు ఏటా రెండుసార్లు ప్రవేశాలను అనుమతిస్తాయి. ఆగస్టు- డిసెంబర్ సెమిస్టర్ సమయంలోనే భారత విద్యార్థులు అధికంగా వెళ్తుంటారు.

ఎంఎంటీఎస్ రైలులో అత్యాచార యత్నం

(మొదటిపేజీ తరువాయి)

స్పందించి ఆమెను యశోద ఆసుపత్రికి తరలించారు. ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో హోంశాఖ లేకపోవడం, నేరాల సంఖ్య పెరుగుతుండడం ఆందోళనకు గురిచేస్తుందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం, రైల్వే శాఖ తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఖనిజ సంపద కార్పొరేట్ల పరం

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపించారు. గొండల్‌పురా (హజారీబాగ్), సింగ్‌పూర్ (చత్రా)లలో కొనసాగుతున్న నిరసనలను ఆయన ఎత్తి చూపారు. దళిత అధికార్ మంచ్ రాష్ట్ర అధ్యక్షుడు భంటే జైనేంద్ర కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల కోసం కమిషన్ లేకపోవడాన్ని ఖండించారు. ఇది సమాజానికి అవమానంగా పేర్కొన్నారు. కాగా, రాష్ట్రీయ పరిషత్ సభ్యుడు పీకే పాండే అసంఘటిత రంగంలోని కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ, ప్రజాసంఘాలు చేపట్టిన ఆందోళనను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున పోలీస్ బలగాలను మోహరించింది. ప్రదర్శనకారులు అసెంబ్లీకి చేరుకోకుండా నిరోధించడానికి విధానసభ చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేసి... పెద్దఎత్తున బందోబస్తు చేపట్టింది. వాహనాల రాకపోకలను నియంత్రించింది.

పేదరికానికి చెక్

- సంపన్నులు- పేదలను ఒకేచోటకు చేర్చడమే దీని లక్ష్యం
- మొదటి దశలో 20 లక్షల కుటుంబాలకు ప్రయోజనం
- ఉగాది రోజున అమరావతిలో ప్రారంభం: సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో సంపన్నవర్గాలు పేదలకు సాయమందించేందుకు వీలుగా ప్రభుత్వం పీ-4 విధానం ద్వారా ఒక వేదిక నిర్మిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఉగాది రోజున ప్రారంభించే జీరో పావర్టీ - పీ4 విధానంపై సచివాలయంలో ముఖ్యమంత్రి సోమవారం సమీక్ష నిర్వహించారు. సాయం అందించేందుకు ఎవరైనా ముందుకు రావొచ్చని, ఎవరినీ ఇందుకోసం ఒత్తిడి చేయొద్దని అధికారులకు చంద్రబాబు సూచించారు. ఎన్నారైలు పీ-4లో భాగస్వాములు కావొచ్చన్నారు. గతంలో తన హయాంలో చేపట్టిన జన్మభూమి తరహాలోనే పీ-4 కార్యక్రమానికి ప్రజాదరణ వస్తుందనే నమ్మకం తనకు ఉందన్నారు. పేదలకు మద్దతుగా నిలిచేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చే ఎవరైనా ఈ వేదికను వినియోగించుకోవచ్చని స్పష్టం చేశారు. పీ-4 విధానంలో ప్రభుత్వ పాత్ర కేవలం రెండువర్గాలను ఒక వేదికపైకి తీసుకురావడమేనని, ప్రభుత్వం తరఫున ఎవరికీ అదనపు సాయం ఉండదని చెప్పారు. ఉన్నతవర్గాలు సాయమందించడానికి ముందుకొచ్చేలా వారిలో స్ఫూర్తి నింపాలని ముఖ్యమంత్రి అన్నారు. లబ్ధి పొందేవారిని 'బంగారు కుటుంబం'గా, సాయం చేసే వారిని 'మార్గదర్శి'గా పిలవాలని సూచించారు. బంగారు కుటుంబం ఎంపికలో ఎలాంటి పొరపాట్లు జరగడానికి వీల్లేదని చెప్పారు. గ్రామసభ, వార్డు సభలు నిర్వహించడం ద్వారా తుది జాబితా రూపొందిస్తే వివాదరహితంగా ఉంటుందని సూచించారు. పీ-4 కార్యక్రమానికి, రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం వివిధ వర్గాల ప్రజలకు అమలు చేస్తున్న పథకాలకు ఎటువంటి సంబంధం లేదని సీఎం అన్నారు. పీ-4 సమాజంలో అత్యంత వెనకబడిన వర్గాలకు చేయూతనిచ్చేందుకు చేపట్టిన కార్యక్రమమని అన్నారు. పీ-4కు, ప్రభుత్వ పథకాల అమలుకు ఎటువంటి సంబంధం లేదన్నారు. ప్రజల్లో ఎలాంటి అనుమానాలకు అధికారులు తావివ్వకూడదని తెలిపారు.

ఉగాది రోజున అమరావతిలో జరిగే పీ-4 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రతిగ్రామం నుంచి ఒకరైనా హాజరయ్యేలా, ప్రతి నియోజకవర్గం నుంచి ఒక బస్సు ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. పేదరిక నిర్మూలన - జీవన ప్రమాణాలు పెంచడమే ప్రభుత్వ అంతిమ లక్ష్యమని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా మొదటి దశలో 20 లక్షల కుటుంబాలకు లబ్ధి కలగనుందని, రాష్ట్రంలో పేదరిక నిర్మూలన లక్ష్యం చేరే వరకు పీ-4 కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని చంద్రబాబు స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కొల్లేరు కళకళలాడేనా?

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కాలుష్య నియంత్రణ మండలి, డ్రెయిన్లు, ఇరిగేషన్, మత్స్య శాఖల సంగతి చెప్పనలవికావు. దీనిపై ప్రశ్నిస్తే కొల్లేరు వాసులు ప్రజలు కాదా... ఇక్కడ పుట్టడమే నేరమా అంటూ వంత పాడటం సీపీఐ మినహా అన్ని పార్టీలకు పరిపాటిగా మారింది. స్థానిక నాయకుల సంగతి చెప్పాలంటే...ఏ పార్టీ అధికారంలో ఉంటే వారితో అంటకాగుతున్నారు. కాంటూరు కుదింపు సాధ్యం కాదని తెలిసి కూడా అమాయకులైన కొల్లేరు ప్రజలను మభ్యపెడుతూ అయిన కాడికి దండుకుంటున్నారు. గత ఏడాది సెప్టెంబరులో బుడమేరు, రామిలేరు, తమ్మిలేరులకు వరద వచ్చినప్పుడు ఆక్రమణల చెరలో ఉన్న బుడమేరులో బహుముఖ వ్యూహంతో వరద నీరు కొల్లేరు ద్వారా సముద్రంలోకి వెళ్లిపోయేలా చేస్తాం అన్నారు. నేటికీ ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. సీపీఐ అధినాయకత్వం కొల్లేరు-బుడమేరులో పర్యటించింది. ఆక్రమణల కారణంగానే ముంపు సమస్య ఏర్పడిందని గుర్తించింది. తక్షణం 120 జీవోను అమలు చేసి కొల్లేరు అభయారణ్యాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేసింది. కొల్లేరు ఆక్రమణలను మూడు నెలలలోగా తొలగించాలని సుప్రీంకోర్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో సరస్సును ఆక్రమించుకున్న బడాబాబులు గుండెల్లో గుబులు మొదలైంది. ఈ నేపథ్యంలో కొల్లేరు సమస్య శాశ్వత పరిష్కారానికి కట్టుబడి ఉన్నామంటూ కైకలూరు సమావేశంలో కొల్లేరు పెద్దలు ప్రకటించారు. ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, ఎమ్మెల్సీ జయ మంగళ వెంకటరమణ సంఘీభావం ప్రకటించారు. కొల్లేరు సమస్య సీఎం దృష్టికి తీసుకెళ్తానంటూ ఏలూరు ఎంపీ పుట్ట మహేశ్‌కుమార్ యాదవ్ ప్రకటించారు. కొల్లేరు అంశంపై సుప్రీంకోర్టులో కౌంటర్ పిటిషన్ వేయాలని కొల్లేరు గ్రామాల పెద్దలు నిర్ణయించారు. కొల్లేరు పై చంద్రబాబు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఈ నెల ఐదున ఢిల్లీలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొల్లేరును కాపాడుతారా... లేక ధ్వంసం చేసి ఫిష్ మాఫియాకు దాసోహం అవుతారా అంటూ ఘాటుగా ప్రశ్నించారు. టీడీపీ, బీజేపీ, జనసేన... బరితెగించి మాఫియాకి సహకరిస్తున్నాయని విమర్శించడంతో కొల్లేరు అంశం మరొకసారి తెరపైకి వచ్చింది. కొల్లేరు హద్దుల గుర్తింపు నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ఏలూరులో జరిగిన సమీక్ష లో కలెక్టర్ కె. వేట్రి సెల్వి అధికారులను ఆదేశించారు. కొల్లేరులో ఆక్రమణలు తొలగించాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించిన నేపథ్యంలో మూడో కాంటూరు కుదింపు అంశం పై రాజకీయ హైడ్రామా మళ్లీ మొదలైంది. అధికార, ప్రతిపక్ష పార్టీలు ఓట్ల కోసం మూడవ కాంటూరును బ్రహ్మాస్త్రంగా వాడుకుంటున్నాయి. స్వయానా శాసనకర్తలే శాసనాలను ఉల్లంఘిస్తూ మహా సరస్సులో పర్యావరణ వినాశనానికి నడుం కట్టారు. మూడవ కాంటూరు కుదింపు అసాధ్యమని తెలిసినా కొల్లేరు ప్రజలను మభ్యపెడుతూనే ఉన్నారు.కాంటూరు విషయంలో ఇప్పటికే స్పష్టమైన తీర్పు ఉంది. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు కూడా ఉన్నాయి. అయినప్పటికీ కొల్లేరు ప్రాంతంలోని నాలుగు లక్షల ఓట్ల కోసం అన్ని రాజకీయ పార్టీలు (సీపీఐ మినహా) కాంటూరు అస్త్రాన్ని వినియోగిస్తూనే ఉన్నాయి. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్, 2014లో టీడీపీ, 2019 ఎన్నికల్లో వైసీపీ... కాంటూరు అస్త్రాన్ని ఎక్కుపెట్టి అధికారంలోకి వచ్చాయి. అయినా... ఆక్రమణదారులు అక్రమంగా చెరువులను తవ్వుతూ చేపల పెంపకం కొనసాగిస్తూనే ఉన్నారు. కొల్లేరు సరస్సును అభయారణ్యంగా ప్రకటించిన శాసనకర్తలే శాసనోల్లంఘనకు పాల్పడుతుంటే కొల్లేరుకు గత వైభవం ఎప్పటికీ వస్తుందంటూ పర్యావరణవేత్తలు, ప్రకృతి ప్రేమికులు ప్రశ్నిస్తున్నారు.

పారిశ్రామిక ప్రాంతాల అభివృద్ధి అవశ్యం

శాసనసభలో వివిధ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తెచ్చిన కూనంనేని

విశాలాంధ్ర- హైదరాబాద్ : పారిశ్రామిక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పర్చాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శాసన సభలో సోమవారం పరిశ్రమల అభివృద్ధి అంశంపై ఆయన మాట్లాడుతూ... పెట్టుబడిదారులు హైదరాబాద్‌పైనే మక్కువ చూపుతున్నారని, కొత్తగూడెం జిల్లాలో వనరులు, ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయని, వాటిక అనుగుణంగా చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఆ ప్రాంతాల్లో అభివృద్ధి జరగడంతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని అన్నారు. ఎన్ఎం డీసీ పరిశ్రమ ఆసియాలోనే పెద్దదని, అలాంటి పరిశ్రమ నేడు కొట్టుమిట్లాడుతోందన్నారు. బయ్యారంలో ఐరన్ వోర్ పుష్కలంగా ఉందని, గతంలో కేంద్ర మంత్రులు, అధికారులు సైతం పరిశీలించి బ్రహ్మాండంగా ఉందని చెప్పారని, ఇప్పుడు ఏవేవో కారణాలు చెబుతూ పక్కన పెట్టే ప్రయత్నం చేస్తున్నారని సభదృష్టికి తీసుకువచ్చారు. మైనింగ్ కళాశాల ఉందని, దీన్ని యూనివర్సిటీ చేస్తారని భావించినప్పటికీ అది ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిందని చెప్పారు. ప్రస్తుతం ఎర్త్ వర్సిటీగా తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిసిందన్నారు. సాఫ్ట్‌వేర్ వృత్తి కార్మిక చట్టాలకు వర్తిస్తుందా, పని గంటలు వర్తిస్తాయా, వీరికి ప్రత్యేక చట్టాలు ఏమైనా ఉన్నాయా అనే విషయాలపై దృష్టి సారించాలన్నారు. ఉద్యోగులు ప్రశమదోపిడికి లోనవు తున్నారని చెప్పారు. రాత్రి, పగలు వ్యత్యాసం లేకుండా పని చేస్తున్నారన్నారు. ఆయా పరిశ్రమలు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నాయో గమనించాలన్నారు. బీసీల ఆత్మగౌరవం కోసం నగరంలో వివిధ ప్రాంతాల్లో బీసీ భవనాలు నిర్మిస్తున్నారని, నియోజకవర్గాల్లో వీటిని నిర్మించే విధంగా చూడాలన్నారు. గీత పని వారల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ఈ రంగ కార్మికుల కోసం ధర్మభిక్షం ఎన్నో పోరాటాలు చేశారని, ఆయన పేరుపై ఓ జిల్లా(సూర్యపేట) లేదా విద్యా సంస్థ మరేదైన సంస్థలకు పేరు పెట్టే విధంగా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మంచినీటి ట్యాంక్‌లు శుభ్రం చేయడంపై దృష్టి సారించాలన్నారు. స్థానిక సంస్థలకు ప్రభుత్వం నిధులు ఇవ్వాల్సిందిపోయి వాటి నుంచి నిధులు ప్రభుత్వం తీసుకోవడం సరికాదన్నారు. వివిధ రంగాల్లో పని చేస్తున్న లక్ష 20వేల మందిని విధుల నుంచి తొలగించే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోందని, వారిని రోడ్డున పడేసే విధంగా వ్యవరించరాదన్నారు. గిరిజన ప్రాంతాల్లో పోడు భూములకు పట్టాలను మం జూరు చేయాలని, పట్టాలు లేకపోవడంతో వారికి రైతు రుణమాఫీ, రైతు బంధు పథకాలు అమలవడం లేద న్నారు. గిరిజనుల నుంచి ఏబీసీడీ వర్గీకరణపై డిమాండ్ వస్తుందని, దాన్ని కూడా దృష్టిలోకి తీసుకోవాలని కూనంనేని కోరారు. జబ్బుకు గురై అశక్తులైన వారికి పెన్షన్ అమలు చేయాలని కోరారు. శ్మశాన వాటికల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. శ్మశాన వాటిక సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు క్రిస్టియన్లు తన దృష్టి తీసుకువచ్చారని, దీన్ని పరిష్కరించాలన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ రిజర్వేషన్లు అమలు చేసి ఎస్సీ,ఎస్టీలకు అవకాశం కల్పించాలన్నారు. విద్యా వ్యవస్థను మెరుగుపర్చేందుకు ప్రతి జిల్లాకు ఒక ఐఏఎస్ అధికారిని నియమించాలన్నారు. విదేశీ స్కాలర్‌షిప్ విషయంలో చొరవ చూపాలన్నారు. మైనార్టీల వక్ఫ్‌భూముల విషయంలో కేంద్రం చేపడుతున్న విధానం వల్ల వారు మానసిన వేదనకు లోనవుతున్నారని, ఉన్న చట్టాన్ని కొనసాగించే విధంగా ప్రయత్నం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

మసీదుల వద్ద సకల సౌకర్యాలు

అధికారులకు ఎమ్మెల్యే కూనంనేని ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం: రంజాన్ పండుగను పురస్కరించుకుని బస్తీలు, గ్రామాల్లో ముస్లింలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న అయన సోమవారం కొత్తగూడెం నియోజకవర్గం పరిధిలోని మున్సిపల్, పోలీసు, పంచాయతి రాజ్, మండల స్థాయి అధికారులకు ఆడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏర్పాట్లపై వివిధ సూచనలు, సలహాలు చేశారు. ఉపవాస దీక్షలు, ఇఫ్తార్ విందులు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరుగుతున్నాయని , ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. విధుల్లో తప్పనిసరిగా విద్యుత్ దీపాలు , ఈద్గాలు, మసీదులు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించాలని సూచించారు. పండుగ రోజు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించే ఈద్గాల వద్ద తాగునీటి సౌకర్యం, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని చెప్పారు. పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులను కోరారు.

మంత్రి రిజిజుపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసు

(మొదటిపేజీ తరువాయి)

బహిరంగంగా తప్పుదారి పట్టించారని సభాపతి జగదీప్ ధన్కర్‌కు సమర్పించిన నోటీసులో జైరామ్ పేర్కొన్నారు. తాను చేసినట్లుగా వచ్చిన ప్రకటనలు తప్పుడువి. అవమానకరమైనవని డీకే శివకుమార్ ఖండించినందున...మంత్రి కిరెన్ రిజిజు చేసిన వ్యాఖ్యలు తప్పుడువి...సభను తప్పుదారి పట్టించేవని, ఇది సభా హక్కుల ఉల్లంఘన, సభా ధిక్కారానికి సమానమని పేర్కొన్నారు. ఈ విషయంలో మంత్రిపై ప్రత్యేక హక్కుల చర్యలు ప్రారంభించాల్సిందిగా అభ్యర్థిస్తున్నట్లు రమేశ్ నోటీసులో తెలిపారు. రాజ్యాంగ పదవిలో ఉన్న ఒక సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడానికి తన పార్టీ రాజ్యాంగాన్ని మారుస్తుందని చెప్పారని రిజిజు అంతకు ముందు సభలో వ్యాఖ్యానించారు. శివకుమార్ పేరు నేరుగా ప్రస్తావించనప్పటికీ... మంత్రి శివకుమార్‌ను ఉద్దేశించి మాట్లాడుతున్నట్లు స్పష్టమవుతోంది.

అలహాబాద్ హైకోర్టుకు జస్టిస్ వర్మ బదిలీ

(మొదటిపేజీ తరువాయి)

అలహాబాద్ హైకోర్టుకు తిరిగి పంపాలని సిఫార్సు చేసింది. అయితే ఈ విషయంలో అలహాబాద్ హైకోర్టు బార్ వ్యతిరేకత ఉన్నప్పటికీ ఈ సిఫార్సు వచ్చింది. మార్చి 20న సుప్రీంకోర్టు కొలీజియం జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు తిరిగి పంపాలని ప్రతిపాదించింది. మార్చి 24న కేంద్రానికి దాని సిఫార్సు పంపింది.

ఆర్ఎంపీలు... సమాజానికి చికిత్సా సేవకులు

సమస్యల పరిష్కారానికి కృషి: సీపీఐ నేత రామకృష్ణ

విశాలాంధ్ర-అనంతపురం బ్యూరో: సమాజానికి చికిత్స సేవకులుగా రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ల(ఆర్ఎంపీ)కు గుర్తింపు ఉందని, వారి హక్కుల కోసం తన వంతు కృషి చేస్తానని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక నీలం రాజశేఖర్ రెడ్డి కన్వెన్షన్ హాల్లో సోమవారం అనంతపురం జిల్లా ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 30వ మహాసభ జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన రామకృష్ణ మాట్లాడుతూ... పట్టణ, మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీల సేవలు సుదీర్ఘ కాలం నుంచి కొనసాగుతున్నాయని తెలిపారు. ఒక్క పిలుపుతోనే రోగి దగ్గరకు వెళ్లే మనస్తత్వం కలవారని, సమాజానికి వీరి సేవలు ఎంతో అవసరమనే ప్రభుత్వం గుర్తింపు ఇచ్చిందన్నారు. క్షేత్రస్థాయిలో వారు చేస్తున్న సేవలను అభినందించక తప్పదన్నారు. దశాబ్దాలుగా హక్కుల కోసం వారు ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు సమస్యలను పరిష్కరించకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలలోనూ, హెచ్ఐవీ, తల్లిపాల వారోత్సవాలు, కుటుంబ నియంత్రణ , పల్స్ పోలియో, పారిశుధ్యం తదితర కార్యక్రమాలలో వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేసే దిశగా తాను కృషి చేస్తానని అన్నారు.. ఆర్ఎంపీల సంఘ గౌరవాధ్యక్షుడిగా ఆయన అందించిన ప్రోత్సాహం వెలకట్టలేనిదని ఆర్ఎంపీలు ఈ సందర్భంగా రామకృష్ణను కొనియాడారు. సీపీఐ సత్యసాయి జిల్లా కార్యదర్శి ఎం. వేమయ్య యాదవ్, రైతు సంఘం రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు ఎ. కాటమయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.సంతోశ్ కుమార్, మురళి పాల్గొన్నారు.

సన్నరకం ధాన్యం పండించండి

(మొదటిపేజీ తరువాయి)

యంత్రాలు, తేమ కొలిచే యంత్రాలు, అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని, రైతులు నాణ్యతా ప్రమాణాలతో ధాన్యాన్ని తీసుకురావాలని కోరారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను ప్రారంభించి పూర్తి చేస్తామని తెలిపారు. కలెక్టర్ త్రిపాఠి మాట్లాడుతూ... ధాన్యాన్ని ఆరబెట్టి శుభ్రం చేసి కొనుగోలు కేంద్రాలకు తేవాలని రైతులకు సూచించారు. సమస్యలుంటే జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయంలో ఫిర్యాదుల విభాగానికి తెలియజేయాలన్నారు. ధాన్యం కొనుగోలులో అక్రమాలను అరికట్టేందుకు ఇంటిగ్రేటెడ్ ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేశ్ మాట్లాడారు. డీసీసీబీ డైరెక్టర్ సంపత్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ హరీశ్, మార్కెటింగ్ ఏడీ ఛాయాదేవి పాల్గొన్నారు.

బీమాపై జీఎస్టీ 5 శాతం?

న్యూఢిల్లీ: ఆరోగ్య, జీవిత బీమా పాలసీలను జీఎస్టీ నుంచి మినహాయించాలన్న డిమాండ్‌పై జీఎస్టీ కౌన్సిల్‌లో ఇప్పటికే అనేకసార్లు చర్చ జరిగింది. అయినా ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. త్వరలో జరగబోయే సమావేశంలో ఈ పాలసీలపై పన్ను తగ్గించేందుకు జీఎస్టీ కౌన్సిల్ అంగీకరించవచ్చని తెలుస్తోంది. ప్రస్తుతం 18 శాతంగా ఉన్న జీఎస్టీని పూర్తి రద్దుకు బదులు 5 శాతానికి తగ్గించవచ్చని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. 'జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలను జీఎస్టీ నుంచి పూర్తిగా మినహాయించడానికి మేం అనుకూలంగా లేం. కానీ పన్ను రేట్లు తగ్గించాలని కోరుకుంటున్నాం. ఈ దిశగా మా నివేదిక సిద్ధంచేశాం. దీనిపై నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత జీఎస్టీ కౌన్సిల్‌దే.

అరకు కాఫీ స్టాల్స్ ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

సంగం క్యాంటీన్‌లో గిరిజన కోఆపరేటివ్ సొసైటీ ఈ స్టాళ్లు ఏర్పాటు చేసింది. లోక్‌సభ క్యాంటీన్‌లో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు అరకు స్టాల్ ప్రారంభించారు. రాజ్యసభ క్యాంటీన్‌లో వాణిజ్య వ్యవహారాల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జోయల్ ఓరం, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, టీడీపీ, బీజేపీ ఎంపీలు హాజరయ్యారు.

నారాయణ అభినందన

గిరిజనులు పండించే అరకు కాఫీ ప్రోత్సాహానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం, పార్లమెంటులో రెండు కాఫీ స్టాళ్లు ఏర్పాటు చేయడం అభినందనీయమని సీపీఐ కార్యదర్శి డా.కె.నారాయణ పేర్కొన్నారు. దీనిద్వారా అరకు కాఫీ రుచులు దేశంలోని పార్లమెంటు సభ్యులందరికీ చూపించినట్లు అవుతుందని తెలిపారు.

గిరిజనప్రాంతంలో చిరుధాన్యాలు, పిప్పళ్లు మిరియాలు, ఔషధ ప్రయోజనాలకు ఉపయోగపడే వనమూలికల పెంపుదలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలని నారాయణ సూచించారు. పర్యాటకులకు ఉపయోగపడే రహదారులకేగాక, మారుమూల గిరిజన తండాలకు కూడా రహదారులు నిర్మించాలని, వైద్యసదుపాయం కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

పార్లమెంట్ సభ్యుల వేతనాలు పెంపు

(మొదటిపేజీ తరువాయి)

కూడా 100 శాతం జీతాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి నెల జీతం లక్ష ఉంటే... పెంచిన జీతం ప్రకారం రూ.2 లక్షలు అవుతుంది. కర్నాటక ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అసెంబ్లీలో రచ్చకు దారి తీసింది. ప్రతిపక్షాలు దీన్ని తీవ్రంగా తప్పుబట్టాయి. అధికార పార్టీ నేతలు మాత్రం దీన్ని సమర్థించుకుంటున్నారు. కర్నాటక హోంమంత్రి జి.పరమేశ్వర దీనిపై మాట్లాడుతూ 'సాధారణ ప్రజల ఖర్చులు పెరుగుతున్నట్లే... ప్రజాప్రతినిధుల ఖర్చులు కూడా పెరుగుతున్నాయి. సాధారణ పౌరుడిలాగే... ఓ ఎమ్మెల్యే కూడా ఇబ్బందిపడుతున్నాడు. ఎమ్మెల్యేలతో పాటు ఇతరుల నుంచి కూడా ప్రతిపాదనలు వచ్చాయి. అందుకే ముఖ్యమంత్రి ఈ నిర్ణయం తీసుకున్నారు. అందరూ బతకాలి కదా' అని అన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు టాస్క్‌ఫోర్స్

(మొదటిపేజీ తరువాయి)

దారితీసే ప్రధాన కారణాలను గుర్తించడం, ఉన్న నిబంధనల విశ్లేషణ, రక్షణలను బలోపేతం చేయడానికి అవసరమైన సమగ్ర నివేదికను ఎన్‌టీఎఫ్ సిద్ధం చేస్తుందని ధర్మాసనం తెలిపింది. నివేదిక తయారు చేసే ప్రక్రియలో ఏదైనా ఉన్నత విద్యాసంస్థలో ఆకస్మిక తనిఖీలు చేసే స్వేచ్ఛ ఎన్‌టీఎఫ్‌కి ఉంటుందని కోర్టు పేర్కొంది. 'అదనంగా, ఉన్నత విద్యాసంస్థలలో విద్యార్థుల మానసిక-ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి, ఆత్మహత్యల నివారణకు సమగ్రమైన, ప్రభావవంతమైన విధానాన్ని నిర్ధారించడానికి, మరిన్ని సిఫార్సులు చేయడానికి టాస్క్‌ఫోర్స్ స్వేచ్ఛను కలిగి ఉంటుంది' అని ఉత్తర్వుల్లో వివరించింది. ఎన్‌టీఎఫ్ నాలుగు నెలల్లోపు మధ్యంతర నివేదిక సమర్పించినప్పటికీ ఎనిమిది నెలల్లోపు తుది నివేదిక దాఖలు చేయడం ఉత్తమమని పేర్కొంది. ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్యకు సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులను ఆదేశించడానికి ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. దీనిని సవాల్ చేస్తూ మరణించిన ఇద్దరు విద్యార్థుల తల్లిదండ్రులు దాఖలు చేసిన అభ్యర్థనపై సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. ఆయుష్ అష్నా జులై 8, 2023న తన హాస్టల్ గదిలో చనిపోగా, అనిల్ కుమార్ సెప్టెంబరు 1, 2023న ఐఐటీ ఢిల్లీలోని తన హాస్టల్ గదిలో మరణించాడు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : ధాన్యం కొనుగోలులో నల్గొండ జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంచుతామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.సోమవారం అయన నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలో ఉన్న ఆర్జాలభావి వద్ద ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.అనంతరం రైతులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ రైతులు రబీ ధాన్యాన్ని శుభ్రం చేసి, ఆరబెట్టి తేమను పరీక్షించుకొని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నధాన్యానికి ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసిందని, అంతేకాక సన్నధాన్యం పండించిన రైతులకు క్వింటాలకు 500 రూపాయల బోనస్ ఇస్తున్నదని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ధాన్యం సేకరణ, కొనుగోలులో రైతులు, పిఎసిఎస్‌లు, ఐకెపి కేంద్రాలు ప్రభుత్వానికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ రబి లో జిల్లాలో 375 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని అవసరమైతే ధాన్యం రాకను బట్టి కొనుగోలు కేంద్రాలను పెంచుతామన్నారు. దాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన అన్ని

సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, ప్రత్యేకించి ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీరు, ఓఆర్ఎస్ పాకెట్లు ఏర్పాటు చేయాలని, తాటి మట్టలతో నీడను ఏర్పాటు చేయాలన్నారు. మిల్లర్లు న్యాయంగా వ్యాపారం చేయాలని, తప్పులు చేయవద్దని, తేమ పేరుతో అనవసరంగా రైతులను ఇబ్బందులు చేయవద్దని, లేదంటే తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యానికి ప్రోత్సాహం ఇవ్వడంలో భాగంగా 500 రూపాయలు బోనస్ ఇస్తున్నదని, ఉగాది నుండి ఉమ్మడి నల్గొండ జిల్లా హుజూర్నగర్ నుండి రేషన్ కార్డుదారులకు సన్నబియ్యాన్ని ఇచ్చే కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని, గతంలో ధాన్యం రీసైకిలింగ్ అయ్యే విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఏ ఎం ఆర్ పి ఉదయ సముద్రం ద్వారా సాగు నీరు అందించామని, దీనివల్ల ఈ సంవత్సరం లక్ష ఎకరాల ఆయకట్టు పెరిగిందని, ఎల్లారెడ్డిగూడెం వరకు సాగునీరు అందిస్తున్నామని, శ్రీశైలం హైడెల్ ప్రాజెక్టు ద్వారా ఏఎమ్ఆర్పి నుండి నీరు తీసుకురానున్నామని ఆయన తెలిపారు. బ్రాహ్మణ వెల్లేముల పూర్తి చేయడం ద్వారా మర్రిగూడెం చెరువుకు నీళ్లు ఇస్తామని, కాలువల ద్వారా నీరు అందించేందుకు భూసేకరణ పూర్తి చేయడం జరిగిందని, బ్రాహ్మణ వెల్లేముల ద్వారా కట్టంగూరు, నార్కెట్ పల్లి, మునుగోడులో రానున్న మూడు, నాలుగు నెలల్లో కాలువలు పూర్తయితే లక్ష ఎకరాలకు నీరు రానుందని తెలిపారు. ఎస్ఎల్బీసీ సొరంగం పనులను పూర్తి చేస్తామని, ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని ఆయన చెప్పారు.

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ రైతులు నాణ్యత ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, వ్యవసాయ విస్తరణ అధికారులు ధాన్యాన్ని ధృవీకరించాలని ,దొడ్డు,సన్న ధాన్యాన్ని వేరువేరుగా నింపాలని, ధాన్యం కొనుగోలుకు ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ స్క్వాడ్స్ ఎప్పుడు అందుబాటులో ఉండాలని తెలిపారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుండి రెండు సీజన్లకు సాగునీరు అందించడం వలన లక్ష ఎకరాలయకట్టు పెరిగిందని, ధాన్యం రాకను బట్టి అవసరమైతే కోనుగోలు కేంద్రాలు పెంచుతామన్నారు. గత సంవత్సరం సన్న బియ్యం 45 వేల మెట్రిక్ టన్నుల దాన్యం పండించిన రైతులకు 22 కోట్ల రూపాయల బోనస్ చెల్లించడం

మొక్కలు కనిపించే ప్రత్యక్ష దేవుళ్ళు : కలెక్టర్

విశాలాంధ్ర - కొత్తగూడెం : కొత్తగూడెం నుండే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రకృతి - ఆరోగ్య ఉద్యమానికి శ్రీకారం చుదుతున్నామని ప్రముఖ ప్రకృతి కవి, ప్రకృతి ఆశ్రమం వ్యవస్థాపకులు జయరాజు అన్నారు. ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకు కొత్తగూడెం క్లబ్లో జరిగిన ప్రకృతి ఆరోగ్య మహాసభల్లో ఆయన విశిష్ట అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం జిల్లా కలెక్టర్, జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ కనిపించే మొక్కలే ప్రత్యక్ష దైవాలన్నారు. ప్రతి ఒక్కళ్ళు మొక్కలను పెంచితే ఆరోగ్యం, ఆర్థికం కూడా అదే వస్తుందన్నారు. మన జిల్లాలో సగం భూభాగం అడవులతో నిండిపోయి ఉందన్నారు. అవే మనకు రక్షణగా నిలుస్తాయన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్ సింగ్ ఆయన లాంటి త్యాగాలు ఇపుడు అవసరం లేదని కేవలం ఒక్కొక్కరు ఒక మొక్క నాటితే దేశ ప్రజలు అందరూ చల్లగా ఉంటారన్నారని కలెక్టర్ చమత్కారంతో చెప్పారు. అనంతరం ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ ఆరోగ్యం మహాభాగ్యంగా జీవించాలంటే తల్లిదండ్రుల్లో మొదటి మార్పు రావాలన్నారు. ఈ సందర్భంగా కవి జయరాజును ప్రకృతి ఆశ్రమం సభ్యులు, వచ్చిన అతిథులు ఘనంగా సత్కరించి సన్మానించారు. ప్రజలకు ఉపయోగపడే ఇలాంటి ఆరోగ్య కార్యక్రమాలను గత పదేళ్లుగా నిర్వహిస్తున్న కో ఆర్డినేటర్ సుగుణా రావు, శోభారాణి వారి కుటుంబ సభ్యులను అతిథులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. జల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు దుశర్ల సత్యనారాయణ, తాపా సహాయ కార్యదర్శి డాక్టర్ అనిల్ కుమార్తెంబరేణి, టీజీ ఎ జిల్లా అధ్యక్షులు సంఘం వెంకట పుల్లయ్య, ఆశ్రమ సభ్యులు మహమ్మద్ ముస్తఫా, పర్వీన్ ముస్తాఫా, దయానంద సాగర్, బంగారు శంకర్, కేహెచ్ ప్రసాద్, కమల రాణి, ఆవుల శ్రీకాంత్, ఎల్దండి పూర్ణచంద్రరావు, నంది శశి కుమార్, శ్రీరంగం సంపత్ కుమార్, కొండ జంపన్న తదితరులు పాల్గొన్నారు. ఈ మహాసభల్లో ప్రకృతి ఆశ్రమం కోఆర్డినేటర్‌గా సుగుణారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా 50 మందిని ఎన్నుకున్నారు.

ప్రశాంత ఎన్నికలకు కృషి చేసిన ఎస్పీకి ప్రశంస

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్: గత పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సక్సెస్‌గా విధులు నిర్వహించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజుకు ప్రశంసలు లభించాయి. ఈ మేరకు సోమవారం సిఆర్పిఎఫ్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ చారుసిన్హా చేతుల మీదుగా డీజి డిస్క్, ప్రశంసా పత్రాన్ని ఎస్పీ రోహిత్ రాజు అందించి సత్కరించారు. హైదరాబాదులోని సిఆర్పిఎఫ్ సౌత్ సెక్టార్ కార్యాలయంలొ జరిగిన కార్యక్రమంలో ఎస్పీకి ఈ పురస్కారం అందించారు. కాగా మూడు రాష్ట్రాల సరిహద్దు గల కొత్తగూడెం జిల్లాలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు అనేక ఉన్నాయి. ఏ సమయంలో ఏ పరిణామం సంభవిస్తుందో తెలియని పరిస్థితులు జిల్లా బోర్డర్లో ఉంటాయి. ఈ క్రమంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది, ఇతర శాఖల అధికారులను సమన్వయం చేస్తూ గడచిన పార్లమెంటు ఎన్నికల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి సజావుగా ఎన్నికలు జరిగేలా ఎస్పీ కృషి చేయడంతో ఈ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా సిఆర్పిఎఫ్ ఐజిపి చారుసిన్హా ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. జిల్లాలో విధులు నిర్వర్తించే పోలీస్ అధికారులు, సిబ్బంది సమిష్టి కృషిని ఐజీపి ఈ సందర్భంగా కొనియాడారు.

ఖబరస్థాన్ స్థలానికి అనుమతి మంజూరు చెయ్యండి

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : జిల్లాలోని చుంచుపల్లి మండలం వెంకటేశ్వర కాలనీలో ముస్లిం స్మశానవాటికకు స్థలాన్ని కేటాయిస్తూ తహశీల్దార్ 2022 పంపిన నివేదిక ఆమోదించి వెంటనే ఆదేశాలు జారీ చెయ్యాలని జిల్లా మైనారిటీ అధ్యక్షులు యండీ. యాకూబ్ పాషా కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం జరిగిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ ఖబరస్తాన్ స్థలం కోసం గతంలో స్మశానవాటిక స్థలాన్ని కేటాయించాలని ప్రజావాణిలో 2022 ఫిబ్రవరిలో కలెక్టర్‌ను కోరడం జరిగిందన్నారు. అప్పట్లోనే కలెక్టర్ అదేషుస్తూ ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని తహశీల్దార్‌కు చెప్పడం జరిగిందన్నారు. దింతో సర్వే నేం. 137/1లో గల ప్రభుత్వ భుమి నుంచి 1 ఎకరం స్థలాన్ని కేటాయిస్తూ, ఆమోదం కొసం హద్దుల గుర్తింపుతోపాటు ఆర్డీవో ద్వారా 30 సెప్టెంబర్ 2022 నివేదికను కలెక్టర్ కార్యాలయానికి పంపించి మూడు సంవత్సరాలు గడిచిందని ఆవేదన వ్యక్తం చేసారు. ఇప్పటికి ఆ స్థలం కోసం అనుమతి ఇవ్వలేదన్నారు. ఈ విషయాన్ని గడచిన నవంబర్ లో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పిర్యాదు చేసినా చర్యలు శూన్యమన్నారు. స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అయినా పట్టించుకోని వెంకటేశ్వర కాలనీలో ముస్లింల కోసం ఖబరస్థాన్ స్థలానికి అనుమతి ఇవ్వాలని యాకుబ్ కోరారు.

ఏజెన్సీలో బినామీలను అడ్డుకుంటాం

విశాలాంధ్ర - చర్ల : ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన ఇతర కాంట్రాక్టర్లు, వ్యాపారులు పెరిగి పోతున్నారని దింతో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ విమర్శించారు. మండల కేంద్రం చర్ల మేజర్ పంచాయతీలో జరిగే బహిరంగ సంత వేలం పాటను షెడ్యూల్ ఏరియా పిసా చట్ట ప్రకారం నిర్వహించాలని డిమాండ్ చేసారు. జిఎస్పీ బృందం గ్రామ పంచాయతీ కార్యదర్శికి సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో అమాయక గిరిజన ప్రజలను దగా చేస్తు బినామీ పేర్లతో డీడీలు కట్టించి అనేక మంది గిరిజనేతలు పాటలో పాల్గొంటున్నారని ఆయన ఆరోపించారు. బినామీ పేర్లతో చలామణీ అవుతున్న వారిని గుర్తించి వారిని అధికారులు కట్టడి చెసి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనికి భిన్నంగా గిరిజనేత రులు దోచుకోవటానికి ఎందుకు అవకాశం ఇస్తున్నారని స్థానిక అధికారులను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిఎస్పీ నాయకులు పూణెం వరప్రసాద్, ఇరప ప్రకాష్, స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర నాయకులు రవీంద్ర పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ ద్వారా మిర్చి, మొక్కజొన్న కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర - ఖమ్మం : రైతులు పండించిన మొక్కజొన్న, మిర్చి, ధాన్యాన్ని ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజకు వినతి పత్రాన్ని అందజేశారు. ఖమ్మం జిల్లాలో విస్తారంగా సాగుచేసిన మొక్కజొన్న పంట దళారీల చేతిలో రైతులు బలికాకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకొని రైతులకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అందుబాటులో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మొక్కజొన్న ధాన్యం కొనుగోలుకు తక్షణ చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు ఎండి మౌలానా, అడపా రామకోటయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అకాల వర్షాలు గాలి దుమ్ములు వచ్చే అవకాశం ఉన్నందున మొక్కజొన్న పంట పండించిన రైతులకు ప్రభుత్వ అధికారులు అండగా నిలవాలని కోరారు. వీరితో పాటు రైతుసంఘం నాయకులు బట్ట బాబురావు, కొమ్మినేని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - ఖమ్మం : ప్రజా సమస్యలను అధికా రులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమ వారం ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు డా. పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డిలతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. ముదిగొండ మండలం సువర్ణపురం గ్రామానికి చెందిన వేల్పుల వెంకట రామారావు తాను ఓం శ్రీ సాయి బాలాజీ సెక్యూరిటీ సంస్థ నందు ఫీల్డ్ ఆఫీసర్‌గా పని చేస్తున్నానని, డిసెంబర్, జనవరి సంబంధించిన జీతం రాలేదని, తన జీతం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కలెక్టరేట్ డీ విభాగానికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం నగరం టేకులపల్లి కేసిఆర్ టవర్స్ కు చెందిన కే. లక్ష్మణ్ తన బాబు సెంచరీస్కూల్ లో 4వ తరగతి చదువుతున్నారని, స్కూల్ యాజమాన్యం తన బాబుని చిన్నచూపు చూస్తుందని, ఫీజు కట్టలేదని వేధిస్తుందని, సెంచరీ స్కూల్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేశారు. నేలకొండపల్లి మండలానికి చెందిన రిపోర్టర్లు బైరం ప్రసాదరావు, హనుమంతరావు, శివ రాజు సతీష్ సింగారెడ్డి పాలెం రెవిన్యూ పరిధి సర్వే నెంబర్ 159 లో పది మంది విలేకరులకు ప్లాట్లు పంపిణీ చేశారని, జాతీయ రహదారిలో 7 ప్లాట్లు పోగా, 3 మిగిలాయని, వాటిలో తహసిల్దార్ ప్రభుత్వ భూమి అని బోర్డులు పెట్టారని, వీటిని పరిశీలించి భూమి తమకు తిరిగి కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. డిఆర్డీవో సన్యాసయ్య, కలెక్టరేట్ ఏవో అరుణ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - వనపర్తి : ప్రజావాణి లో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయ కుండా ఎప్పటి కప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్యతో కలిసి ప్రజల నుంచి అదనపు కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణి, మంత్రి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు, జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం ప్రజావాణికి మొత్తం 47 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.

శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు దోహదం : ఎస్పీ

విశాలాంధ్ర - కొమరం భీం : కౌటాల పోలీస్ స్టేషన్ వేదికగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్‌ను మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవా నికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ డివీ శ్రీనివాసరావు హాజరయ్యి, రిబ్బన్ కట్ చేసి, బెలూన్స్ ఎగరవేసి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యువతకు నిత్యజీవితంలో క్రీడలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఈ టోర్నమెంట్ నిర్వహించడం జరిగిందని. జిల్లా వ్యాప్తంగా మొత్తం 64 టీమ్స్ పాల్గొంటున్నాయని, మొదటి మూడు గెలుపొందిన టీమ్స్ కి నగదు బహుమతి, ప్రశంస పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. యువత ప్రజలు అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలని బెట్టింగ్, లోన్ యప్స్, వంటి జోలికి వెళ్లి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని అన్నారు.

వేటగాళ్ల ఉచ్చుకి యువకుడు బలి

విశాలాంధ్ర - కారేపల్లి : వన్యప్రాణులను వేటాడేందుకు కొందరు దుండగులు అమర్చిన విద్యుత్తు తీగలు ఓ నిండు ప్రాణాలు తీశాయి. తన మేకలను వెతుక్కుంటు వెళ్లగా వేటగాళ్లు అమర్చిన కరెంట్ తీగలు తగిలి యువకుడు మృత్యువాతపడ్డాడు. ఈ ఘటన మండలంలోని చీమలపాడులో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం చీమలపాడు గ్రామానికి చెందిన తండ్రి కొడుకులు మేకల కోటయ్య, కరుణాకర్‌లు ఇద్దరు కలిసి తమ మేకలు తప్పిపోవడంతో రాత్రి వాటిని వెతుకుంటు పాటిమిది గుంపు పంచాయితీ శివారున బోడ్డు బండ వాగు వైపు వెళ్లగా కొందరు దుండగులు అడవి జంతువుల కోసం ఉచ్చులు బిగించారు. వాటికి కరెంట్ సరఫరా అయ్యేలా ఏర్పాట్లు చేశారు. కంటికి కనిపించకుండా ఏర్పాటు చేయడంతో మేకల కరుణాకర్ (18) వాటిని గమనించకుండా అలాగే ముందుకు వెళ్లాడు. దీంతో ఆయనకు కరెంట్ ఉచ్చులు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడకక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కరుణాకర్ మృతితో చీమలపాడు గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

ప్రతి అర్జీపై తక్షణ చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : జిల్లాలో ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి 69 దరఖాస్తుదారులు తమ సమస్యల పరిష్కారం కోసం అర్జీలు సమర్పించారు. రెవెన్యూ శాఖ 25, పౌరసరఫరాల శాఖ 02,సర్వే ల్యాండ్ 3, పంచాయతీ, పిటి విభాగం 7, పంచాయతీరాజ్ 4, డి.ఆర్.డి.ఓ 3,మున్సిపల్ 10, వెల్ఫేర్ డిపార్ట్మెంట్ 5, విద్యాశాఖ 2, వ్యవసాయ శాఖ 3, పశు వైద్య శాఖ 2, వైద్య, ఆరోగ్యశాఖ 3, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ ప్రతి అర్జీపై తక్షణ చర్యలు తీసుకుని సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే, ప్రజల ప్రధాన సమస్యలపై పూర్తి దృష్టి పెట్టి, పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, డీ.ఆర్.ఓ పద్మజ రాణి, జడ్పీసీఈఓ జానకి రెడ్డి, ఆర్.డి.ఓలు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ప్రజావాణిలో ఫిర్యాదు చేసే దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా, సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రెవిన్యూ సి. హెచ్. మహేందర్ జి. ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్.మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డిఓ వెంకటేష్‌లతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు. ప్రజావాణికి మొత్తం 27 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా రెవిన్యూ భూమి సమస్యలపై 8 దరఖాస్తులు, ఇతర శాఖల కార్యాలయాలకు సంబంధించినవి 19 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన దరఖాస్తులు పరిష్కరించాలి : పిఓ చిత్ర మిశ్రా

గిరిజన దర్బార్లో వచ్చిన దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని ఏటూరునాగారం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి చిత్ర మిశ్రా సెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటిడిఏ సమావేశం మందిరంలో గిరిజన దర్బార్ నిర్వహించి, స్వయంగా గిరిజనుల నుండి పిఓ దరఖాస్తు స్వీకరించి మాట్లాడుతూ దర్బార్‌లో 15 దరఖాస్తులు వచ్చాయని, వాటిని సత్వరమే పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్, జగన్ మోహన్ రెడ్డి,అనిల్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహనా ర్యాలీ

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి: ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం పురస్కరించుకొని జిల్లా ప్రధాన ఆసుపత్రి నుండి పురవీధుల గుండా అమర్ చండ్ కల్యాణమండపం వరకు క్షయ వ్యాధి నివారణ అవగాహనా ర్యాలీని నిర్వహించారు. తదనంతరం అమర్ చండ్ కల్యాణమండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. జి. అన్నా ప్రసన్న కుమారి మాట్లాడుతూ జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన నిక్షయ్ శివిర్ 100 రోజుల కార్యక్రమం ద్వారా హైరిస్క్ జనాభా 120345 మంది లక్ష్యం కాగా 132944 (110 శాతం) మందికి టి.బి. స్క్రీనింగ్ చేసి అందులో 14723 మందిని టి.బి. అనుమానితులను గుర్తించడం జరిగినది. అందులో 8,584 మందికి తెమడ పరీక్ష 13263 మందికి ఎక్స్రే పరీక్ష నిర్వహించగా తెమడ పరీక్ష ద్వారా 226 మందికి ఎక్స్రే ద్వారా 276 మందికి అనగా మొత్తం 502 మందిని క్షయ వ్యాధి సోకిన వారిగా గుర్తించడం జరిగినది. వీరందిరికి చికిత్స ప్రారంబించనైనది. వీరికి పౌష్టికాహారం కోసం న్యూట్రిషన్ కిట్స్ లను చిన్న తరహా పరిశ్రమల సంస్థ సౌజన్యంతో అభయ ఫౌండేషన్ వారి ద్వారా అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు కావేటి రాజగో పాల్, టిబి ప్రోగ్రామ్ అధికారి డా. కె.వి.సుధాకర్ రెడ్డి, ఇతర ప్రోగ్రామ్ అధికారులు డా. బి. శ్రీరాములు, డా. వి.వాణిశ్రీ, డా. బి.కిరణ్ కుమార్, వైద్యాధికారి డా. శ్రవణ్ కుమార్, ఐసిటిఎస్ టిబి ప్రోగ్రాం సిబ్బంది, ఎ.ఎన్.ఎం.లు పాల్గొన్నారు.

ములుగుజిల్లాల్లో 210 చలివేంద్రాలు ఏర్పాటు

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : రాష్ట్ర పంచాయతీ రాజ్ ప్రిన్సిపాల్ సెక్రటరీ, కమిషనర్, ములుగుజిల్లా కలెక్టర్, ఆదేశాల మేరకు ములుగు జిల్లాలో ఎండ తీవ్రత దృష్ట్యా, ప్రతి గ్రామ పంచాయతీ లలో చలి వేంద్రాలు, ప్రజలకు అందుబాటులో ఉండే ప్రదేశాలలో ఏర్పాటు చెయ్యడం జరిగిందని, జిల్లా పంచాయితి అధికారి దేవ్‌రాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఒక్కటి, మేజర్ గ్రామపంచాయతీలల్లో 3, నుండి 5 వరకు చలి వెంద్రాలు, మొత్తం జిల్లాల్లో 210 ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం, మండుతున్న ఎండల సమయంలో ప్రజలు తమ అవసరాలు నిమిత్తం, బయటికి వెళ్లినప్పుడు తాగు నీటికి ఇబ్బంది ఏర్పడకుండా , చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లా ప్రజలు చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మహిళా నేరాలను అరికట్టడంలో షీ టీమ్స్ పాత్ర కీలకం : ఎస్పీ

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్: మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టడంలో షీ టీమ్స్ ముఖ్య పాత్ర పోషిస్తున్నారని జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ అన్నారు. సోమవారం షీ టీమ్స్ మహిళా పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సందర్శించి, మహిళా భద్రత, హక్కుల పరిరక్షణ, హింసా వివరాలు, కేసుల ప్రగతి మొదలైన అంశాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ మహిళలపై జరిగే నేరాలను పూర్తిగా అరికట్టేందుకు షీ టీమ్స్ కీలకపాత్ర పోషిస్తున్నాయని అన్నారు. బాధితులకు తక్షణ సహాయం అందించి, న్యాయం కల్పించేందుకు నిరంతరం పని చేస్తుందని తెలిపారు. మహిళా పోలీస్ స్టేషన్లను మరింత బలోపేతం చేసి, ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి తేవాలని అన్నారు. కాలేజీలు, కార్యాలయాలు, బస్టాండ్లు, పబ్లిక్ ప్లేసుల్లో మహిళల రక్షణకు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. మహిళల భద్రతకు సంబంధించి హెల్ప్‌లైన్ నంబర్లు విస్తృతంగా ప్రచారం చేయాలని, నేర నివేదికలు, పెండింగ్ కేసులు, బాధితులకు అందిస్తున్న సహాయం, కౌన్సెలింగ్ సేవలు, స్టేషన్‌లో మహిళా సిబ్బంది సంఖ్య గురించి సమీక్షించారు. బాధిత మహిళలతో మాట్లాడి, వారికి పోలీస్ డిపార్ట్‌మెంట్ నుంచి అందించాల్సిన సహాయంపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.బి ఇన్స్పెక్టర్ చంద్రమౌళి, సీఐ సరవయ్య, ఎస్.ఐ దీపిక, షీ టీమ్స్ ఆర్.ఎస్.ఐ సునందా, ఎస్ఐ ఆనందం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్జీఓసిపి 5ను తనిఖీ చేసిన డైరెక్టర్

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి : సోమవారం సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్ ఎల్‌వి సూర్యనారాయణ ఆర్జీ ఓ సి-5 ని తనిఖీ చేసారు. ఉత్పత్తి, ఉత్పాదకత పెంచే దిశగా తీసుకుంటున్న చర్యలను సమీక్షించి తగు సూచనలు చేశారు. షావేల్ పని స్థలాలను, యంత్రాల పని విధానాలను పరిశీలించారు. ఎండాకాలంలో తీసుకుంటున్న జాగ్రత్తలు గురించి తెలుసుకున్నారు. గ్యాలరీలలో ఫైర్ ఆపదానికి తీసుకుంటున్న చర్యలు సమీక్షించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ వన్ జనరల్ మేనేజర్ లలిత్ కుమార్, ప్రాజెక్ట్ ఆఫీసర్ చంద్రశేఖర్, ప్రాజెక్టు మేనేజర్ అనిల్ గబలే, సేఫ్టీ ఆఫీసర్ పొనుగోటి శ్రీనివాస్, సర్వేయర్ దీటి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన తహసిల్దార్

విశాలాంధ్ర - పినపాక : మండల వ్యాప్తంగా కొనసాగుతున్న పదవ తరగతి పరీక్షల సరళిని, సెంటర్ల నిర్వహణను పినపాక తహసిల్దార్ అద్దంకి నరేష్ పరిశీలించారు. సోమవారం మండలంలోని ఎల్చిరెడ్డిపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల సౌకర్యాలు, పరీక్ష నిర్వహణ తీరును ఆయన పరిశీలించారు. అన్ని గదులను ఆయన కలియ తిరిగారు. వెంటిలేషన్, తాగునీరు తదితర మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. పరీక్షల నిర్వహణపైన ఉపాధ్యాయులకు పలు సూచనలు అందించారు. సజావుగా అన్ని పరీక్షలు జరిగేలా మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. ఎలాంటి మాస్ కాపియింగ్‌కు తావు లేకుండా నిరంతరం గమనించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ పర్యవేక్షణలో ఆయన వెంట రెవెన్యూ ఇన్స్పెక్టర్ రమేష్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : ఇళ్ల స్థలాలు కేటాయించాలని జిల్లా కేంద్రంలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న జర్నలిస్టులకు బిఆర్ ఎస్ నేత, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు మద్దతు పలికారు. ఈ మేరకు ఆయన ఆదేశానుసారం కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం గ్రీవెన్స్ డే లో బిఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందించారు. కొత్తగూడెం జర్నలి స్టులకు గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో గంగాభిషాన్ బస్తి వద్ద కేటాయించిన 10 ఎకరాల 18 గుంటల భూమిని కేటాయించడం జరిగిందన్నారు. ఈ స్థలాన్ని జర్నలిస్టులకు ఇచ్చేందుకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ అధికారులు రూ. 2.30 కోట్లు చెల్లించాలని చెప్పడం విడ్డురంగా ఉందన్నారు. డబ్బులు కట్టకుంటే ఆ స్థలాలు ఇవ్వడం జరగదని చెప్పడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. భూమిని ఎలాంటి కండిషన్లు పెట్టకుండా ఉచితంగా ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్‌కు బిఆర్ఎస్ నేతలు వినతిపత్రం ఇచ్చారు. లక్ష్మీదేవి పల్లి మండల అధ్యక్షులు కొట్టి వెంకటేశ్వ రరావు, మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్, ఉర్దూగర్ మాజీ చైర్మన్ అన్వర్ పాషా, ఆత్మ కమిటీ డైరెక్టర్ శేషాద్రి వినోద్ కుమార్, బొందుగుల శ్రీధర్, కరాటే శ్రీనివాస్ యాదవ్, మాజీ సర్పంచ్ తాడూరి రజాక్, పొదిలి వెంకటాచలం, సురేష్, మురళి, తంబళ్ల శ్రీను, గడ్డి గుట్ట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

అభివృద్ధిలో కేరళ ముందంజ

దేశ రాజకీయాలలో కేరళకు ప్రత్యేకత ఉంది. ఆ రాష్ట్ర రాజకీయాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. కేరళ పేరు వింటేనే దేశ ప్రజలలో చైతన్యం రగులుతుంది. విద్వేష, కుళ్లు రాజకీయాలకు అక్కడి రాజకీయనేతలు దూరం. అక్కడి పోరాటాలు సమస్యలపైనే తప్ప రాజకీయపరంగా కానేకాదు. ప్రగతిశీల, అభ్యుదయ భావాలకు నిలయమైన కేరళలో అనేక ఆదర్శ ఘటనలు చోటు చేసుకున్నాయి. అక్కడి వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్డీఎఫ్)లోని ప్రధాన భాగస్వాములు సీపీఎం, సీపీఐ అనుసరిస్తున్న విధానాలు రాజకీయ విలువలను ద్విగుణీకృతం చేస్తున్నాయి. ఎల్డీఎఫ్ నాయకత్వానికి ఎన్నికల వరకే రాజకీయం. ఆ తరవాత ప్రజాభ్యుదయమే ప్రధాన అజెండా. అన్ని విషయాల్లోనూ వీలైనంత వరకు ప్రతిపక్షాన్ని కలుపుకుపోతోంది. అన్ని అంశాలపైనా తరుచూ ప్రధాన ప్రతిపక్షంతో చర్చించడం, అఖిలపక్ష సమావేశాలలో నిర్ణయాలు తీసుకోవడం ద్వారా ముందుకు సాగుతోంది. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, పేదరికంలో మగ్గుతున్న వారి ఆర్థికాభివృద్ధికి ఎల్డీఎఫ్ ప్రభుత్వం అనేక నిర్మాణాత్మక చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా వృద్ధులు, మైనారిటీలు, యువత సంక్షేమం కోసం దేశంలో ఏ రాష్ట్రం తీసుకోని చర్యలు చేపడుతోందంటే అతిశయోక్తిలేదు. అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో దేశంలోనే కేరళ అగ్రస్థానంలో ఉందని చెప్పవచ్చు. సంక్షేమ చర్యలలో భాగంగా దేశంలోనే తొలిసారిగా వృద్ధుల కోసం కమిషన్ ఏర్పాటు చేసేందుకు చట్టాన్ని ఆమోదించింది. ఈ కొత్త కమిషన్ వృద్ధుల హక్కులు, సంక్షేమం, పునరావాసం, పరిరక్షణపై దృష్టి సారిస్తుందని ముఖ్యమంత్రి పినరయి విజయన్ చెప్పారు. ఈ కమిషన్ 2024 డిసెంబరు 1 నుంచి అమలవుతుందని తెలిపారు. వృద్ధులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, నిర్లక్ష్యం, దోపిడీ, ఒంటరితనం వంటి సమస్యలను పరిష్కరించడానికి ఈ కమిషన్ ప్రాధాన్యతనిస్తుంది. ఈ సమస్యలను పరిష్కరించడానికి అవసరమైన మార్గదర్శకాలను అందించే బాధ్యత కూడా ఈ కమిషన్‌పైనే వుంటుందని విజయన్ తెలిపారు.

వచ్చే 25 ఏళ్లలో ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాల స్థాయికి కేరళలో జీవన ప్రమాణాలను పెంచడమే లక్ష్యంగా ఎల్డీఎఫ్ ప్రభుత్వం పనిచేస్తోంది. గత తొమ్మిదేళ్లుగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్రాన్ని ఈ లక్ష్యానికి చేరువ చేస్తున్నాయని చెప్పవచ్చు. కేరళలో పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పుడు అనేక మంది పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారు. అలా ఆసక్తి చూపుతున్న వారిలో మహిళలు అధికంగా ఉండటం గమనార్హం. ప్రైవేట్ రంగ పెట్టుబడులను ఉపయోగించుకునే ప్రయత్నం ముమ్మరంగా జరుగుతోంది. పెట్టుబడులను ఆకర్షించడంలో కేరళ విజయవంతమైంది. ఇప్పటివరకు "పెట్టుబడులకు అనుకూలంగా లేని" రాష్ట్రంగా భావించిన కేరళలో పెట్టుబడులు పెట్టేందుకు కొత్త వాతావరణం ఏర్పడిందని అన్ని నివేదికలు సూచిస్తున్నాయి. పెట్టుబడుల సమీకరణలో పాలక ఎల్డీఎఫ్ చర్యలను ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌తో పాటు బీజేపీ సీనియర్ కేంద్ర మంత్రులు అందరూ మద్దతు ఇవ్వడం శుభపరిణామం. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదికలో కేరళ తన ఉనికిని చాటుకోగలిగింది. స్టార్టప్, పర్యావరణ వ్యవస్థలో కేరళ చేపట్టిన స్థిరమైన ప్రయత్నాలు ప్రపంచ గుర్తింపును పొందాయి. 2024 లో గ్లోబల్ స్టార్టప్ ఎకోసిస్టమ్ రిపోర్ట్ (జీఎస్ఈఆర్) జాబితాలో రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. రెండు సంవత్సరాల క్రితం బీఆర్ఏపీ కింద 28 వ స్థానంలో ఉన్న కేరళ వ్యాపార కేంద్రీకృత సంస్కరణలు, రెండు వర్గాలు, పౌర కేంద్రీకృత సంస్కరణలతో ఏడు విభాగాలలో ర్యాంకింగ్‌లో దేశంలో అగ్రస్థానంలో నిలిచింది. క్యాజువల్ కార్మికులకు జాతీయ సగటుకన్నా కేరళలోనే ఎక్కువ వేతనాలు చెల్లిస్తున్నారు. క్యాజువల్ పురుష కార్మికుల సగటు నెలవారీ వేతనంలో కేరళ మొదటి స్థానంలో ఉన్నది. ఉద్యోగార్థుల అర్హతలు, ఉద్యోగ రంగం అవసరాల మధ్య అసమతుల్యత కారణంలో రాష్ట్రంలో యువతకు తగినంత ఉపాధి ఉండడంలేదు. ఉద్యోగ మార్కెట్ డిమాండ్ చేసే దానికంటే ఇక్కడి యువత ఎక్కువ అర్హతలను కలిగి ఉండడంతో వారికి తగిన ఉద్యోగాలు లభించడంలేదు. ఎల్డీఎఫ్ పాలనలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై విదేశీ విశ్వవిద్యాలయాలు కేరళలో క్యాంపస్‌లను ఏర్పాటు చేయడంతో రాష్ట్రంలో ఉన్నత విద్యలో నాణ్యత మెరుగుపడుతోంది. యువత ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లి అక్కడ స్థిరపడే ధోరణికి అడ్డుకట్ట వేస్తోంది. ఎల్డీఎఫ్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా ఆరేళ్లలో 2,34,567 భూపట్టాలు పంపిణీ చేసింది. ఏడాది వ్యవధిలో 54,535 భూపట్టాలు జారీ అయ్యాయి. ఇందులో ఎలాంటి రికార్డులు లేని వ్యవసాయ భూమి కలిగి ఉన్న వారూ ఉన్నారు. నిరుపేదలకు ఆరేళ్లలో ప్రభుత్వం 2,96,008 ఇళ్లు అందించింది. తలదాచుకునేందుకు చోటు లేని వారికి ఇల్లు ఎప్పుడూ కలగానే ఉంటుంది. అలాంటి వారితోపాటు ప్రకృతి వైపరీత్యాలు, జీవిత కష్టాలు భరించే వారి కోసం ఎల్డీఎఫ్ ప్రభుత్వం లైఫ్ మిషన్ ద్వారా 2023 సెప్టెంబర్ 30 నాటికి 3,54,712 కుటుంబాలకు ఆశ్రయం కల్పించింది. ఈ విధంగా అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ఎల్డీఎఫ్ ప్రభుత్వం పాటుపడుతోంది. అసెంబ్లీ చరిత్రలోనే తొలిసారిగా మహిళా స్పీకర్ ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది ఎల్డీఎఫ్ ప్రభుత్వమే. అసెంబ్లీ సమావేశాల తరుణంలో స్పీకర్, డిప్యూటీ స్పీకర్ అందుబాటులో లేనప్పుడు ఈ ప్యానెల్ సభా కార్యకలాపాలను నియంత్రిస్తుంది. మహిళలు అన్నింటా సమానమని, విద్య, వైద్య, వ్యాపారం సహా అన్ని రంగాల్లోనూ తమ ప్రతిభ చాటుకుంటున్నారని గుర్తించిన ఎల్డీఎఫ్ ప్రభుత్వం 2022 డిసెంబరులో జరిగిన శాసనసభా సమావేశాలకు స్పీకర్, డిప్యూటీ స్పీకర్ అందుబాటులో లేనప్పుడు మహిళా ప్యానెల్ సభను విజయవంతంగా నడపడం విశేషం. మహిళలకు ఎల్డీఎఫ్ ప్రభుత్వం ఇచ్చే ప్రాధాన్యతను ఈ నిర్ణయం ప్రతిబింబిస్తున్నది. ప్యానెల్ స్పీకర్ల నియామకంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కూడా ప్రాధాన్యత ఇవ్వటం మరో గొప్ప విషయం. రాష్ట్రంలోని 165 ఏళ్ల చరిత్ర కలిగిన క్యాథలిక్ చర్చిలో ట్రస్టీగా తొలిసారిగా ఈ నెలలో ఒక మహిళను నియమించారు. సాధారణంగా చర్చిల్లో ట్రస్టీ బాధ్యతలను ఇప్పటి వరకు పురుషులే నిర్వహిస్తున్నారు. ఇందుకు భిన్నంగా అలప్పుజా పట్టణ శివారుల్లో ఉన్న అవర్ లేడీ ఆఫ్ అజంప్షన్ చర్చి ట్రస్టీగా 39 ఏళ్ల సుజా అనిల్‌ను నియమించారు. మార్చి 10 న జరిగిన కార్యక్రమంలో మరో ఇద్దరు పురుష ట్రస్టీలతో పాటు సుజా అనిల్ కూడా బాధ్యతలు స్వీకరించారు. 'మహిళా సాధికారితపై చర్చి నిబద్ధతకు అనుగుణంగా ఒక మహిళా ట్రస్టీని నియమించడం స్వాగతించదగ్గ విషయం. తనకు తెలిసినంత వరకూ కేరళలోని క్యాథలిక్ చర్చ్‌ల్లో ట్రస్టీగా ఒక మహిళను నియమించడం ఇదే మొదటిసారని ఫాదర్ జేవియర్ చెప్పారు. సుజాను ఒక చురుకైన, అంకితభావం కలిగిన సభ్యురాలుగా జేవియర్ వర్ణించారు.

అమాయకులు

చింతపట్ల సుదర్శన్

రంగుల పండగనాడు ఎవడో చల్లిన ఎరుపురంగు నా మెడనీ, తోకనీ వదలడం లేదు ఎన్ని బురద గుంటల్లో దొర్లినా అంది డాగీ అరుగు మీదకు వంగిన చెట్టు నీడన కూచుని. మొండి గోడ మీద పడుతున్న నీడలో సర్దుకు కూచున్న డాంకీ మాట్లాడకుండా పళ్లు బయట పెట్టింది. ఒకడు కష్టపడుతుంటే మరొకడు ఎకసెక్కంగా నవ్వడం ఈ దేశపు నీళ్లల్లోనే ఉందనుకుంటా అంది డాగీ విసురుగా. సారీ బ్రో నేను కావాలని నవ్వలేదు. నా ఎక్స్‌ప్రెషనే అంత. మనుషుల్లా వెకిలి నవ్వుల వికటహాసాలూ విసిరే ఛాన్సు మనకు లేదులే. అయినా హోళీనాడు బయట తిరగడం నీ తప్పే కదా. రంగులు చల్లే వాళ్ల స్వేచ్ఛను అరికట్టలేం కదా. అందుకే కదా ఒకానొక మహానుభావుడు హోళీనాడు ఒక వర్గం వాళ్లని ఇల్లు దాటి బైటకు రావొద్దని హెచ్చరించాడు అంది డాంకీ.

ఒకళ్లు పండగ చేసుకుంటే మరొకళ్లు కొంపల్లోంచి కదలకుండా ముసుగు తన్ని పడుకోవాలా? పనులన్నీ మానేయాలా? అప్పుడు ఒకరి స్వేచ్ఛ, స్వేచ్ఛగా యథేచ్ఛగా ఉంటే,

రంగస్థలం

మరొకరి స్వేచ్ఛ సంగతేమవుతుంది? ఇలా మాట్లాడితే పెద్ద మాటలంటావు, పోనీ, మనుషుల్ని బయటకు రావద్దన్నారు కానీ కుక్కల్నీ గాడిదల్నీ కాదు కదా. మనుషులు మనుషుల మీద రంగు చల్లుకోనీ తారూ, పేడా, బురదా, కోడిగుడ్లూ విసురుకోనీ మధ్యన మన మీద ఈ జులుం ఏమిటి కుక్కలూ గాడిదలూ తేరగా ఉన్నాయనా అని విసుక్కుంది డాగీ.

అరుగు ఎక్కాడు అబ్బాయి. ఏంటి డాగీ జులుం అంటున్నావు అంటూ. ఏం చెప్పను బ్రో నా మెడా తోకా చూడు, ఈ రంగు ఎప్పుడు పోతుందో ఏమో అంది డాగీ దిగులుగా. దాని సంగతి మరచిపో నువ్వు ఏ మురికి గుంటలోనన్నా పడుతూ లేస్తూ ఉంటే అదే పోతుందిలే అన్నాడు అబ్బాయి. అది సరేగాని తంబీ బజారు ఎలా ఉంది. ఈ వేళ బయటకి వెళ్లి నాలుగు పేపర్లు నమిలే అవకాశం ఏమైనా ఉందా నాకు అంది డాంకీ. నాకూ కడుపులో ఎవరో గరిటె పెట్టి తిప్పుతున్నట్టుంది. ఏ హోటలైనా తెరిచిందా దొడ్డి గుమ్మం వైపు ఏదన్నా విసిరేస్తే, 'బ్రేక్‌ఫాస్టు, లంచూ, డిన్నరూ' ఒకే టైంలో కానిస్తా, 'ఒన్ టైమ్ సెటిల్‌మెంటు' చేసేస్తా అంది డాగీ.

ఏం లాభం లేదు. దుకాణాలు మూసేశారు. హోటల్ తెరిచి లేదు. రోడ్ల మీద టైర్ల సంచారమూ లేదు. గాలిలో కాకుల కావ్‌కావ్‌లు తప్ప, నేల మీద పోలీసుల బూట్ల చప్పుడు తప్ప ఏమీ లేదు అన్నాడు అబ్బాయి. ఎందుకన్నా ఈ గోల, గొడవ. నిన్నటి దాకా అంతా బానే ఉంది కదా, అంది డాగీ. ఏముంది ఏదో ఒక 'హల్‌చల్' లేకపోతే రాజకీయాలనూ, రాజకీయ నాయకులనూ మనుషులు పట్టించుకోరు కదా. పాలాభిషేకాలు చేయాలన్నా, పట్టపగలు వాహనాలు తగలబడాలన్నా, జనం రాళ్లు విసురుకుంటూ పరస్పరం పలకరించుకోవాలన్నా ఏదో ఒక గడ్డిపోచ దొరకాలి కదా, చిన్న కారణాన్ని పట్టుకుని 'ఇంతను అంతను ఎంతో' చేయాలి కదా. అప్పుడే కదా జనం ఒంట్లో చీమూనెత్తురూ దారితప్పి ఉరుకులూ పరుగులూ పెట్టేది అన్నాడబ్బాయి.

అసలు ఇప్పుడేం కొంపలు కూలే సందర్భం వచ్చిందన్నా మీ మనుషులకది వినోదమో, కడుపులో అక్కసు బైటకు తోసేయడమో కావచ్చు కానీ మాలాంటి ప్రాణుల గతేమిటి? తెలివీతేటా నాగరికతా, ప్రేమా, అభిమానం, స్నేహం, ధర్మం, న్యాయం ఇలాగ ఎన్నో కూతల కూస్తారు గదా! చెప్పే నీతులన్నీ చెబుతూ పశువుల కంటే హీనంగా ప్రవర్తిస్తారెందుకు? కొట్టుకోవడం, తిట్టుకోవడం దేనికి అంది డాగీ, డొక్క పీక్కుపోతుంటే.

గొడవ పెట్టండి పొండి అనే వాడెవడో కనపడ్డు. అమాయక జనమే వాట్సప్పులు చూసీ, రీళ్లు చూసీ, లెక్కకు మించిన చానళ్లు చూపే వాటికి కళ్లు కాయలు కాచీ రోడ్డు ఎక్కుతారు అంది డాగీ. అవును డాగీ జనాలను రెచ్చగొట్టే సాధనాలు, మార్గాలు బాగా పెరిగిపోయేయి. కడుపులో 'బటర్ మిల్కు' కదలకుండా ఒకచోట కూచుని జనాలకు పిచ్చి ఎక్కించి రెచ్చగొట్టి వీధుల్లోకి తోలేస్తున్నారు. ఇందు కోసం ఒకడు ఓ సినిమాను వాడేస్తాడు. అదే చరిత్ర అంటాడు. అందులోని ప్రతి దృశ్యమూ సత్యమేనని నమ్మిస్తాడు. జనాలు అంగీలు చింపుకునేట్టు చేస్తాడు. పాపం అమాయక జనానికి ఏది సత్యం? ఏదసత్యం? అనే ఆలోచన చేసే సమయం కూడా ఇవ్వరు అంది డాంకీ.

ఇదివరకు శవ రాజకీయాలు జరిగేవి ఇప్పుడు రాజకీయం సమాధుల వైపు మళ్లింది. వీటిని సమాధి రాజకీయాలు అనాలేమో అన్నాడు అబ్బాయి. ఇక మొత్తం చరిత్రనంతా తిరగదోడి సమాధులన్నీ తవ్వి పెడతారేమో! చచ్చి సమాధిలో పన్నవాడెవడూ లేచి రాడు కానీ మా సంగతేమిటి? సమాధుల కోసం మనుషులు కొట్టుకుంటూ కొట్లు మూసేస్తే మా గతేం అవుతుంది అంది డాగీ నీరసంగా.

అక్కడెక్కడో ఓ న్యాయమూర్తి ఇంట్లో కాల్చేసిన నోట్ల కట్టలు వీధిలో పడేశారంట గదా ఆ వైపునకు వెళ్లి కాలగా సగం మిగిలిన నోట్లనన్నా నమిలి వస్తా అంటూ అరుగు దిగింది డాంకీ.

గాలేరు నగరి రెండో దశ భవిష్యత్తు ఏమిటి?

వి.శంకరయ్య

రాయలసీమ భగీరథుడు డాక్టర్ కె. శ్రీరామ కృష్ణయ్య రూప కల్పన చేసిన గాలేరు నగరి సుజల స్రవంతి పథకానికి 1988 సెప్టెంబర్ 28 వతేదీ ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పరిపాలనా అనుమతి ఇచ్చారు. నాలుగు దశాబ్దాలుగా తొలి దశ అరకొరగా వున్నా రెండవ దశ అష్ట వక్రాలకు లోనై ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. తొలి రోజుల్లో డాక్టర్ కె. శ్రీరామ కృష్ణయ్య దూర దృష్టితో శ్రీశైలం జలాశయం నుంచి ప్రత్యేక ముఖ ద్వారంతో కడప జిల్లాలోని మైలవరం జలాశయానికి ప్రధాన కాలువ చేరునట్లు రూప కల్పన చేశారు. అక్కడి నుంచి రెండవ దశ శేషాచల పర్వత శ్రేణులు దాటి ఉమ్మడి నెల్లూరు, ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లో ప్రధాన కాలువ పయనిస్తూ ప్రస్తుతం తిరుపతి జిల్లాలో గల మల్లెమడుగు రిజర్వాయర్ చేరేవిధంగా ప్రతిపాదన చేశారు. మార్గ మధ్యమంలో రెండు జిల్లాల్లో చిన్నా పెద్ద పది రిజర్వాయర్‌లు ఏర్పాటు చేశారు. కృష్ణా జలాలు ఒకింత అయితే శేషాచల పర్వత శ్రేణుల్లో పడే వర్షపు నీరు ఒడిసి పట్టుకోవాలని తత్ఫలితంగా సువిశాల ప్రాంతంలో భూగర్భ జలాలు పెరుగుతాయని డాక్టర్ శ్రీ రామకృష్ణయ్య భావించారు. అందులో భాగంగానే ప్రస్తుతం తిరుపతి జిల్లా కరంకంబాడి వద్ద 1988లో ఎన్టీఆర్ పైలాన్ ఆవిష్కరించారు.

తదుపరి కాలంలో గాలేరు నగరి పథకం రూపు రేఖలు పూర్తిగా మారిపోయాయి. శ్రీశైలం కుడి ప్రధాన కాలువతో అనుసంధానమైనది. 1989 లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆనాడు హోంమంత్రిగా రాయలసీమ కాంగ్రెస్‌లో కీలక మైన నేతగా వున్న డాక్టర్ మైసూరారెడ్డి చొరవతో మరొక ఇంజీనీర్ రామారెడ్డి గాలేరు నగరి పథకాన్ని పూర్తిగా మార్చి వేశారు. శేషాచల పర్వత శ్రేణులు దాటే ప్రతిపాదన తొలగించారు. అయినా ఈ పథకం పట్టాలకెక్క లేదు. తిరిగి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఈ పథకం పనులు మొదలైనా వాస్తవంలో రెండవ దశకు తీవ్రమైన అన్యాయం జరిగింది. కేంద్ర ప్రభుత్వానికి పంపిన ఒరిజినల్ డీపీఆర్‌లో ఉమ్మడి కడప జిల్లాకు నాలుగు రిజర్వాయర్‌లకు 22.183 టీఎంసీలు ఉమ్మడి చిత్తూరు జిల్లా, ప్రస్తుతం తిరుపతి జిల్లాలో ఏడు రిజర్వాయర్‌లకు 10.772 టీఎంసీలు కేటాయించారు. ఈ డీపీఆర్ మేరకు గండికోట జలాశయం నిల్వ సామర్థ్యం 16.848 టీఎంసీలు మాత్రమే. కాని ముఖ్యమంత్రిగా డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి గండికోట జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 26.84 టీఎంసీలు పెంచారు. పైగా డీపీఆర్‌లో లేకున్నా పైడిపాలెం రిజర్వాయర్ నిర్మించి ఎత్తిపోతల పథకం పెట్టి తుంగభద్ర ఎగువ కాలువ నికర జలాలు గల ఆయకట్టుకు గాలేరు నగరి మిగులు జలాలను తరలింప జేశారు.

గాలేరు నగరి తొలి దశ పనులు కొంత మేరకు జరిగినా రెండవ దశ పనులు ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైనవి. ఆవిరి పారుదల నష్టం పోగా మిగిలిన మొత్తం 32.955 టీఎంసీల్లో ఒక్క గండికోటకే 26.84 టీఎంసీలు పోగా ఇక మిగిలిన దెంత? గాలేరు నగరి ప్రధాన కాలువ సర్వారాయ సాగర్ వరకు వచ్చి ఆగిపోయింది. తుదకు కడప జిల్లాలో ఉద్దిమడుగు జలాశయం నిర్మాణం నోచుకోలేదు. రాష్ట్ర విభజన అనంతరం టీడీపీ హయాంలో రెండవ దశ అలైన్‌మెంట్ మార్పు చేశారు. తిరిగి ఇప్పుడు అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇదే అలైన్‌మెంట్‌ను కొనసాగిస్తే ఈ పథకాన్ని సంక్షోభంలో పడేసినట్లవుతుంది. గాలేరు నగరి రెండవ దశకు చెంది డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జల యజ్ఞం కింద టెండర్లు నిర్వహించి అగ్రిమెంట్ జరిగిన పనులు కుంటి నడక నడుస్తుండగా 2019 లో అధికారం చేపట్టిన జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క కలం పోటుతో అన్ని టెండర్లు రద్దు చేశారు. ఓ మాదిరిగా పనులు సాగుతున్న తిరుపతి తిరుమల దాహార్తి తీర్చే బాలాజీ రిజర్వాయర్ కూడా ఇందులో వుంది.

జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో తన తండ్రి జల యజ్ఞం కింద నిర్వహించిన టెండర్లను రద్దు చేయడమే కాకుండా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అనుకూలంగా గాలేరు నగరి హంద్రీనీవా అనుసంధానం పేర 6.5 టీఎంసీల సామర్థ్యంతో రూ.2141 కోట్ల వ్యయంతో మూడు రిజర్వాయర్లకు పరిపాలనా అనుమతి ఇచ్చి ఒరిజినల్ రెండవ దశ నీటి కేటాయింపులకు ఎసరు పెట్టారు. ఒరిజినల్ డీపీఆర్ మేరకు గాలేరు నగరి రెండవ దశలో మల్లి మడుగు (2.558 టీఎంసీలు) బాలాజీ రిజర్వాయర్ (3.00) పద్మ సాగర్ (0.450) శ్రీనివాస సాగర్ (0.448)వేణుగోపాల్ సాగర్ (2.683)వేప గుంట (0.533)అడవి కొత్తూరు (0.800) మొత్తం10.772 టీఎంసీలు రెండవ దశ కేటాయింపులు వున్నాయి. జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో గాలేరు నగరి హంద్రీనీవా అనుసంధానం పేర మూడు రిజర్వాయర్‌లకు అనుమతి ఇవ్వగానే ఆగమేఘాల మీద మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మూడు రిజర్వాయర్ పనులు ప్రారంభించి కొంత మేర బిల్లులు కూడా చేసుకున్నారు. ఈ పనులకు పర్యావరణ అనుమతులు లేనందున పైగా భూసేకరణలో రైతులకు నిధులు ఇవ్వనందున గ్రీన్ ట్రిబ్యునల్ చెన్నై బెంచిని ఆశ్రయించడంతో స్టే ఇచ్చారు. ఇప్పుడు గాలేరు నగరి రెండవ దశకు రెండు తీవ్రమైన అగడ్తలు అడ్డువున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తున్నా మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అనుకూలంగా జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పరిపాలన అనుమతి రద్దు చేయలేదు. ఎవ్వరూ దాని గురించి మాట్లాడటం లేదు. ఒరిజినల్ డీపీఆర్ మేరకు ఇవి రద్దు కాకపోతే ఎగువ భాగంలోనే 6.5 టీఎంసీలు పోతే ఇక తిరుపతి జిల్లాలో రెండవ దశకు మిగిలిన దెంత? గమనార్హమైన అంశమేమంటే మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నిర్మించదలచిన మూడు రిజర్వాయర్‌ల ఆయకట్టు ఒరిజినల్‌గా హంద్రీనీవా ప్రాజెక్టు ఆయకట్టులో భాగంగా వుంది. ఈ అంశంలో కూటమి ప్రభుత్వం మౌనం వీడితేనే ఒరిజినల్ రెండవ దశ బతికి బట్టకట్ట కలుగుతుంది. కాగా గతంలో చంద్రబాబునాయుడు తన హయాంలో గాలేరు నగరి రెండవ దశకు మార్చిన అలైన్‌మెంట్ ఏ ఉద్దేశంతో జరిగిందో గాని అది

ఏ మాత్రం ఆచరణ సాధ్యం కాదు. రెండవ దశకు మరణ శాసనమే. చెన్నైకి తాగునీరు సరఫరా చేసే కండలేరు పూండి కాలువ నుంచి ఆల్తూరుపాడు వద్ద నిర్మాణంలో వున్న రిజర్వాయర్ ద్వారా సోమశిల స్వర్ణముఖి లింక్ కెనాల్‌ను ఈ పాటికే అనుసంధానం చేసి వున్నారు. దానికి తోకగా గాలేరు నగరి రెండవ దశ కూడా కలిపారు. ఈ కాలువలో భాగంగా ఏర్పేడు సమీపం మేర్లపాక చెరువు నుంచి మల్లి మడుగుకు ఎత్తిపోతలు పెట్టారు. కండలేరు పూండి కాలువ నీటి ప్రవాహ సామర్థ్యం కేవలం నాలుగు వేల క్యూసెక్కులు మాత్రమే. పైగా ఈ కాలువ నిర్మాణంలో తమిళనాడు ప్రభుత్వ నిధులున్నాయి. కండలేరు కింద మూడు లక్షలు ఎకరాల ఆయకట్టు వుంది. దానికే నీటి సరఫరాకు తంటాలు పడుతున్నారు. ఇంత వరకు ఒప్పందం ప్రకారం 15 టీఎంసీలు ఏ నాడు చెన్నైకి ఇవ్వలేదు. ఈ పరిస్థితుల్లో దాదాపు పది టీఎంసీలు ఈ కాలువ ద్వారా సరఫరా చేయడం ఏమాత్రం ఆచరణలో కుదరదు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఏ ఇంజినీర్ ఈ సలహా ఇచ్చారో ఆయన సాంకేతిక పరిజ్ఞానానికి ఆశ్చర్యమేస్తుంది. రాజకీయ నాయకులు ఒక వేళ ఏదైనా సూచన చేసినా ఎంత వరకు సాధ్యమో ఇంజినీరింగ్ అధికారులు సలహా ఇవ్వాలి. అది ఈ రోజుల్లో మృగ్యమైంది. జగన్‌మోహన్‌రెడ్డి అక్రమంగా దొడ్డిదారిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కేవలం కాంట్రాక్టు కోసం ఇచ్చిన జీవోను తిరుపతి జిల్లా వాసిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రద్దు చేయాలి. అదే సమయంలో గాలేరు నగరి తొలి దశ సర్వారాయసాగర్ వద్ద ఆగి పోయిన కాలువ ఒరిజినల్ డీపీఆర్ మేరకు ఉమ్మడి కడప జిల్లాలో ఉద్దిమడుగు జలాశయం నిర్మాణం చేపట్టాల్సి వుంది. ఉద్దిమడుగు నుంచి ఉమ్మడి కడప జిల్లా మీదుగా ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రస్తుతం తిరుపతి జిల్లాలోని మల్లిమడుగు బాలాజీ రిజర్వాయర్ కలపవలసి వుంది. అయితే అటవీ భూముల సేకరణ అడ్డంకి చెప్పి ఒరిజినల్ అలైన్‌మెంట్ మార్పు చేస్తే గాలేరు నగరి రెండవ దశ పథకం నిజంగానే గాలిలో దీపంగా మిగిలిపోతుంది.

విశ్రాంత పాత్రికేయులు-9848394013

ప్రజా పోరాటాలే చిత్త ప్రసాద్ చిత్తరువులు

ఆర్వీ రామారావ్

ప్రస్తుత బెంగాల్ లో జన్మించిన చిత్త ప్రసాద్ సమకాలీన సామాజిక పరిణామాలను ఒడిసిపట్టి తన కుంచెతో చిత్రించి భావి తరాలకు మిగిల్చి పోయిన చిత్రకారుడు. ఆయన కేవలం చిత్రకారుడు మాత్రమే కాదు. రచయిత కూడా. ఆయన రాసిన పిల్లల కథలు తెలుగులోకి కూడా అనువాదం అయినాయి.

బ్రిటిష్ వారి వలసవాద అణచివేతను, భూస్వామ్య వ్యవస్థ కొనసాగిస్తున్న అన్యాయాలను ఎదిరించడానికి చిత్త ప్రసాద్ విప్లవ కార్యాచరణలోకి దూకారు. ఆయన కుల వ్యవస్థను తీవ్రంగా వ్యతిరేకించారు. తన పేరులో ఉన్న కులాన్ని సూచించే మాట భట్టాచార్యను కూడా తొలగించారు.

ఆయన కుంచె పట్టి బొమ్మలు గీయడమే కాదు, కలం పట్టి వ్యాసాలు, కథలు రాసేవారు. కార్టూన్లు గీసేవారు. సమాజంలో ఉన్న రాజకీయ నిరంకుశత్వాన్ని ఎదిరించే ప్రజల జీవన పోరాటాన్ని ఆయన చిత్రాలుగా మలిచారు. 1943లో ఎదురైన బెంగాల్ కాటకం సమయంలో ఆయన గీసిన బొమ్మలు ప్రపంచ ప్రఖ్యాతమైనాయి. అయితే ఆయనకు అంతర్జాతీయంగా అంత ప్రఖ్యాతి రాలేదు. కొద్ది కాలం తరవాత కళా విమర్శకులు, చరిత్రకారులు ఆయన ప్రతిభను గుర్తించక తప్పలేదు. ఆ తరవాత ఆయన చిత్రాల ప్రదర్శనలు అనేక చోట్ల జరిగాయి.

చిత్తప్రసాద్ కళాకృతుల్లో రాజకీయ ప్రభావం ఉన్నవే ఎక్కువ. కానీ చివరి దశలో ఆయన ప్రపంచ శాంతి, పేదబాలల మీద ఎక్కువ చిత్రాలు గీశారు. న్యూ ఢిల్లీలోని నేషనల్ గ్యాలరీ ఆ మాడర్న్ ఆర్ట్, దుబాయ్ లోని "జేన్ అండ్ కిటో డి బోయర్ కలెక్షన్" లో ఆయన చిత్రాలు భద్రంగా ఉన్నాయి.



ఆయన బొమ్మలు పత్రికా రచయిత తాను చూసిన దృశ్యాలను కుంచెతో చిత్రీకరించినట్టు ఉంటాయి. ఆయనకు కమ్యూనిస్టు పార్టీతో సన్నిహిత సంబంధం ఉండేది. కమ్యూనిస్టు పోరాటానికి జనం మద్దతు సమీకరించడానికి ఆయన అనేక చిత్రాలు గీశారు. ఆయన గీసిన బొమ్మలు కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన పీపుల్స్ వార్, పీపుల్స్ ఏజ్ పత్రికల్లో ప్రచురితమైనాయి. అందువల్లే అవి మేధావుల దృష్టిని ఆకర్షించాయి.



చిత్త ప్రసాద్ ప్రతిభను గుర్తించి కమ్యూనిస్టు ఉద్యమంతో పరిచయం చేసించిన వ్యక్తి అప్పుడు కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న పి.సి.జోషి. కానీ సీపీఐలో పి.సి.జోషి ప్రాబల్యం తగ్గిన తరవాత 1948లో చిత్త ప్రసాద్ కూడా కమ్యూనిస్టు పార్టీకి దూరయమయ్యారు. ఆ నేపథ్యంలోనే ఆయన దేశ సరిహద్దులు దాటి విశాల ప్రపంచంలో అడుగుపెట్టాలనుకున్నారు. అంతర్జాతీయ రంగంలోకి ప్రవేశించిన తరవాత కూడా చిత్త ప్రసాద్ సోషలిస్ట్ భావాలకు అనుగుణంగానే తన కళా కౌశలాన్ని వ్యక్తం చేశారు. ఆయనకు మన జానపద కళల మీద, ముఖ్యంగా తోలుబొమ్మలాట మీద ఆసక్తి ఎక్కువగా ఉండేది. బొంబాయిలో జెకొస్లవేకియా వాణిజ్య కమిషనర్‌కు సహాయకుడిగా పని చేసిన వ్యక్తితో చిత్త ప్రసాద్ కు ఏర్పడ్డ అనుబంధం కారణంగానే ఆయన బొంబాయిలో 1950లలో తోలుబొమ్మలాట ప్రదర్శన శాల ఏర్పాటు చేయగలిగారు.

చిత్త ప్రసాద్ ప్రస్తుత బంగ్లా దేశ్‌లో పాఠశాల చదువు నేర్చుకున్నారు. అప్పుడే కళా వ్యవహారాల గురించి ఆలోచించడం మొదలు పెట్టారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో జరిగిన బీభత్సం చిత్త ప్రసాద్‌కు తెలుసు. తూర్పు సరిహద్దులో ఉన్న బెంగాల్ మీద జపాన్ దాడులు, రంగూన్ పతనం, 1940ల ఆరంభంలో చిట్టగాంగ్ మీద పదే పదే బాంబులు వేయడం మొదలైన సంఘటనలన్నింటికీ చిత్త ప్రసాద్ సాక్షి. బర్మా నుంచి వేలాది మంది శరణార్థులు బెంగాల్ లో ప్రవేశించడం ఆయన చూశారు. అప్పుడే ఆయన ఫాసిస్టు వ్యతిరేక చిత్రాలు గీయడం మొదలు



పెట్టారు. భారత, బర్మా సరిహద్దులకు ఆవల ఈ చిత్రాలను ప్రదర్శించారు. ఆ సరిహద్దుల్లోని గ్రామీణ ప్రజలే నా చిత్రాలను మొదట చూశారు అనే వారు చిత్త ప్రసాద్. చిత్త ప్రసాద్ చిత్రకళలో సామాజిక నిబద్ధత ఉండేది. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, ఆధునికత, జానపద సంప్రదాయం ఆయన కళకు పట్టుగొమ్మలు. చరిత్రలోని వివిధ కోణాలను ఆయన నిశితంగా పరిశీలించే వారు. ఆయన గీసే చిత్రాలలో వస్తువు దేశ సరిహద్దులు దాటి వెళ్లేది. నిజానికి ఆ దేశ సరిహద్దులు దాటిందే లేదు.

టారిఫ్ యుద్ధం

నేడు భారత్‌కు అమెరికా వాణిజ్య ప్రతినిధి

న్యూఢిల్లీ: అమెరికా వాణిజ్య ప్రతినిధి బ్రెండన్ లించ్ మార్చి 25 నుంచి 29వ తేదీ వరకు భారత్‌లో పర్యటించనున్నట్లు అధికారులు తెలిపారు. భారత్ అధిక సుంకాలు విధిస్తోందని, ఏప్రిల్ 2 నుంచి ప్రతీకార సుంకాలు తప్పవంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిస్తున్నారు. ఇతర దేశాలతో ట్రంప్ వాణిజ్య యుద్ధాలు కొనసాగిస్తున్న వేళ ఆ దేశానికి చెందిన వాణిజ్య ప్రతినిధి భారత్‌లో పర్యటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. దక్షిణ, మధ్య ఆసియాకు అమెరికా సహాయ వాణిజ్య ప్రతినిధిగా ఉన్న బ్రెండన్ లించ్...అమెరికా అధికారుల బృందంతో కలిసి భారత్ రానున్నారని, ఐదు రోజుల పర్యటనలో భాగంగా రెండు దేశాల మధ్య వాణిజ్యం, సుంకాల అమలు మొదలైన విషయాల గురించి వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్ సహా ఇతర భారత అధికారులతో చర్చలు జరపనున్నారని అధికార వర్గాలు తెలిపాయి. లెవీలు, మార్కెట్ యాక్సెస్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాల గురించి మాట్లాడుకోనున్నట్లు వెల్లడించాయి. భారతదేశంతో పెట్టుబడి, వాణిజ్య సంబంధాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి నిబద్ధతతో ఉన్నామని, త్వరలో భారత అధికారులతో చర్చలు జరపడానికి ఎదురు చూస్తున్నామని బ్రెండన్ లించ్ పేర్కొన్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. ట్రంప్ సుంకాల విధింపునకు మరికొద్ది రోజులే గడువున్న నేపథ్యంలో సుంకాలు సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రయత్నాలు చేస్తున్నామని భారత్ పేర్కొంది. ఇద్దరికీ ప్రయోజనకరమైన వాణిజ్య ఒప్పందం కోసం కార్యాచరణ రూపకల్పనకు అమెరికాతో సంప్రదింపులు చేస్తున్నామని తెలిపింది. 'పరస్పరం ప్రయోజనం చేకూరే వాణిజ్య ఒప్పందం కోసం అమెరికా యంత్రాంగంతో వివిధ స్థాయిల్లో సంప్రదింపులు జరుపుతున్నాం. వీటిని ముందుకు తీసుకెళ్లే ప్రక్రియలో రెండు దేశాలు నిమగ్నమై ఉన్నాయి. వాణిజ్యాన్ని విస్తరించడం, మార్కెట్ యాక్సెస్, సుంకాల తగ్గింపు, సప్లై-చైన్ సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఇవి కొనసాగుతున్నాయి' అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు.

జడ్జి వర్మను అభిశంసించాలి

- నోట్లకట్టలపై నిష్పక్షపాత విచారణ
- అఖిల భారత న్యాయ కమిషన్ ఏర్పాటు
- విపక్షాల డిమాండ్

న్యూఢిల్లీ: ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో పెద్ద మొత్తంలో నగదు బయటపడిన వ్యవహారంపై ప్రతిపక్ష నాయకులు తీవ్రంగా స్పందించారు. ఈ విషయంపై నిష్పక్షపాత దర్యాప్తునకు డిమాండ్ చేశారు. జడ్జిని అభిశంసించాలని మరికొందరు సూచించారు. మార్చి 14న ఢిల్లీలోని లూటియన్స్ ప్రాంతంలో జస్టిస్ వర్మ అధికారిక నివాసం స్టోర్ రూమ్‌లో జరిగిన అగ్నిప్రమాదం సమయంలో అగ్నిమాపక, పోలీసు సిబ్బంది నగదు కనుగొన్నారు. అగ్నిప్రమాదం తర్వాత 'నాలుగు నుంచి ఐదు సగం కాలిన బస్తాలలో' కరెన్సీ నోట్ల గుట్టలను గుర్తించడంపై దర్యాప్తు చేయడానికి భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా ముగ్గురు సభ్యుల ప్యానెల్‌ను ఏర్పాటు చేశారు. అయితే, జస్టిస్ వర్మ ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. తాను లేదా తన కుటుంబ సభ్యులు ఎవరూ స్టోర్ రూమ్‌లో నగదు ఉంచలేదని అన్నారు. ఈ విషయంలో జరుగుతున్న పరిణామాలపై ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ మాట్లాడుతూ 'ఇది ఒక పెద్ద సమస్య. న్యాయవ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకం దెబ్బతింది' అని అన్నారు. 'భారత చరిత్రలో న్యాయమూర్తి ఇంట్లో కరెన్సీ నోట్ల కట్టలు బయటపడటం ఇదే తొలిసారి. ఆయన రాజీనామా చేయాలి. ఈ విషయంపై దర్యాప్తు చేయాలి. పార్లమెంటు కూడా ఈ అంశంపై చర్చించాలి' అని డిమాండ్ చేశారు. పార్లమెంటు వెలుపల విలేకరులతో సింగ్ మాట్లాడుతూ 'డబ్బు దొరకకపోయినా ప్రతిపక్ష నాయకులను జైలులో పడేస్తున్నారు. కానీ ఈ కేసులో కోట్లాది రూపాయలు దొరికాయి. ఎటువంటి దర్యాప్తు జరగడం లేదు' అని అన్నారు. సీపీఐ రాజ్యసభ సభ్యుడు పి.సంతోశ్ కుమార్ మాట్లాడుతూ న్యాయమూర్తిని అభిశంసించాలని డిమాండ్ చేశారు. 'భారత పార్లమెంటు ఆయనను అభిశంసించడానికి చర్యలు తీసుకుంటుంది. న్యాయ వ్యవహారాలలో అలాంటి వ్యక్తులు కూర్చోవడం చాలా దురదృష్టకరం, దిగ్భ్రాంతికరం' అని సంతోశ్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ ఎంపీ కార్తి చిదంబరం మాట్లాడుతూ సీజేఐ జస్టిస్ ఖన్నా ఏర్పాటు చేసిన కమిటీ ఒక ముందడుగు అని అన్నారు. అయితే ఈ అంశంపై ప్రభుత్వం పార్లమెంటులో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. 'ఈ నగదు కాల్పుల ఘటనకు సంబంధించి నిజాన్ని బయటకు తీసుకురావడం నిజంగా భారత ప్రధాన న్యాయమూర్తి బాధ్యత. దీనిని పరిశీలించడానికి ముగ్గురు సభ్యుల న్యాయమూర్తుల కమిటీని ఏర్పాటు చేశారు. ఇది ముందుకు సాగడానికి ఉత్తమ మార్గం. కానీ న్యాయశాఖమంత్రి పార్లమెంటులో ప్రకటన చేయాలని నేను భావిస్తున్నాను' అని ఆయన అన్నారు. న్యాయవ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకం సన్నగిల్లుతోందని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ తెలిపారు. 'న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం నెమ్మదిగా క్షీణిస్తోంది. ప్రజలలో విశ్వాసం కలిగించడం న్యాయవ్యవస్థ విధి. గతంలో ఒక సిట్టింగ్ న్యాయమూర్తి రాజీనామా చేసి మరుసటి రోజు ఒక రాజకీయ పార్టీలో చేరడం, ఒక సీజేఐ పదవీ విరమణ చేసి పార్లమెంటు సభ్యుడిగా రావడం మనం చూశాం' అని అన్నారు. 'విచారణ ప్రారంభమైంది. ఇది భారత ప్రధాన న్యాయమూర్తి తీసుకున్న మంచి చర్య. సీజేఐ కోరుకుంటే జస్టిస్ శర్మ అభిశంసనకు సిఫార్సు చేయవచ్చు. పార్లమెంటు కూడా అభిశంసన కోసం ఒక అడుగు వేయవచ్చు' అని పశ్చిమ బెంగాల్‌కు చెందిన సెరాంపూర్ ఎంపీ అన్నారు. 'ప్రశ్న ఏమిటంటే, ఈ రకమైన విషయం నిజంగా న్యాయమూర్తుల అవినీతిని ఆపుతుందా? అనేక ఆరోపణలు ఉన్నాయి. కానీ మనం మాట్లాడలేము. మనం మాట్లాడితే మనల్ని ధిక్కారానికి గురిచేస్తారు.

ఈ దేశంలో సమస్య ఏమిటంటే న్యాయమూర్తులకు కోర్టు ధిక్కార చట్టం కింద రక్షణ లభిస్తుంది. వాటికి వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడలేరు' అని అన్నారు. ఆజాద్ సమాజ్ పార్టీ (ఏఎస్‌పీ) ఎంపీ చంద్ర శేఖర్ మాట్లాడుతూ దీనిపై జ్యుడీషియల్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 'ప్రతి ప్రభుత్వ పదవికి సంబంధించిన నియామకానికి పరీక్షలు ఉంటాయి. మరి న్యాయమూర్తుల కోసం ఎందుకు లేదు? కొన్ని కుటుంబాలు ఆ సంస్థను స్వాధీనం చేసుకున్నాయి. కొలీజియం వ్యవస్థకు ముగింపు పలికి అఖిల భారత న్యాయ కమిషన్ ఏర్పాటు చేయాల్సిన సమయం ఆసన్నమైంది' అని అన్నారు. కాగా, ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు శనివారం రాత్రి తన వెబ్ సైట్‌లో ఫొటోలు, వీడియోతో సహా అంతర్గత విచారణ నివేదికను ఉంచింది.

800 మంది రైతుల విడుదల

చండీగఢ్: నిరసన వ్యక్తం చేస్తున్న రైతులపై అణిచివేత చర్యలు చేపట్టిన పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వం... దాదాపు 800 మంది రైతులను నిర్బంధం నుంచి విడుదల చేసింది. ఈ మేరకు ఆ రాష్ట్ర ఐజీపీ సుఖ్‌చెయిన్ సింగ్ ప్రకటించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మరో 450 మందిని కూడా విడుదల చేయబోతున్నామని తెలిపారు. రోజువారి వ్యాపారాలు, పరిశ్రమలు, సాధారణ ప్రజలపై ప్రభావం చూపిందని పేర్కొంటూ... రైతుల్ని నిరసన స్థలాలనుంచి ఖాళీ చేయించాలని ఆప్ ప్రభుత్వం నిర్ణయించిన తర్వాత ఈ నెల 19నుండి వందలాది మంది రైతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిరసన చేపట్టిన రైతుల్లో మహిళలు, వికలాంగులు, ఆరోగ్య సమస్యలున్నవారు, 60 ఏళ్లు పైబడిన వారిని వెంటనే విడుదల చేయాలని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ఆదేశించారని ఆయన పేర్కొన్నారు. పంజాబ్ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా, అటువంటి రైతుల విడుదలకు ప్రాధాన్యత ఇస్తున్నామని... ఈ రోజు దాదాపు 450 మంది రైతులను విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఢిల్లీ పాదయాత్రను భద్రతా సిబ్బంది అడ్డుకున్న తర్వాత గత సంవత్సరం ఫిబ్రవరి 13 నుండి శంభు, ఖనౌరి సరిహద్దు పాయింట్ల వద్ద శిబిరాల్లోనున్న తమ నాయకులను అదుపులోకి తీసుకుని... తమను అక్కడి నుంచి తొలగించినందుకు నిరసనకారులు ఆప్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

నిరుద్యోగంపై మోదీ మాట్లాడాలి

రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ: దేశంలో ఓ సంస్థ భారతదేశ భవిష్యత్తును, విద్యావ్యవస్థను ఖూనీ చేయాలని చూస్తోందని, ఆ సంస్థ మరేదో కాదని, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ ధ్వజమెత్తారు. దేశ రాజధాని ఢిల్లీలో ఎన్ఎస్‌యూఐ నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... భారత విద్యావ్యవస్థ క్రమంగా ఆర్ఎస్ఎస్ చేతుల్లోకి వెళ్తే దేశం పూర్తిగా నాశనమవుతుందని అన్నారు. ఎవరికీ ఉద్యోగాలు రావని వ్యాఖ్యానించారు. అన్ని విద్యార్థి సంఘాలు నిరసన కార్యక్రమానికి వచ్చినందుకు తనకు సంతోషంగా ఉందని చెప్పారు. దేశంలో ఏం జరుగుతుందో విద్యార్థులకు చెప్పాల్సిన బాధ్యత విద్యార్థి సంఘాలపైనే ఉందన్నారు. అన్ని యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్లలో ఆర్ఎస్ఎస్ ఆధిపత్యం ఉందని రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. భవిష్యత్‌లో రాష్ట్రాల్లోని వర్సిటీలకు వీసీలను కూడా ఆర్ఎస్ఎస్ నామినేట్ చేసే రోజులు రాబోతున్నాయని అన్నారు. ఇది దేశానికి చాలా ప్రమాదకరమని, అలా జరగకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో నిరుద్యోగ సమస్య ప్రధాన సమస్యగా ఉందని అన్నారు. కొన్ని రోజుల క్రితం ప్రధాని మోదీ పార్లమెంటులో కుంభమేళా గురించి మాట్లాడారని, తాను ఆయనకు ఒక విషయం చెప్పదల్చుకున్నానని... కుంభమేళాపై మాట్లాడటం మంచి విషయమేగానీ, ఆయన దేశ భవిష్యత్తు గురించి మాట్లాడితే బాగుండేదని అభిప్రాయపడ్డారు. దేశంలో యువతను మోదీ ప్రభుత్వం నిరుద్యోగులుగా మార్చిందని, కాబట్టి మోదీ ఆ సమస్యపై కూడా మాట్లాడాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు.

మహారాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ: ఆస్తుల కూల్చివేత కేసులో కోర్టు ధిక్కార చర్యలు చేపట్టాలన్న పిటిషన్‌పై మహారాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. గత నెలలో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్ సందర్భంగా భారత వ్యతిరేక నినాదాలు చేశారనే ఆరోపణలపై సింధుదుర్గ్ జిల్లాలో ఇంటిని, దుకాణాన్ని కూల్చివేసిన సంగతి తెలిసిందే. పనికిమాలిన ఫిర్యాదుతో గతేడాది నవంబర్ 13న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉల్లంఘించి అధికారులు ఇంటిని, దుకాణాన్ని కూల్చివేశారని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై స్పందన తెలపాల్సిందిగా జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం మహారాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్‌ను నాలుగు వారాల తర్వాత విచారిస్తామని ధర్మాసనం తెలిపింది. గతేడాది నవంబర్‌లో ఇచ్చిన తీర్పు ఆస్తుల కూల్చివేతపై దేశవ్యాప్తంగా మార్గదర్శకాలు నిర్దేశించింది. షోకాజ్ నోటీసు ఇవ్వకుండా ఆస్తులు కూల్చివేయడాన్ని నిషేధించింది. బాధితులు స్పందించేందుకు 15 రోజుల గడువు ఇవ్వాల్సిందిగా సుప్రీంకోర్టు ఆ తీర్పులో స్పష్టం చేసింది.

తృటిలో తప్పిన విమాన ప్రమాదం

సిమ్లా: సిమ్లా విమానాశ్రయంలో విమాన ప్రమాదం త్రుటిలో తప్పింది. అలయన్స్ ఎయిర్ ఫ్లయిట్ నెంబర్ 91821 సోమవారం రన్‌వే నుంచి అదుపు తప్పి దూసుకెళ్లింది. ఈ విమానంలో హిమాచల్ ప్రదేశ్ డిప్యూటీ సీఎం ముకేశ్ అగ్నిహోత్రి, డీజీపీ అతుల్ వర్మ సహా 44 మంది ప్రయాణికులు ఉన్నారు. ఢిల్లీ నుంచి బయల్దేరి సిమ్లాలో ల్యాండింగ్ చేసే సమయంలో విమానం బ్రేకులు ఫెయిలయ్యాయి. దీంతో పైలట్ విషయాన్ని ప్రయాణికులకు తెలియజేసి... ఎమర్జెన్సీ బ్రేకులు వేసేందుకు తీవ్రంగా ప్రయత్నించాడు. ప్రయాణికులు ఒక్కసారిగా తీవ్ర భయాందోళనకు లోనయ్యారు. ఈ విమానం ఢిల్లీ-సిమ్లా-ధర్మశాల-ఢిల్లీ మధ్య ప్రయాణిస్తుంటుంది. 'ఈ ఉదయం మేము విమానంలో సిమ్లా చేరుకున్నాం. ల్యాండింగ్ సమయంలో కొన్ని సమస్యలు ఎదురయ్యాయి. సాంకేతిక అంశాలు నాకు తెలియదు. కానీ, విమానం ఎక్కడ దిగాలో అక్కడ ల్యాండ్ కాలేదు. ఆగాల్సిన చోట ఆగలేదు. రన్‌వే చివరికి దూసుకెళ్లి ఆగింది. వేగాన్ని తగ్గించేందుకు శక్తిమంతమైన బ్రేకులు వేయాల్సి వచ్చింది. ఆ తర్వాత మరో 25 నిమిషాలపాటు విమానంలోనే ఉండిపోవాల్సి వచ్చింది' అని హిమాచల్ ప్రదేశ్ డిప్యూటీ సీఎం అగ్నిహోత్రి తెలిపారు.

కర్నాటకలో ముస్లిం రిజర్వేషన్లపై పార్లమెంటులో బీజేపీ రభస

న్యూఢిల్లీ: కర్నాటకలో ముస్లిం రిజర్వేషన్ అంశం పార్లమెంటును కుదిపేసింది. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ... అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ సభ్యుల మధ్య వాదోపవాదాల నడుమ ఉభయ సభల్లో తీవ్ర గందరగోళం నెలకొని... వాయిదాల పర్వం చోటు చేసుకుంది. సోమవారం ఉదయం 11 గంటలకు సభలు ప్రారంభమైన వెంటనే లోక్‌సభ , రాజ్యసభ నిమిషాల వ్యవధిలోనే వాయిదా పడ్డాయి. రాజ్యాంగాన్ని పరిరక్షించండి అంటూ అధికార బీజేపీ సభ్యులు పెద్ద పెట్టున నినదించారు. రాజ్యసభలో ఈ అంశంపై బీజేపీ ఎంపీలు గందరగోళం సృష్టించారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు మాట్లాడుతూ... "కాంగ్రెస్ పార్టీ సీనియర్ సభ్యులలో ఒకరు (కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్) రాజ్యాంగ పదవిలో ఉన్నారు. వారు భారత రాజ్యాంగాన్ని మార్చబోతున్నట్లు ప్రకటన చేశారు. కాంగ్రెస్ పార్టీ ముస్లిం సమాజానికి రిజర్వేషన్లు కల్పిస్తుందని, దాని కోసం వారు (కాంగ్రెస్) భారత రాజ్యాంగాన్ని మారుస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రకటనను తేలికగా తీసుకోలేము" అన్నారు. రాజ్యసభలో సభా నాయకుడు జేపీడీ నడ్డా మాట్లాడుతూ... బాబా సాహెబ్ రాసిన రాజ్యాంగాన్ని కాంగ్రెస్ ముక్కలు ముక్కలు చేసిందని జేపీ నడ్డా మండిపడ్డారు. బాబా సాహెబ్ గౌరవాన్ని కాంగ్రెస్ నాశనం చేసిందని కిరెన్ రిజిజు అన్నారు. ముస్లిం రిజర్వేషన్ల కోసం రాజ్యాంగాన్ని ఎందుకు మార్చాలనుకుంటున్నారో ప్రతిపక్ష నాయకుడు ఈ సభ ద్వారా దేశం మొత్తానికి చెప్పాలని మంత్రి రిజిజు, నడ్డా డిమాండ్ చేశారు. దీనికి ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖడ్గే సమాధానం ఇచ్చారు. దేశ రాజ్యాంగాన్ని మార్చబోతున్నామని ఎవరు ఎవరికి చెప్పారని అడిగారు? బాబా సాహెబ్ అంబేద్కర్ రూపొందించిన దేశ రాజ్యాంగాన్ని ఎవరూ మార్చలేరు. రిజర్వేషన్లను కూడా ఎవరూ అంతం చేయలేరని ఆయన అన్నారు. దానికోసం మేము కన్యాకుమారి నుండి కశ్మీర్ వరకు భారత్ జోడో యాత్ర చేశాం. ఈ వ్యక్తులే భారతదేశాన్ని విచ్ఛిన్నం చేయబోతున్నారు. రిజర్వేషన్లను అపహాస్యం చేస్తున్నది బీజేపీ వాళ్లేనని దుయ్యబట్టారు. ముస్లిం లీగ్ 1947 ఆగస్టు 28న రాజ్యాంగ సభకు దానిని తీసుకువచ్చినప్పుడు సర్దార్ పటేల్ దానిని తిరస్కరించారని రిజీజు గుర్తు చేశారు. ముస్లిం రిజర్వేషన్ల అంశాన్ని లేవనెత్తడం ద్వారా నేడు కాంగ్రెస్ పార్టీ బాబా సాహెబ్ రాజ్యాంగ గౌరవాన్ని మరోసారి దెబ్బతీసిందని ఆయన అన్నారు. మీకు ధైర్యం ఉంటే ఈరోజే ఉప ముఖ్యమంత్రి రాజీనామాను అడగండి అని సవాలు విసిరారు. భారత రాజ్యాంగంలో మతం పేరుతో రిజర్వేషన్లు ఉండవని ఆయన అన్నారు. ఆ తర్వాత రాజ్యసభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది.

సభ తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా గందరగోళం కొనసాగడంతో మళ్ళీ 15 నిమిషాలు వాయిదా పడింది. ఆ తర్వాత రోజంతా వాయిదా వేస్తున్నట్లు సభాపతి ప్రకటించారు. మరోపక్క లోక్‌సభ కార్యకలాపాలు మధ్యాహ్నం తిరిగి ప్రారంభమైనప్పుడు... కిరణ్ రిజిజు సభలో కర్నాటకలో ముస్లిం రిజర్వేషన్ అంశాన్ని లేవనెత్తారు. ప్రతిపక్షనాయకుడు, కాంగ్రెస్ సమాధానం చెప్పాలన్నారు. అధికార, ప్రతిపక్ష సభ్యుల పోటాపోటీ నినాదాల మధ్య సభను మళ్లీ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. లోక్‌సభ తిరిగి ప్రారంభమైన తర్వాత బడ్జెట్‌పై చర్చ ప్రారంభమైంది.

సభ జరగడం ప్రభుత్వానికి ఇష్టం లేదు: ప్రియాంక

లోక్‌సభను పనిచేయనివ్వకూడదని ప్రభుత్వం నిర్ణయించుకున్నట్లు కనిపిస్తోందని...గందరగోళం సృష్టించడానికి ఏదో ఒక సాకు వెతుక్కుంటోందని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ విమర్శించారు. సభలో ప్రజాసమస్యలపై చర్చించడం వారికి ఇష్టం లేదన్నారు. లోక్‌సభ రెండోసారి వాయిదా పడిన సమయంలో పార్లమెంటు ఆవరణలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.

పోస్టర్లతో ఎస్పీ ఎంపీల నిరసన

లోక్‌సభ ఉదయం 11గంటలకు సమావేశమవగానే ఉత్తరప్రదేశ్‌లో జరిగిన హత్యలు, అత్యాచారాలపై నిరసన తెలుపుతూ సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) సభ్యులు పోస్టర్లు ప్రదర్శించారు. దీనిపై స్పీకర్ ఓం బిర్లా తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఇది నిబంధనలకు విరుద్ధమని, సభ గౌరవాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. "మీరు సభకు పోస్టర్లను తీసుకురావద్దు. దయచేసి సహకరించండి. మీరు సభలో పోస్టర్లను చూపిస్తే, మీపై నేను చర్య తీసుకోవలసి వస్తుంది" అని ఆయన అన్నారు.

లోక్‌సభ గతంలోనే ఏ సభ్యుడైనా సభకు ఎలాంటి పోస్టర్లను తీసుకెళ్లకూడదని నిర్ణయించిందని బిర్లా అన్నారు. దీనికి వ్యతిరేకంగా తీర్మానం తీసుకురావాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి రిజిజును ఆదేశిస్తూ... లేకపోతే తాను చర్య తీసుకుంటానని ప్రకటించి సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు.

టోల్ ట్యాక్స్ వసూళ్లు రూ.1.93 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: దేశంలో అన్ని జాతీయ రహదారులపై ఉన్న టోల్ ప్లాజాల నుంచి గడచిన ఐదేళ్లలో ప్రభుత్వం రూ.1.93 లక్షల కోట్లు టోల్ ట్యాక్స్ వసూలు చేసింది. దీనికి సంబంధించిన వివరాలను రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ లోక్‌సభలో వెల్లడించింది. ప్రభుత్వ డేటా ప్రకారం దేశంలోనే అత్యధిక టోల్ ట్యాక్స్‌ను గుజరాత్‌లోని ఎన్‌హెచ్-48లోని వడోదర-భరూచ్ సెక్షన్‌లో ఉన్న టోల్ ప్లాజా వసూలు చేసింది. గడచిన ఐదు ఆర్థిక సంవత్సరాల్లో (2019-20 నుంచి 2023-24 వరకు) రూ.2,043.81 కోట్ల టోల్ వసూలు చేసింది. టోల్ ఆదాయాల జాబితాలో రాజస్థాన్‌లోని షాజహాన్‌పూర్ టోల్ ప్లాజా రెండవ స్థానంలో నిలిచింది. ఇది ఎన్‌హెచ్-48లోని గుర్గావ్-కోట్‌పుట్లి-జైపూర్ విభాగంలో ఉంది. గత ఐదేళ్లలో ఈ ప్లాజాలో రూ.1,884.46 కోట్ల టోల్ వసూలు చేసినట్లు మంత్రిత్వ శాఖ డేటా వెల్లడించింది. మూడవ స్థానంలో పశ్చిమ బెంగాల్‌లోని జల్ధులగోరి టోల్ ప్లాజా ఉంది. ఇది రూ.1,538.91 కోట్ల టోల్ వసూలు చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని బారజోధ టోల్ ప్లాజా రూ.1,480.75 కోట్ల వసూలు చేసి జాబితాలో 4వ స్థానంలో ఉంది. టాప్ టెన్ ఆదాయాన్ని ఆర్జించే టోల్ ప్లాజాల జాబితాలో రెండు ప్లాజాలు గుజరాత్‌లో, రెండు రాజస్థాన్‌లో, రెండు ఉత్తరప్రదేశ్‌లో ఉన్నాయి. హర్యానా, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, బీహార్‌లలో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. గత ఐదేళ్లలో అత్యధిక ఆదాయాన్ని ఆర్జించే 10 టోల్ ప్లాజాలు రూ.13,988.51 కోట్ల విలువైన టోల్ వసూలు చేశాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా మొత్తం 1,063 టోల్ ప్లాజాలు ఉన్నాయి. వీటిలో 457 టోల్ ప్లాజాలను గత ఐదేళ్లలో ఏర్పాటు చేశారు.

13 మంది జూనియర్ విద్యార్థుల సస్పెన్షన్

చెన్నై: ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్ గదిలో ఓ సీనియర్ విద్యార్థిని జూనియర్లు కొట్టి హింసించిన ఘటన తమిళనాడులోని కోయంబత్తూరులో జరిగింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో 13 మంది జూనియర్ విద్యార్థులను యాజమాన్యం కళాశాల నుంచి సస్పెండ్ చేసింది. వివరాల్లోకి వెళితే... ఈ నెల 20న నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ క్యాంపస్‌లో దొంగతనం ఆరోపణలపై సీనియర్ విద్యార్థిపై జూనియర్లు దాడి చేశారు. అతడిని కొట్టడంతోపాటు వివిధ రకాలుగా భౌతికంగా హింసించారు. అర్ధ నగ్నంగా మోకాళ్లపై నిలబెట్టారు. బాధతో ఆ విద్యార్థి అల్లాడిపోయాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై ఆ కళాశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు అందింది. దర్యాప్తునకు విచారణ కమిటీ ఏర్పాటు చేశారు.

నాగపూర్ అల్లర్ల నిందితుడి ఇల్లు కూల్చివేత



ముంబై: నాగపూర్‌లో ఇటీవల చెలరేగిన హింసకు కారణమైన కీలక నిందితుడు ఫహీమ్‌ఖాన్‌కు చెందిన అక్రమ నిర్మాణాలపై మహారాష్ట్ర ప్రభుత్వం బుల్డోజర్ ఆపరేషన్ చేపట్టింది. సోమవారం ఉదయం అతడి నివాసం, ఇతర నిర్మాణాలను నాగపూర్ మున్సిపల్‌శాఖ అధికారులు కూల్చివేశారు. ఈ అక్రమ నిర్మాణాలపై ఇప్పటికే నోటీసులు జారీ చేశామని. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినందువల్ల వీటిని కూల్చివేశామన్నారు. కాగా మైనారిటీ డెమోక్రటిక్ పార్టీ నగర అధ్యక్షుడిగా పనిచేస్తున్న ఫహీమ్ సామాజిక మాధ్యమం ద్వారా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసి ఘర్షణలకు కారణమయ్యాడన్న ఆరోపణలతో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. మార్చి 17న నాగపూర్‌లో కొందరు మతపరమైన వ్యాఖ్యలు చేయడంతో రెండువర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. మతపరమైన వస్తువులు దహనం చేసినట్లు కొంతమంది సోషల్ మీడియా వేదికగా తప్పుడు వదంతులు వ్యాప్తి చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నట్లు అధికారులు పేర్కొన్నారు. దీనికి కారణమైన ఫహీమ్‌తో సహా ఆరుగురిపై దేశద్రోహం కేసు నమోదు చేశారు.

కునాల్‌ను వదలం: నిరుపమ్

ముంబై: మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండేపై స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై శివసేన నేత సంజయ్ నిరుపమ్ సోమవారం స్పందించారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎకోసిస్టమ్ నుంచి కునాల్ వచ్చాడని, అతడు వామపక్ష భావజాలానికి చెందినవాడని, సంజయ్ రౌత్‌కు సన్నిహితుడని చెప్పారు. రాహుల్ గాంధీతో పాదయాత్రలోనూ నడిచారని, సంజయ్ రౌత్‌తో కలిసి ఉన్న ఫొటోలు బయటకు వచ్చాయన్నారు. శరద్ పవార్, సుప్రియా సూలేను కూడా కునాల్ కలిశారన్నారు. ఇప్పుడు స్టాండప్ కామెడీ పేరుతో తమ నేత ఏక్‌నాథ్ షిండేపై దిగజారి మాట్లాడారని మండిపడ్డారు. ఈ స్టాండప్ కామెడీ షో రికార్డు చేసిన ప్రదేశం బుకింగ్ డబ్బు మాతోశ్రీ నుంచి, ఉద్ధవ్ ఠాక్రే నుంచి వచ్చిందని సంజయ్ నిరుపమ్ ఆరోపించారు. అందుకే ఏక్‌నాథ్ షిండేను లక్ష్యంగా చేసుకున్నారన్నారు. తన వ్యాఖ్యల పట్ల కునాల్ క్షమాపణలు చెప్పేవరకు అతడిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. కునాల్ పారిపోయి ఉండొచ్చని తమకు తెలిసిందన్నారు.

క్షమాపణ చెప్పను: కునాల్



మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండేపై స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఆ వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పాలని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తేల్చిచెప్పారు. దీనిపై కునాల్ స్పందిస్తూ తాను పశ్చాత్తాపం చెందడం లేదని, కోర్టు ఆదేశిస్తేనే క్షమాపణలు చెబుతానని ముంబయి పోలీసులకు స్పష్టంచేశారు.

హాబిటాట్ క్లబ్ ఆక్రమణల తొలగింపు

ముంబై: ప్రముఖ స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా వ్యాఖ్యలతో ది యూనికాంటినెంటల్ హోటల్‌లోని హాబిటాట్ క్లబ్‌కు కష్టాలు మొదలయ్యాయి. దానిలోని ఆక్రమణలను బీఎంసీ (బృహన్ ముంబై కార్పొరేషన్) ఉద్యోగులు సోమవారం తొలగించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రతాప్ సర్నైక్ మాట్లాడుతూ ఖార్‌లోని ఆ స్టూడియో అక్రమ నిర్మాణమని, చర్యలు తీసుకోవాలని ముంబై కమిషనర్‌ను కోరినట్లు వెల్లడించారు. తాజా పరిణామాలపై ఆయన ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ 'ఓ మంత్రిగా నిన్న జరిగిన పరిణామాలకు నేను మద్దతు ఇవ్వను. కానీ, మంత్రి కావడానికి ముందే నేను శివసైనికుడిని.

ఆ స్టూడియో అక్రమ నిర్మాణం. అక్కడ ప్రధాని మోదీ సహా అనేకమందిపై తప్పుడు వ్యాఖ్యలు చేశారు. అలాంటి అక్రమ స్టూడియోకు కొందరు ఎందుకు మద్దతు తెలుపుతున్నారన్నదానిపైనా దర్యాప్తు జరగాలి' అని వ్యాఖ్యానించారు. అసిస్టెంట్ కమిషనర్ వినాయక్ విస్పుటే మాట్లాడుతూ 'స్టూడియో యజమాని కొన్ని అక్రమ షెడ్లు నిర్మించారు. వాటిని మేము తొలగిస్తున్నాం. వీటికి నోటీసులతో పనిలేదు' అని వెల్లడించారు. స్టూడియో ప్లాన్‌ను పరిశీలించి చర్యలు తీసుకొంటామని తెలిపారు.

కునాల్ క్షమాపణ చెప్పాలి

ఫడ్నవీస్



ముంబై: మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండేపై స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్పందించారు. 'నేను హాస్యానికి వ్యతిరేకం కాదు. ఆ పేరుతో ఇతరులను అగౌరవపరచడం ఆమోదయోగ్యం కాదు. దిగజారుడు హాస్యం, డిప్యూటీ సీఎంను అగౌరవపరచడం సరికాదు. ఈ వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పాలి' అని కునాల్ తీరును ఖండించారు. అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. మరో డిప్యూటీ సీఎం, ఎన్‌సీపీ నేత అజిత్ పవార్ కూడా ఈ వ్యవహారంపై స్పందిస్తూ 'ఎవరూ చట్ట పరిధి దాటి వ్యవహరించకూడదు. ఎవరైనా హద్దుల్లో ఉండే మాట్లాడాలి. ఒక్కొక్కరికి భిన్నమైన అభిప్రాయాలు ఉండొచ్చు. కానీ వారి మాటల ద్వారా పోలీసుశాఖ జోక్యం చేసుకొనే పరిస్థితి ఉండకూడదు' అని హెచ్చరించారు. ఖార్ ప్రాంతంలోని ది యూనికాంటినెంటల్ హోటల్‌లోని హాబిటాట్ కామెడీ క్లబ్‌లో కునాల్ కమ్రా షో జరిగింది. ఇందులో కమ్రా... డిప్యూటీ సీఎంను ఉద్దేశిస్తూ ఓ జోక్ వేశారు. 'శివసేన నుంచి శివసేన బయటికి వచ్చింది. ఎన్సీపీ నుంచి ఎన్సీపీ విడిపోయింది. అంతా గందరగోళంగా ఉంది' అంటూ మహారాష్ట్ర రాజకీయాల గురించి మాట్లాడిన కమెడియన్... ఏక్‌నాథ్ షిండేను ద్రోహిగా అభివర్ణించారు.

విశాలాంధ్ర హైదరాబాద్

ప్రజావాణి ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (56) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ-25, ఇతర శాఖలకు-31, మొత్తం 72 దరఖాస్తులు అందాయి. అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి జిల్లా అధికారులతో మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు ముగిసిన అనంతరం హాస్టల్స్, సంక్షేమ వసతి గృహాలలో ఉండే పిల్లలను జాగ్రత్తగా వారి ఇండ్లకు పంపించే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగవంతం చేయాలని పిడి హౌసింగ్‌కు తెలిపారు. గ్రామాలలో, మున్సిపాలిటీల పరిధిలో తాగునీటి కొరత ఏర్పడకుండా చూడాలని డీపీఓకు, మున్సిపల్ కమిషనర్లకు, మిషన్ భగీరథ అధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ను దయానంద్ నగర్‌లో ఆపాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఈ నెల 26 వ తేదీ నుండి ఆదిలాబాద్ - మల్కాజిగిరి-సికింద్రాబాద్-మౌలాలి మీదుగా తిరుపతి వెళ్తున్న కృష్ణ ఎక్స్ ప్రెస్‌ను దారి మళ్లించనున్నారు. బొలారం తర్వాత దయానంద్ నగర్ కార్డు లైన్ మీదుగా చర్లపల్లి చేరుకొంటుంది. మల్కాజిగిరి, సికింద్రాబాద్, మౌలాలి ప్రయాణికులు ఇటు బొలారంలో కానీ లేదా చర్లపల్లి వెళ్లి ఈ రైలును అందుకోవాల్సి ఉంటుంది. అంతేకాక ఈ రైల్లో నగరానికి వస్తున్న ప్రయాణికులు చర్లపల్లిలో కానీ లేదా బొలారంలో దిగి నగరానికి వెళ్ళాల్సి ఉంటుంది. ఈ రైల్లో ఎక్కువగా నగరానికి వచ్చి తమ పని ముగించుకొని అదే రైల్లో తిరిగి వెళ్తుంటారు. నగర శివారు ప్రాంతాల వారు ముఖ్యంగా రైల్వే సిబ్బంది బోనగిరి, ఆలేరు, కాజీపేట్, వరంగల్‌లో పని చేసేవారు, యాదాద్రి వెళ్లే భక్తులు చాలా ఉపయోగిస్తుంటారు. ఇటు బొలారం వెళ్ళాలి అనుకొన్న, చర్లపల్లి వెళ్లాలనుకొన్న సరైన రవాణా సౌకర్యాలు లేవు. కావున సఫిల్ గూడలో తాత్కాలిక హాల్ట్ ఇచ్చి, దయానంద్ నగర్ ఈస్ట్ స్టేషన్ పనులు పూర్తి చేసి శాశ్వత హాల్ట్ కల్పించాలని ప్రయాణికుల సంఘం ప్రధాన కార్యదర్శి, జెడ్‌ఆర్‌యుసిసి సభ్యులు నూర్ రైల్వే అధికారులను కోరారు.

కబ్జాలు ఉన్నా హైడ్రాకు కనిపించవా : ఎమ్మెల్యే మర్రి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : హైడ్రా మల్కాజిగిరిలో పని చేయదా మల్కాజిగిరి నియోజకవర్గంలోని అల్వాల్, మల్కాజిగిరి సర్కిల్‌లల్లో ప్రభుత్వం భూమి కబ్జాకు గురవుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదని మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి శాసన సభలో ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. అల్వాల్‌లోని 482,483 కబ్జాకు గురవుతుందని, యుఎల్‌సి భూమి కూడ అదే స్థితిలో ఉందన్నారు. బోల్లారంలో రాంకీ ప్లాస్టిక్ దందా నిర్వహిస్తుందన్నారు. మల్కాజిగిరిలో 274, భూదాన్ భూమి 538, 539 ఇసుక, ఇటుక వ్యాపారం చేస్తుంటారు. కానీ ప్లే గ్రౌండ్‌కు ఇవ్వని పరిస్థితిలో ఉందన్నారు. సర్వే నెంబర్ 844లో సర్వే చేయమని చెప్పినా కలెక్టర్ పట్టించుకోని పరిస్థితి నెలకొందన్నారు. హైదరాబాద్-మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మధ్య ఉంటుందన్నారు. వక్ఫ్ భూమి 384 ఎకరాలు 22ఏ క్రింద లావాదేవిలు నిషేదించింది. 398,399 ఖాళీ ఉంటే పోలీసులు వెళ్ళి ఇతరకులను ఇప్పించారని, ఆ విభాగం అధికారిని అడిగినా పట్టించుకోవడం లేదన్నారు. ఎమ్మెల్యే కార్యాల యం కూడ లేదన్నారు. ముస్లీం, క్రిష్టియన్‌లకు స్మశాసన వాటికలు లేవన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పాల్గొన్నారు. గౌతమ్ నగర్ డివిజన్‌లో మౌలిక వసతులు కల్పించాలని ఉప కమిషనర్ రాజుకు వినతిపత్రం సమర్పించారు. సానుకూలంగా స్పందించిన ఉప కమిషనర్ రాజు సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు చేపడతారని కార్పొరేటర్‌కు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, స్థానిక టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో కొలను

విశాలాంధ్ర-దుండిగల్ : సోమవారం మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో కూకట్‌పల్లి నియోజకవర్గం బాలనగర్ స్రామాట్ హెటల్‌లో నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధన్ జిల్లా సన్నాహక సమావేశ కార్యక్రమానికి పిసిసి కోఆర్డినేటర్ ఇంచార్జ్ చౌహన్ శివ, కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అదేవిధంగా మేడ్చల్ జిల్లా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్‌లు కోలన్ హన్మంత్ రెడ్డి, బండి రమేష్, వజ్రష్ యాదవ్, పరమేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, సత్యం శ్రీరంగం, లక్ష్మి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళ కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ నాయకులు, ఎస్సి, ఎస్టీ సెల్ నాయకులు, ఎన్ఎస్‌యుఐ, నాయకులు, ఐఎన్‌టియుసి, నాయకులు పాల్గొన్నారు.

టీబీ రహిత తెలంగాణకు కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్ : టిబి రహిత తెలంగాణ, భారత్ గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం, ప్రపంచ టీబీ దినోత్సవమును పురస్కరించుకొని హైదరాబాద్ చేస్తా ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, టీబీ కేసులను గుర్తించి త్వరగా నివేదించడం మరియు క్షయవ్యాధిపై ఉన్న అపోహలను తొలగించడం అత్య వసరమని స్పష్టం చేశారు. "హైదరాబాద్‌ను క్షయవ్యాధి రహిత నగరంగా మార్చే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ సహకరించాలి. టీబీ వ్యాధిని సమర్థవంతంగా నియం త్రించడానికి ప్రారంభ దశలోనే గుర్తించడం, సరైన మోతదులో ట్రీట్మెంట్ ఇవ్వడం ద్వారా, బాధితులు భయపడకుండా, వివక్ష లేకుండా సరైన చికిత్స పొందేలా చేయాల్సిన బాధ్యత మనపై ఉందని అని ఆయన పేర్కొన్నారు. టీబి రహిత హైదరాబాద్ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రైవేట్ ఆరోగ్య సంరక్షణ కేంద్రాలన్నీ తప్పనిసరిగా తమ దగ్గర నమోదైన టీబీ కేసులను అధికారికంగా ప్రభుత్వానికి నివేదించాల్సిన బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ప్రతి ఆరోగ్య సంరక్షణ కేంద్రం, ప్రైవేట్ వైద్యులు కూడా టీబీ కేసులను నమోదుచేయడం కేవలం సామాజిక బాధ్యత మాత్రమే కాకుండా చట్టబద్ధమైన కర్తవ్యమని, ని- క్షయ్ పోర్టల్ లో 150 శాతం నమోదు చేసేలా లక్ష్యం నిర్దేశించు కొని చురుకుగా పని చేయాలన్నారు. ఈ సందర్భంగా బాగా సేవలందించిన ఉద్యోగులకు కలెక్టర్ శాలువాలతో ఘనంగా సత్కరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట్, డా.రాజేశ్వరి, డా. స్నేహ శుక్లా మాట్లాడుతూ టీబీ వ్యాధి ప్రబలుతున్న తీరును, అలాగే అంతర్జాతీయ స్థాయిలో తీసుకుంటున్న వ్యూహాలను వివరించారు. డా.శ్రవణ్ కుమార్ ఛెస్ట్ హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్న ఆధునిక చికిత్సా పద్ధతుల గురించి వివరించారు. టీబి సంస్థ డైరెక్టర్ రమేష్ ప్లాన్ ఇండియా, మహావీర్ పీపీఎం ఎన్జిఓ, బవ్యా హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు తమ సామాజిక సేవా కార్యక్రమాలను, రోగుల పునరావాసం మరియు ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యాలపై వారి కృషిని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్య నిపుణులు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు, మరియు సామాజిక సంస్థల ప్రతినిధులు పాల్గొని, టీబీ నిర్మూలనకు తమ కృతనిశ్చయాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించేం దుకు, టీబీ కేసుల నివేదికలను బలోపేతం చేయడానికి, మరియు క్షయవ్యాధిపై ఉన్న అపోహలను తొలగించ డానికి కృషి చేయడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జే.వెంకటి, రాష్ట్ర మహమ్మారి శాస్త్రవేత్త డా.రాజేశ్వరి, డబ్ల్యూహెచ్‌ఓ కన్సల్టెంట్ డా. స్నేహ శుక్లా, ఛెస్ట్ హాస్పిటల్ సూపరింటెం డెంట్ డా.శ్రవణ్ కుమార్, టి.బి.అలర్ట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మిస్టర్ రమేష్, అలాగే ప్లాన్ ఇండియా ఎన్.జి.ఓ, మహావీర్ పిపిఎం ఎన్.జి.ఓ, బవ్యా హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్, జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమం (ఎన్.టి.ఈ.పి.) సిబ్బంది పాల్గొన్నారు. జె.ఎం.జె. నర్సింగ్ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన రిటైర్డ్ ఉద్యోగులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎన్టీఆర్ భవన్‌లో మహబూబ్ నగర్ పార్లమెంట్ అడ్‌హాక్ కమిటీ సభ్యులు రాములు యాదవ్, శ్రీనివాస్ గౌడ్‌ల ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు సమక్షంలో మహబూబ్ నగర్ టౌన్‌కు చెందిన టెలిఫోన్ డిపార్ట్మెంట్ రిటైర్డ్ ఉద్యోగి బి.సాయన్న గౌడ్, జడ్చర్లకు చెందిన ఆర్.టి.సీ రిటైర్డ్ సూపరింటెం డెంట్ సి.వెంకటేశ్వర్లు, దేవరకద్ర చెందిన ఆర్‌టీసీ రిటైర్డ్ ఉద్యోగి టి.సత్య షీలా రెడ్డి, దేవరకద్రకే చెందిన ఆర్‌టిసి డిపార్ట్మెంట్ రిటైర్డ్ సూపరింటెం డెంట్ కె.వెంకటయ్యలు సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బక్కని నరసిం హులు వీరికి తెలుగుదేశం పార్టీ కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బక్కని నరసింహులు మాట్లాడుతూ మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో గతంలో పార్టీ ద్వారా పదవులు అనుభవించిన అనేకమంది తమ స్వార్థాల కోసం పార్టీ మారారని, ఈనాడు కొంతమంది రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమా లను అమలుతో పాటు సామాజిక న్యాయం చేసే పార్టీ తెలుగుదేశం పార్టీయేనని గుర్తించి స్వచ్ఛం దంగా పార్టీలో చేరడానికి ముందుకు వచ్చారని, వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్నామని అన్నారు. నాయకులు పార్టీని వీడిపోయినా 1 లక్ష 78 వేల మంది తెలుగుదేశం సభ్యత్వం జరిగిందని, ఇందులో పాతవారు 58 వేలు తమ సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకోగా కొత్తగా 1 లక్ష 20వేల మంది కొత్తగా యువత, మహిళలు పార్టీ సభ్యత్వం తీసుకోవడం శుభపరిణామని అన్నారు. ఎన్‌టీఆర్ పటేల్, పట్వారి వ్యవస్థను రద్దు చేసి ప్రజలకు నిజమైన స్వతంత్రతను ఇవ్వగా, చంద్ర బాబు పల్లెల గుమ్మం వద్దకే పాలను తీసుకెళ్లారని, ఇది ఎంతో ధైర్యంతో కూడిన చర్య అని అన్నారు. అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావ్ లాంటి వారు కూడా ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి గ్రామాలకు వెళ్లాల్సి వచ్చిందన్నారు. ప్రజలు తమ ఆలోచనల మేరకు ఏ పార్టీని అధికారంలోకి తీసుకు రావాలనేది నిర్ణయించుకుంటారని, ప్రజలు తెలంగాణ రాష్ట్రం కావాలని కోరుకుంటున్నారని, తెలుగుదేశం పార్టీ తెలంగాణ ఏర్పాటుకు అనుకూలంగా లేఖ ఇచ్చిందన్నారు. ఉన్నత పదవులలో ఉన్న వారికి వాక్కు నియంత్రణ ఉండవలసిన అవసరం ఉందని, తెలుగుదేశం పార్టీ భవిష్యత్తులో యువతకు అవకాశం ఇచ్చి, మహిళలను రాజకీయంగా ప్రోత్సహించి కష్టపడ్డ వారికి ఎం.ఎల్.ఏ, ఎం.పీలుగా అవకాశాలను ఇస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో నల్గొండ పార్లమెంట్ అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ కసిరెడ్డి శేఖర్ రెడ్డి, గూడెపు రాఘవులు, సికంద్రాబాద్ పార్లమెంట్ తెలుగు మహిళా నాయకురాలు జయశ్రీ, సుధాకర్, రాష్ట్ర మీడియా కమిటి ఛైర్మన్ ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 7 నుండి 10 వరకు స్పోర్ట్స్ మీట్

విశాలాంధ్ర - హైదరాబాద్ : జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, జీహెచ్‌ఎంసీ ఉద్యోగులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులకు ఏప్రిల్ 7 నుండి 10 వరకు స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్లు స్పోర్ట్స్ అదనపు కమీషనర్ యాదగిరి రావు తెలిపారు. ఇట్టి ఈవెంట్‌లో 150 మంది కార్పొరేటర్లు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ ఉద్యోగులు, సిబ్బందికి మహిళలు, పురుషుల కేటగిరిలో వివిధ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్రీడా పోటీలు విక్టరీ ప్లే గ్రౌండ్, ఉప్పల్ స్టేడియంలో ఏప్రిల్ 7 నుండి 10 వరకు ఉదయం, సాయంత్రం సెషన్లలో జరుగుతాయని పేర్కొన్నారు. అన్ని లీగ్ మ్యాచ్‌లు ఏప్రిల్ 9 నాటికి పూర్తి చేయడం జరుగుతుందని, ఫైనల్స్ 10న జరుగుతాయని తెలిపారు.

నిర్వహించు క్రీడల వివరాలు...

క్రికెట్ (పురుషులు) డిఆర్‌ఎఫ్ ట్రెనింగ్ సెంటర్ గ్రౌండ్, ఫతుల్లా గూడ, నాగోల్, కబడ్డీ (పురుషులు) విక్టరీ ప్లే గ్రౌండ్, వాలీబాల్ (పురుషులు)-విక్టరీ ప్లే గ్రౌండ్, చెస్ (పురుషులు-మహిళలు)-విక్టరీ ప్లే గ్రౌండ్, షటిల్ బ్యాడ్మింటన్ (పురుషులు, మహిళలు)-ఉప్పల్ ఇండోర్ స్టేడియం, మ్యూజికల్ చెయిర్ (మహిళలు)-విక్టరీ ప్లే గ్రౌండ్, టెన్నికాయిట్ (మహిళలు)-విక్టరీ ప్లే గ్రౌండ్, క్యారమ్స్ (పురుషులు, మహిళలు)-విక్టరీ ప్లే గ్రౌండ్, లెమన్-స్పూన్ రేస్-విక్టరీ ప్లే గ్రౌండ్, అథ్లెటిక్స్-విక్టరీ ప్లే గ్రౌండ్, ఆయా క్రీడల్లో గెలుపొందిన విజేతలకు టీంలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేయడం జరుగుతుందని తెలిపారు. మొదటి బహుమతి రూ.10,000, రెండో బహుమతి రూ.6,000, మూడో బహుమతి రూ.3,000 అందజేస్తారని తెలిపారు. ఆయా క్రీడల్లో ఆసక్తి గలవారు స్పోర్ట్స్ మీట్ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.

జీహెచ్‌ఎంసీ అమలు చేస్తున్న పథకాలు భేష్

విశాలాంధ్ర - హైదరాబాద్ : జిహెచ్‌ఎంసి ద్వారా నగరంలో అమలు చేస్తుతున్న వివిధ పథకాలు ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు దోహద పడుతున్నా యని ట్రైనీ ఐఏఎస్‌లు అభిప్రాయ పడ్డారు. 2023 సంవత్సరంలో ఐఏఎస్‌లుగా ఎంపికై తెలంగాణ రాష్ట్రానికి కేటాయింపు అయిన ట్రైనీ ఐఏఎస్‌లు పలు జిల్లాలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్‌గా పని చేసి మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం ద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీరికి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు సంబంధించిన అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. సోమవారం జిహెచ్‌ఎంసి ప్రజలకు అందిస్తున్న సేవలు, సంస్థ ఆర్థిక వనరులు, మౌలిక సదుపాయాల గురించి జిహెచ్‌ఎంసికి వచ్చిన ట్రైనీ అధికారులకు కూకట్‌పల్లి జోనల్ అధికారి అపూర్వ చౌహాన్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జోనల్ కమీషనర్ శానిటేషన్, భవన నిర్మాణ వ్యర్థాలు (సి అండ్ డి), హెల్త్, వెటర్నరీ, ఎంటమాలజీ, ఇంజనీరింగ్ మెయింటెనెన్స్, ఎస్.ఎన్.డి.పి, ఎస్.ఆర్.డి.పి, సి.ఆర్.ఎం.పి పథకాలు, రెవెన్యూ, యుబిడీ, స్పోర్ట్స్, డబుల్ బెడ్ రూం ఇళ్లు, నాలా పూడికతీత, మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్, స్ట్రీట్ లైట్ వివరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమీషనర్‌తో పాటుగా వికారాబాద్ జిల్లాలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్‌గా పని చేసిన మిస్ ఉమా హారతి, నారాయణ పేట్‌లో పని చేస్తున్న మిస్ గరిమ నారుల, ఈ.ఈ.యస్.ఎస్.డి మనోజ్ (సంగారెడ్డి), అజయ్ యాదవ్ (కరీంనగర్), సాకేత్ కుమార్ (నిజామాబాద్), అభిగ్యాన్ మాల్వియా (ఆదిలాబాద్), మృణాల్ శ్రేష్ట (ఖమ్మం జిల్లా) అసిస్టెంట్ కలెక్టర్లు, మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థ కోర్స్ డైరెక్టర్ డా.కందుకూరి ఉషా రాణి, జీహెచ్‌ఎంసీ చీఫ్ వెటర్నరీ డాక్టర్ అబ్దుల్ వకీల్ తదితరులు పాల్గొన్నారు.

దవాత్ - ఏ - ఇఫ్తార్ విందులో పాల్గొన్న గాంధీ

విశాలాంధ్ర - శేరిగంపల్లి: రంజాన్ మాసం పర్వదినంను పురస్కరించుకుని మాదాపూర్ డివిజన్ పరిధిలోని నవభారత్ నగర్ కాలనీలో నిర్వహించిన దవాత్- ఏ - ఇఫ్తార్ విందు కార్యక్రమంలో కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్‌తో కలిసి ముఖ్యఅతిథిగా పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం చాలా పవిత్రమైనది అని, రంజాన్ మాసం సందర్భంగా నిష్ఠతో పాటించే ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలతో సామరస్యం, శాంతి సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. రంజాన్ పర్వదినంను పురస్కరించుకుని ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇవ్వడం చాలా అభినదించదగ్గ విషయం అని అదేవిధంగా తెలంగాణకు ప్రత్యేకమైన "గంగా జమునా తెహజీబ్" మరింతగా పరిఢవిల్లాలని, రంజాన్ పండుగ ప్రజా జీవితాల్లో సుఖ సంతోషాలను అందించాలని అభిలషించారు. రంజాన్ మాసం ఉపవాసంతో మంచి తనం, సంస్కారం అలవడు తుందని, మతసామరస్యానికి ప్రతీక, అందరూ కల్సి ఉండాలని, అదేవిధంగా కులం, మతం, జాతి భేదం లేకుండా తెలంగాణ జాతి అంతా ఒకటే అని, ఆ దేవుడి కరుణకటాక్షాలు పొందేందుకు దేవుడి కృపకు దగ్గర కాగలమనేది ప్రతి ముస్లిం సోదరుల ప్రగాఢ విశ్వాసము అందుకే ఎంతో భక్తి శ్రద్ధలతో రంజాన్ నెల మాసాన్ని పురస్కరించుకుని నియమ నిబంధనలు పాటించి ఉపవాస కఠోర దీక్షతో ప్రార్థనలు చేస్తారు. ఈ విధమైన ఆధ్యాత్మిక దైవ ప్రార్థనలతో శాంతి, సోదరభావం, సౌభ్రాతృత్వానికి రంజాన్ ప్రతీక అని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జీహెచ్‌ఎంసి అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు అధికారులను కోరారు. సోమవారం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, వేణుగోపాల్, రఘు ప్రసాద్, చంద్రకాంత్ రెడ్డి, యాదగిరిరావు అడిషనల్ సిసిపిలు గంగాధర్ ప్రదీప్‌లు పాల్గొని నగరం నలు మూలల నుండి వచ్చిన ప్రజల నుండి విన్నపాలు స్వీకరించి, పరిష్కారం కోసం సంబంధిత అధికారు లను ఆదేశించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాల యంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 68 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ 26, ట్యాక్స్ సెక్షన్ 16, ఇంజనీరింగ్ విభాగం, హెల్త్ విభాగాలకు 4 చొప్పున, శానిటేషన్ విభాగానికి 3, యుబిడి, ఎలక్ట్రికల్, లేక్స్, ఐటీ విభాగాలకు 2 చొప్పున ఫిర్యాదులు అందగా, అడ్మినిస్ట్రేషన్, విజిలెన్స్, ట్రాన్స్ పోర్ట్ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందాయి. ఫోన్ ఇన్ ద్వారా 4 ఫిర్యాదులు అందాయి. జిహెచ్‌ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 108 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్‌పల్లి జోన్‌లో 52, సికింద్రాబాద్ జోన్‌లో 18, శేరిలింగంపల్లి జోన్‌లో 23, ఎల్బీనగర్ జోన్‌లో 9, చార్మినార్ జోన్‌లో 4, ఖైరతాబాద్ జోన్‌లో 2 అర్జీలు అందాయి. ప్రజావాణి కార్యక్రమంలో యుబిడి డైరెక్టర్ వెంకటేశ్వర్ రావు, వాటర్ వర్క్స్ జిఎం సాయి రమణ, డిప్యూటీ సిఈ పనస రెడ్డి హౌసింగ్, ఎస్టేట్ అధికారి ఉమా ప్రకాష్, ఈ.ఈ రాజేశ్వర్ రావు, పి.వి రమణ రావు, ఎస్.ఎన్.డి.పి ఈ.ఈ వెంకటేశ్వరరావు, ఓఎస్‌డి అనురాధ, ల్యాండ్ అక్విజిషన్ డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

విశాలాంధ్ర - శేరిగంపల్లి: సోమవారం ప్రజావాణి కార్యక్రమం కొనసాగింది. జోనల్ కార్యాలయంతోపాటు శేరిగంపల్లి, చందానగర్, యూసుఫ్గూడా, పటాన్చెరువు సర్కిల్లో అధికారులు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కాగా మొత్తం 25 వినతులు అధికారులకు అందాయి. ఇందులో జోనల్ కార్యాలయంలో 15, శేర్లింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో 4, యూసఫ్ గూడ సర్కిల్ కార్యాలయంలో 2, చందానగర్ సర్కిల్ కార్యాలయంలో 4 చొప్పున వినతులు వచ్చాయి. ఇందులో పట్టణ ప్రణాళిక, పన్ను విభాగం, ఇంజనీరింగ్‌కు సంబంధించి సమస్యలను ప్రజలు వినతిపత్రం రూపంలో అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన వినతులపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యంత ప్రాధాన్యతగా భావించి క్షేత్రస్థాయి పరిశీలనలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి తీసుకున్న చర్యలను తిరిగి ప్రజలకు నివేదించాలని జోనల్ కమిషనర్ సూచించారు. ఆయా జోనల్ విభాగాల అధికారులు కూడ ప్రజావాణిలో పాల్గొనారు.

జస్టిస్ వర్మను వెంటనే అరెస్టు చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : మన రాజ్యాం గం ప్రకారం చట్టం ముందు అందురు సమానమనే సూత్రం ఉన్నది. ఢిల్లీ జస్టిస్ వర్మ ఇంట్లో బయట పడ్డ నోట్ల కట్టల ఆధారంగా జస్టిస్ వర్మను వెంటనే అరెస్టు చేయాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.యస్.బోస్ డిమాండ్ చేశారు. జస్టిస్ వర్మకు నిజాయితీ, న్యాయవ్యవస్థ మీద గౌరవం ఉంటే వెంటనే రాజీనామ చేసి విచారణ కమిటీకి సహకరించాలని ఆయన డిమాండ్ చేశారు. అలా కాకుండా నేరం నుంచి తప్పించు కోవటానికి తన మీద ఎవరో కుట్ర పన్నుతున్నట్టుగా ప్రకటనలు ఇవ్వటం తన ఇంట్లో బయటపడిన నోట్ల కట్టలకు తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పటం అతని స్థాయికి, తాను నిర్వహిస్తున్న పదవికి సరైంది కాదని అన్నారు. జస్టిస్ వర్మ ప్రకటన ఒక రాజకీయ నాయకుడు చేసే ప్రకటన లాగా ఉందని, ఈ దేశంలోని కోర్టులో ప్రధాన న్యాయమూర్తి ప్రకటన భావనను ప్రతిబింబించటం లేదన్నారు. కొంతమంది కేంద్ర ప్రభుత్వ పెద్ద మనుషులు ఇలాంటి వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం చేసేది ఏమీ లేదని ఈ వ్యవహారం అంతా కోర్టు వ్యవహా రాల్లో భాగమని చెప్పటం హాస్యాస్ప దంగా ఉందన్నారు. పిలవకుండా గత వినాయక చవితి రోజు జస్టిస్ చంద్రచుడ్ ఇంటికి ప్రధాన మంత్రి మోడీ ఆకస్మాత్తుగా వెళ్ళినప్పుడు ఈ పెద్ద మనుషులు నోరు మెదపకపోవటం అమానుషం. దీనికి తోడు వర్మను తొలగించటానికి బదులు అహ్మదాబాద్ కోర్టుకు బదిలీ చేయటం ఎలాంటి న్యాయమో కేంద్ర పెద్దలు చెప్పాలన్నారు. ఇదే నోట్ల కట్ట ఘటన ఒక పేదవాడి లేక సామా న్యుని ఇంటిలో జరిగితే చట్టాన్ని ఈ రకంగానే అమలు చేసేవారా? కేంద్ర పెద్దలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అలహాబాద్ కోర్టుకు బదిలీ చేయటాన్ని వ్యతిరేకిస్తూ అక్కడ న్యాయ వాదులు, ఇతరులు వ్యతిరేకించటంతోనైనా కేంద్ర పెద్దలు బుద్ధి తెచ్చుకోవాలని అన్నారు. అదేకాక అక్కడ ఉన్న న్యాయవాదులు అలహాబాద్ హైకోర్టు చెత్తకుండి కాదని ప్రకటించటంలో జరిగిన సంఘటనపై న్యాయవాదులు ఎంత తీవ్రంగా ప్రతి స్పందిస్తున్నారో కేంద్ర ప్రభుత్వం అర్థం చేసుకోవాలన్నారు. ఎవరి ప్రభావమో తెలియదు కానీ ఫైర్ స్టేషన్ అధికారులు ఏలాంటి డబ్బు కట్టలను మేము చూడలేదని అనటంతో విచారణ ఏ స్థాయిలో జరుగుతున్నదో ప్రజలు అర్థం చేసుకోవాల న్నారు. దీనికి తోడు కొంతమంది ప్రబుద్ధులు సమాచార మాధ్యమాల్లో కాలిపోయిన డబ్బు కట్టలు జస్టిస్ వర్మ ఇంట్లోవి కావని, అవి బయట ఉన్న చెత్తకుండీలోవని ప్రచారం చేయటం వారి దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. తప్పుడు ప్రచారం, సాక్షాలు ఇస్తున్న వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే జస్టిస్ వర్మను పదవి నుండి తొలగించాలని, జరుగుతున్న విచారణ సరయిన విధంగా జరగకపోతే కేంద్ర ప్రభుత్వమే అందుకు బాధ్యత వహించాలన్నారు.

ఆలయ స్వాగత తోరణాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పటాన్ చెరువు : పటాన్ చెరువు నియోజకవర్గంలో నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని వందనాపురి కాలనీలో గల శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయం స్వాగత తోరణాన్ని సోమవారం ఉదయం ఆయన ప్రారంభించారు. సొంత నిధులతో ఆలయ ముఖద్వారం నిర్మించడం సంతోషకరంగా ఉందని ఆయన తెలిపారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, సీనియర్ నాయకులు రమేష్ గౌడ్, ప్రమోద్ రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఇళ్లు లేని పేదలకు డబుల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వాలి

విశాలాంధ్ర - శేరిగంపల్లి: శేరిగంపల్లి నియోజకవర్గంలో ఇల్లు లేని పేదలకు డబల్ బెడ్ రూమ్‌లు ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య డిమాండ్ చేవారు. నియోజకవర్గంలో డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు ఆన్లైన్లో అప్లై చేసుకుని, సిపిఐ ఆధ్వర్యంలో లిస్టు ద్వారా ఎమ్మార్వోకి అప్లై చేసుకున్న వారికి గత టిఆర్ఎస్ ప్రభుత్వం ఇండ్లను ఇవ్వకుండా దాటవేసిందన్నారు. ఈ ప్రభుత్వమైనా ఇస్తుందని ఆశిస్తున్నానని, ఇవ్వని పక్షంలో రాబోయే కాలంలో మండల కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు చేపడతామని పాలమకుల జంగయ్య తెలిపారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతుంటే అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటంలేదన్నారు. పేదవాడు గుడిసె వేసుకుంటే వెంటనే తీసేసి కేసులు పెడతారు. డబుల్ బెడ్ రూమ్ ఎవరైతే అప్లై చేసుకున్నారో వారికి వెంటనే ఇండ్లను అలాట్మెంట్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు రామస్వామి, శేర్లింగంపల్లి నియోజకవర్గం కార్యదర్శి సిపిఐ రామకృష్ణ, సిపిఐ జిల్లా సమితి సభ్యులు కే చందు యాదవ్, కే సుధాకర్, తుపాకుల రాములు, ఏఐటుసి అధ్యక్షులు జె.శ్రీనివాస్, బి నారాయణ, టి వరలక్ష్మి, కే లక్ష్మమ్మ, ఎస్ కొండలయ్య, చంద్రమ్మ, ఎమ్. వెంకటేష్, రఘు, టి.నితీష్, ధర్మ తేజ పాల్గొన్నారు.

మణికంఠనగర్‌లో సీసీ కెమెరాలు ప్రారంభం

విశాలాంధ్ర - మేడిపల్లి : బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 17వ డివిజన్ పరిధి లోని మణికంఠ నగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం సీసీ కెమెరాలు ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు 17వ డివిజన్ మాజీ కార్పొరేటర్ పోగుల నర్సింహారెడ్డి, ఐదవ డివిజన్ మాజి కార్పోరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి, మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ విశ్వం గుప్త తదితరులు పాల్గొని సీసీ కెమెరాలు ప్రారంభించారు. ఒక్క సీసీ కెమెరాలు పదిమంది పోలీసులతో సమానమని, కాలనీలో ఎలాంటి నేరాలు అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని, కాలనీవాసులు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని ముఖ్య అతిథులు అన్నారు. ఈ కార్యక్రమంలో మణికంఠ నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్ గౌడ్, అడ్వైజర్లు బ్రహ్మాచారి, వెంకటేశ్వర్లు, నరసింహ నాయక్, కాలనీవాసులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన మాజీ మేయర్

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 3, 5, 12వ డివిజన్‌లలో సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టడం జరిగింది. ఈ అభివృద్ధి పనుల ప్రారంభ కార్యక్రమంలో మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ కార్పొరేటర్ భీమ్ రెడ్డి నవీన్ రెడ్డి, సీనియర్ నాయకులు శ్రీధర్ రెడ్డి, బొడిగే కృష్ణ, పప్పుల అంజిరెడ్డి పాల్గొన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి మున్సిపల్ కార్పొరేషన్ కృషి చేస్తోంది. ఈ పనులు పూర్తయిన తర్వాత స్థానిక ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు పారిశుద్ధ్య సమస్యలు తగ్గుతాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, కాలనీ వాసులు, మహిళలు తదితరులు పాల్గొని అభివృద్ధి పనులపై హర్షం వ్యక్తం చేశారు.

బత్తిని రాజు గౌడ్‌కి డాక్టరేట్ ప్రదానం

విశాలాంధ్ర - మేడిపల్లి: సామజిక సేవకుడు బత్తిని రాజు గౌడ్ సేవలను అంతర్జాతీయ పీస్ విశ్వవిద్యాలయం గుర్తించి పాండిచ్చేరి తమిళనాడు పట్టణంలో ఆదివారం డాక్టరేట్ అందజేసింది. విశ్వవిద్యాలయ ఇంచార్జి ప్రతినిధులు, ప్రొఫెసర్ డా.ఎస్.చల్లాద్రి వైస్ ఛాన్సలర్, డా.ఎ.ప్రబోధ్ రాజేంద్రన్ చీఫ్ డైరెక్టర్ సౌత్ ఇండియా యుఎన్ఐపిసి. డా. డి. లక్ష్మీ కాంతం చైర్మన్ ఎస్హెచ్ఆర్టిఓసి. డా.వల్లపాడి వెంకటరత్నం డైరెక్టర్ ఎన్.ఆర్.ఓ. రాజు గౌడ్‌కి పట్టాని అందజేశారు. బత్తిని రాజు గౌడ్ చేపడుతున్న పేదలకు సాయం, విద్యార్థులకు చేయూత, వృద్దులకు ఆసరా తదితర పనులను పరిశీలించి గౌరవ డాక్టరేట్ అందించాలని ఎంపిక చేశారు. సమాజ అభివృద్ధికి సహకరించిన రాజు గౌడ్ పనితీరు అభినందనీయమని అతిథులు అభినందించారు. ఈ సందర్భంగా డా. రాజు గౌడ్ మాట్లాడుతూ అవార్డులు ఆభరణం కాదని మరింత బాధ్యతను పెంచుతాయన్నారు. ఈ అవార్డు అందించినందుకు విశ్వవిద్యాలయ ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తోటివారికి సాయమందించడమే తన లక్ష్యమన్నారు. మానవ సేవయే మాధవ సేవ అని అన్నారు.

దరఖాస్తుదారులతో మర్యాదగా వ్యవహరించాలి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ప్రజావాణిలోనే కాకుండా ఎప్పుడైన అర్జీలు ఇవ్వడానికి వచ్చే దరఖాస్తుదారలతో గౌరవంగా వ్యవహరించి దరఖాస్తులు స్వీకరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం జిల్లా అధికారులకు సూచించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరు స్వీకరించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (99) ఫిర్యాదులు అందాయన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ ప్రజావాణిలోనే ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణి దరఖాస్తులను కూడా వెంటనే పరిష్కరించాలని అధికారులను కలెక్టరు ఆదేశించారు. జిల్లా అధికారులు జాప్యం లేకుండా దరఖాస్తులను పరిష్కరించి దరఖాస్తుదారునికి సమాచారం తెలియపరచాలని జిల్లా అధికారులను కలెక్టరు ఆదేశించారు. వివిధ శాఖలలో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ హరిప్రియ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యాదవులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: యాదవులు రాజ్యాధికారం వైపు ఉద్యమించాలని, విద్య, ఉద్యోగ, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని అఖిల భారత యాదవ సేవా వ్యవస్థాపక అధ్యక్షుడు, బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ అన్నారు. యాదవుల కులదైవమైన శ్రీశ్రీ మల్లన్నస్వామి పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అఖిల భారత యాదవ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ దాసరి అజయ్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నీతి నిజాయితీకి మారుపేరు అయినటువంటి జాతి యాదవ్ జాతి, యాదవులు రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా వెనుకబడి ఉన్నారన్నారు. యాదవ జాతిని అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకోవడం జరుగుతుందన్నారు. యాదవ్‌ల అభివృద్ధి కొరకు పాటు పడటం లేదు రాజ్యాధికారం కొరకు యాదవుల ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైనదన్నారు. రాబోయే స్థానిక ఎన్నికలలో యాదవులకు అన్ని రాజకీయ పార్టీలు జనాభా దామాషా ప్రకారంగా అవకాశం కల్పించాలని అన్ని పార్టీలను డిమాండ్ చేశారు. అర్థ సంచార జాతులుగా ఉన్నటువంటి యాదవులకు పిల్లలకు గతంలో ఉన్నటువంటి (సెమీ నోమడిక్ ట్రైబ్స్) అర్థసంచర జాతుల రిజర్వేషన్లు పునరుద్ధరించాలన్నారు. దాదాపుగా రాష్ట్రంలో 10,000కు పైగా గొర్రెల కాపరుల సంఘాలు ఏర్పాటు చేసుకోనీ ప్రత్యక్షంగా రాష్ట్రంలో 10 లక్షల యాదవ్ కుటుంబాలు గొర్రెల పెంపక మీద ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని, గొర్రెలకు ఇన్సూరెన్స్ లేకపోవడం వల్ల రాష్ట్రంలో అనేక గొర్రెలు రోగాల బారినబడి చనిపోయి యాదవ కుటుంబాలకు ఆర్థికంగా నష్టం చేకూరడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంబడే 100 శాతం ఇన్సూరెన్స్‌ని ఉచితంగా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువసేన అధ్యక్షులు బోయిన్ మహేష్ యాదవ్, జిల్లా అధ్యక్షులు అంకం గోపాల్ యాదవ్, గోల్కొండ మండల అధ్యక్షులు సంగినేనిపల్లి భీమన్న యాదవ్, అంకెల చిన్నప్ప యాదవ్, ఆశ్చర్య పూర్ ఆంజనేయులు యాదవ్, కోత్లబడ్ మాజీ డిప్యూటీ సర్పంచ్ బాబు యాదవ్, ఏజీ మల్లేష్ యాదవ్, కృష్ణ యాదవ్, రాహుల్ యాదవ్, మహేష్ యాదవ్, వెంకటేష్ యాదవ్, రవీందర్ యాదవ్ పాల్గొన్నారు.

ఆర్ కృష్ణయ్యపై అనుచిత వ్యాఖ్యలను జాజుల ఉపసంహరించుకోవాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యపై బిసి నాయకుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని బిసి విద్యార్థి యువజన సంఘాల సమైఖ్య రాష్ట్ర అధ్యక్షులు అనంతుల రామ్మూర్తి గౌడ్, బీసీ నేత ర్యాగ రమేష్‌లు అన్నారు. వేలాది ఉద్యమాలు చేసి, జివోలను తీసుకువచ్చి కోట్లాది మందికి విశేషమైన సేవలు అందించిన ఆర్.కృష్ణయ్యను జాజుల విమర్శించడం సిగ్గుచేటన్నారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఇటీవల ఒక సమావేశంలో తన స్థాయికి మించి ఆర్.కృష్ణయ్యపై తప్పుడు ఆరోపణలు చేశారని, భవిష్యత్తులో తప్పుడు వ్యాఖ్యలు చేస్తే దేహశుద్ధి తప్పదని, రాళ్ళతో దాడి చేయవలసి వస్తుందని హెచ్చరించారు. ఆర్.కృష్ణయ్య ఏనాడు పదవుల కోసం పాకులాడలేదని, ఏ పార్టీలో చేరలేదని, రాజకీయ పార్టీలే పిలిచి ఆయనకు పదవులు ఇచ్చాయన్నారు. ఆయనకు పలు రాజకీయ పార్టీలు పదవులు కట్టబెట్టడం ఓర్వలేక, అధికార పార్టీలకు అంటకాగుతూ జాజుల తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వారు ధ్వజమెత్తారు. జాజుల మాత్రం రాజకీయ పార్టీలు, నాయకులతో కొమ్ము కాస్తూ రాత్రిళ్ళు డబ్బుల సంచులు తెచ్చుకుంటున్నారని వారు ఆరోపించారు. ఆయనపై ఆరోపణలు రుజువు చేయడానికి సిద్ధంగా ఉన్నామని వారు సవాల్ విసిరారు. జాజుల తక్షణమే ఆర్.కృష్ణయ్యకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇకపై కృష్ణయ్యపై ఆరోపణలు చేస్తే తీవ్రమైన పరిణామాలు ఉంటాయని వారు హెచ్చరించారు. సి.రాజేందర్, అనంతయ్య, నిఖిల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక పటాన్‌చెరువు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పటాన్ చెరు : పటాన్ చెరువు నియోజకవర్గం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తోందని పటాన్ చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. కులం మతం ప్రాంతాలకు అతీతంగా పరమత సహనం పెంపొందిస్తున్నామని తెలిపారు. ముస్లింల అభివృద్ధికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. సొంత నిధులతో నియోజకవర్గ వ్యాప్తంగా మసీదులు నిర్మించడం జరిగిందని తెలిపారు. గత 25 సంవత్సరాలుగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రంజాన్ పవిత్ర మాసం పురస్కరించుకుని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో నియోజకవర్గ స్థాయి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ తాజా మాజీ ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ వక్త, బ్రదర్ షఫీ పరమత సహనంపై ప్రత్యేకంగా బోధనలు చేశారు. అన్ని మతాల సారాంశం ఒక్కటేనని కష్టనష్టాలలో ఒకరికొకరు అండగా నిలవాలని కోరారు. ప్రపంచంలోనే భారతదేశం విభిన్నమైనదని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. నియోజకవర్గ ప్రజలందరికీ రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ముస్లింలకు తగు ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గాలి అనిల్ కుమార్, నియోజకవర్గ తాజా మాజీ ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, ముస్లింలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా కెఎల్ఎం ఆక్సివా ఫిన్‌వెస్ట్ రజతోత్సవం

విశాలాంధ్ర - శేరిగంపల్లి: కెఎల్ఎం ఆక్సివా ఫిన్‌వెస్ట్, తమ రజతోత్సవాన్ని మార్చి 22న హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలోని హోటల్ లెమన్ ట్రీలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రలకు చెందిన ఫార్చునా ఉద్యోగుల కోసం 25వ ఉద్యోగుల సదస్సును జరుపుకుంది. దాదాపు 1000 కంటే ఎక్కువ శాఖలతో భారతదేశ వ్యాప్తంగా కార్యకలాపాలను నిర్వహిస్తోన్న, లేడీ సూపర్‌స్టార్ నయనతారను బ్రాండ్ అంబాసిడర్‌గా కలిగి ఉన్న ఈ కంపెనీ, ఈ తరహా మైలురాయి కార్యక్రమాల ద్వారా తమ లక్ష్యం, విలువలను బలోపేతం చేస్తూనే ఉంది. ఫార్చునా 25వ ఉద్యోగుల సదస్సును కెఎల్ఎం ఆక్సివా ఫిన్‌వెస్ట్ చైర్మన్, మాజీ భారత దౌత్యవేత్త టి.పి. శ్రీనివాసన్ ఐఎఫ్ఎస్ (రిటైర్డ్) ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సీఈఓ మనోజ్ రవి అధ్యక్షత వహించారు. ప్రతిష్టాత్మక మైలురాయిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ సదస్సు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర నుండి ఉద్యోగులను ఒకచోట చేర్చింది.

బోడుప్పల్ పెన్షన్‌దారుల తిప్పలు..

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వాలు మారినా పెన్షన్ దారుల తిప్పలు మాత్రం మారలేదు. ఉదయం 9 గం.ల నుండి పెన్షన్ గురుంచి మహిళలు, వృద్దులు అందరూ అక్కడికి వచ్చి లైన్లో నిలబడ్డారు. కానీ వేసవి కాలంలో కూడా ప్రభుత్వం నుండి ఎలాంటి ఏర్పాట్లు చేయడం లేదు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలని రోడ్ల పైన నిలబెట్టారు. కనీస ఏర్పాట్లు కూడా చేయడం లేదు, వేసవి కాలంలో పెన్షన్ దారులకు కనీస ఏర్పాట్లు చేయాలని మేడ్చల్ రూరల్ జిల్లా బీజేవైఎం. అధికార ప్రతినిధి బజారు కిరణ్ గౌడ్ కోరారు.

భారతదేశంలో మొట్టమొదటి స్ట్రోక్ సెంటర్‌గా అపోలో

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : అమెరికన్ హార్ట్ అసోసియేషన్ (ఏహెచ్ఏ) నుండి కాంప్రహెన్సివ్ స్ట్రోక్ సెంటర్ (సిఎస్ సి) సర్టిఫికేషన్తో, హైదరాబాద్లోని అపోలో హాస్పిటల్స్ దేశంలో స్ట్రోక్ చికిత్సకు సంబంధించి నూతన ప్రమాణాన్ని నెలకొల్పింది. ప్రత్యేక స్ట్రోక్ బృందాలు, అధునాతన ఇమేజింగ్తో స్ట్రోక్ డయాగ్నసిస్, క్రిటికల్ కేర్లో అత్యవసర ప్రతిస్పందనలతో అత్యంత కఠినమైన ప్రమాణాలను అందుకోగలదని ఏహెచ్ఏ సర్టిఫికేషన్తో హైదరాబాద్లోని అపోలో హాస్పిటల్స్ విజయవంతంగా నిరూపించుకుంది. అత్యున్నత స్ట్రోక్-కేర్ సర్టిఫికేషన్ను పొందిన భారతదేశంలో మొట్టమొదటి సంస్థగా ఏహెచ్ఏ దీనిని గుర్తించింది. జూబ్లీహిల్స్‌లోని అపోలో హాస్పిటల్స్, హైదరాబాద్ 24 గంటలూ పూర్తిగా అంకితం చేయబడిన, ప్రత్యేకమైన, మల్టీడిసిప్లినరీ స్ట్రోక్ బృందాన్ని కలిగి ఉంది. ఈ బృందంలో అత్యవసర వైద్యులు, న్యూరాలజిస్టులు, ఇంటర్వెన్షనల్ న్యూరో రేడియాలజిస్టులు, న్యూరో సర్జన్లు, ఇంటెన్సివిస్టులు, ప్రత్యేక నర్సింగ్ సిబ్బంది ఉన్నారు. మల్టీడిసిప్లినరీ నిపుణుల బృందంలో డాక్టర్ అలోక్ రంజన్-సీనియర్ కన్సల్టెంట్, హెచ్ఓడి - న్యూరోసర్జరీ, డాక్టర్ ఇమ్రాన్ సుభాన్, సీనియర్ కన్సల్టెంట్, హెడ్ ఎమర్జెన్సీ మెడిసిన్‌టీ డాక్టర్ కె. సుబ్బారెడ్డి, సీనియర్ కన్సల్టెంట్ ఇంటెన్సివిస్ట్, హెడ్ ఆఫ్ క్రిటికల్ కేర్‌టీ డాక్టర్ సురేష్ గిర్గాని, ఇంటర్వెన్షనల్ న్యూరో రేడియాలజిస్ట్, డాక్టర్ సి. రాజేష్ రెడ్డి, న్యూరాలజిస్ట్ ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కాప్రా : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మహిళ దినోత్సవ వేడుకల్లో భాగంగా మల్లాపూర్ డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద జరిగిన కార్యక్రమంలో స్థానిక మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు సమాజానికి మూలస్తంభాలని, వారు కుటుంబాన్ని, సమాజాన్ని, దేశాన్ని ముందుకు నడిపించే శక్తివంతమైన వ్యక్తులు అని అన్నారు. వారి కృషి, త్యాగం, అభిప్రాయ స్వాతంత్ర్యం మన అందరికీ ప్రేరణ అని పేర్కొన్నారు. ప్రతి మహిళకు గౌరవం, సమానత్వం, ప్రోత్సాహం అందించేందుకు మనమందరం కృషి చేద్దామని అన్నారు. మహిళా శక్తి - దేశ అభివృద్ధికి పునాది అని స్త్రీ - సమాజానికి ప్రేరణ, పురోగతికి మార్గదర్శి అని స్త్రీలు ముందుకెళ్తే సమాజం అభివృద్ధి చెందుతుంది. మహిళా శక్తికి దారి చేసేద్దాం అని ప్రతి మహిళ గౌరవించబడే, స్వేచ్ఛగా తన కలలను నెరవేర్చుకునే సమాజాన్ని నిర్మించేందుకు మనమందరం కృషి చేద్దాం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, మహిళ సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణిలో వచ్చిన ఆర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 98 దరఖాస్తులను స్వీకరించారు. అట్టి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో గృహ నిర్మాణ శాఖకు 31, పెన్షన్ 24, డిసిఎస్ఓ 4, ఇతర శాఖలకు సంబంధించినవి 39 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరివన్ పలని, జి.ముకుంద రెడ్డి, డిఆర్ఓ ఈ.వెంకటాచారి, ఆర్‌డిఓ సాయిరాం, జిల్లా అధికారులు పవన్‌కుమార్, ఆశన్న సుబ్రహ్మణ్యం, సిపిఓ సురేందర్, రాజేందర్, శ్రీరామ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

విశాలాంధ్ర - కుత్బుల్లాపూర్ : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ రావుల శేషగిరి పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గం 125 డివిజన్ గాజులరామారం డివిజన్ పరిధి మహదేవపురం, మెట్కాన్ గూడ అయ్యప్ప కాలనీలో డ్రైనేజీ సమస్యలపై ఐడిపిఎల్ ప్రజావాణిలో వాటర్ వర్క్స్ జిఎంని స్థానిక కార్పొరేటర్ బిజెపి నాయకులు రావుల శేషగిరి కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో టీ బ్లాక్ ప్రెసిడెంట్ మధిరాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్‌లో నాక్ ఇంజనీర్ల తొలగింపు

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : గ్రేటర్ హైదరాబాద్ పరిధి జీహెచ్ఎంసి లోని ఎల్బీనగర్, కూకట్పల్లి, చార్మినార్, ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్లలో ఆయా ప్రాంతాలలో జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్‌లోని నాక్ ఇంజనీర్‌లుగా విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందిని విధుల నుండి తొలగిస్తున్నట్లు జిహెచ్ఎంసి కమిషనర్ ఆదివారం సాయంత్రం సర్కులర్ మెమోని జారీ చేశారు. ఇందులో భాగంగానే కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జంట సర్కిళ్ళైన కుత్బుల్లాపూర్, గాజుల రామారంలోని మొత్తం ఐదు మంది నాక్ ఇంజనీర్స్ సిబ్బందిని విధులను తొలగించారు. విషయానికొస్తే గాజులరామారం, కుత్బుల్లాపూర్ సర్కిళ్లలో వందలకొద్ది అక్రమ నిర్మాణాల దగ్గర వసూళ్లు, కొన్ని చోట్లలో ప్రభుత్వ భూములు అనుమతులను ఇప్పిస్తూ అందిన కాడికి దండుకుంటున్నారన్న ఫిర్యాదులతో వారిని తొలగించారని సమాచారం.అయితే ఇదంతా వారు ఆయా సర్కిల్ పై అధికారుల ప్రమేయం లేకుండానే నడిపించారా అంటే నూటికి నూరు శాతం కాదనే అట్టి నిర్మాణదారులు, స్థానిక ప్రజలు చెబుతున్నారు. వసూళ్ళకు పాల్పడి అక్రమంగా సంపాదించింది పై అధికారులు కొండంత అయితే, నాక్ ఇంజనీర్లు స్వలాభం పొందింది గోరంతే అని చెప్పాలి, అవినీతికి పాల్పడి వారిని ముందుంచి అక్రమమార్గంలో నడిపించిన వారు నిజాయితీపరులయ్యారని పై అధికారుల స్వలాభం కొరకు అక్రమ నిర్మాణదారులతో బేరసారాలాడి కాసులు మోసుకొచ్చి అధికారుల జేబులు నింపిన సిబ్బందేమో దోషులయ్యారని కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విధుల నుండి నిజంగా తొలగించాల్సి వస్తే ఆయా సర్కిళ్ళలోని డిసిలను, టౌన్ ప్లానింగ్ అధికారులను ముందు తొలగించాలని ప్రజలు వాపోతున్నారు.

అన్నమయ్యపురంలో శోభారాజుచే వేసవి వెన్నెల

విశాలాంధ్ర - శేరిగంపల్లి: అన్నమయ్య ఆరాధన సందర్భంగా పద్మశ్రీ డా. శోభారాజు ఆధ్వర్యంలో వేసవి వెన్నెల ఉచిత అన్నమయ్య కీర్తనల కార్యక్రమం ప్రారంభమయ్యింది. దాదాపు ఐదు సంవత్సరాల నుండి అరవై ఏళ్లపై వయసు కలిగిన వారు సంగీతంపై ఆసక్తి ఉన్న వారు కలిసి వంద మంది శిష్యులుగా అన్నమయ్య కీర్తనలు నేర్చుకునేందుకు హాజరయ్యారు. తొలుత అన్నమ గాయత్రి మంత్రం, హరియవతారమీతడు అన్నమయ్య, దినము ద్వాదశి నేడు అన్న సంకీర్తనలు, వాటితో పాటు సంకీర్తనల భావం కూడా అందరికీ అర్థమయ్యే రీతిలో శోభారాజు విశ్లేషించారు. ప్రతి రోజూ శిబిరం చివరన అన్నమయ్య సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి మంగళ హారతి, ప్రసాద వితరణతో కార్యక్రమం ముగుస్తోంది.

భారత్‌లో రైతుల పోరాటం ప్రపంచానికే స్ఫూర్తి

ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య

కాట్మండు: పశ్చిమ ఆసియా రైతు సంఘాల సమాఖ్య మహాసభలు మార్చి 20,21, తేదీలలో నేపాల్ రాజధాని కాట్మండు లో జరిగాయి. ఈ మహాసభలకు సంఘ అధ్యక్షులు ప్రేమ్ దంగాల్ అధ్యక్షత వహించారు. పశ్చిమాసియా దేశాలైన భారత్, నేపాల్, బంగ్లాదేశ్, పాకిస్థాన్, శ్రీలంక ఐదు దేశాల నుండి 25కు పైగా సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ముఖ్యఅతిధిగా నేపాల్ ప్రధానమంత్రి కేపీ శర్మ ఓలీ పాల్గొని సందేశం ఇచ్చారు. ఈ ఐదు దేశాలలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటాలు చేయాలన్నారు. అ పోరాటాలకి తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఆయన ప్రసంగం ఐదు దేశాల రైతు ప్రతినిధుల్లో స్ఫూర్తి నింపింది. భారత్ నుంచి మహాసభల్లో పాల్గొన్న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య మాట్లాడుతూ భారతదేశంలో తమ సంఘం 1936 లో ఏర్పడిన తొలి సంఘం అని చెప్పారు. స్వాతంత్ర్య పోరాటంలోనూ అద్భుత పోరాటం నిర్వహించిందన్నారు తదనంతరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాల మీద అలుపెరుగని పోరాటం చేసిందన్నారు భారతదేశంలో రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేదన్నారు. కనీస మద్దతు ధర సి2౦50 డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫారసు మేరకు చట్టబద్ధ హక్కుగా కావాలన్నారు. భారత రైతులు 62% అప్పుల్లో కూరుకు పోయిన ఫలితంగా ఇటీవల కాలంలో నాలుగు లక్షల మంది రైతులు ఆత్మహత్యలకు గురయ్యారన్నారు. రోజుకు 31 మంది ఆత్మహత్యకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 60 సంవత్సరాల నిండిన ప్రతి రైతుకు నెలకు పదివేల రూపాయలు పెన్షన్ గా ఇవ్వాలన్నారు. కేరళ తరహా రుణ విమోచన చట్టం భారతదేశవ్యాప్తంగా తేవాలన్నారు. ఇటీవల నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా 500 కి పైగా రైతు సంఘాలు ఏకతాటిపైకి వచ్చి... ఐక్యంగా 13 నెలలు పాటు పోరాటాలు చేశాయన్నారు. ఈ పోరాటంలో 750 మంది అశువుల బాశారన్నారు. ఇప్పటికి 4 వేలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. చివరికి నరేంద్ర మోడీ దిగివచ్చి 3 నల్ల చట్టాలను పార్లమెంటులో ఉపసంహరించుకొని యావత్ రైతు జాతికి క్షమాపణలు చెప్పారని తెలిపారు. ఈ సందర్భంగా రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను ప్రధాని మూడేళ్ల గడిచినా అమలు చేయడంలేదని... దానికోసం మరలా పోరాటానికి భారతదేశం లోని రైతులు సమాయత్తమయ్యారన్నారు. చారిత్రాత్మకమైన భారత దేశ రైతుల పోరాటం భారతదేశానికే కాకుండా యావత్తు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇటీవలే యూరప్ దేశాలలో దాన్ని ఆదర్శంగా తీసుకొని రైతు పోరాటాలు చేశాయన్నారు. పశ్చిమ ఆసియా దేశాలలో కూడా ఆ పోరాటాన్ని అనుసరించాలన్నారు. దానికోసం మన కమిటీ భవిష్యత్తులో తీవ్రమైన కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహాసభల్లో బంగ్లాదేశ్ అగ్రికల్చరల్ లేబర్ యూనియన్ (బీఏఎల్‌యూ) అధ్యక్షుడు సైఫుల్ హక్, బంగ్లాదేశ్ క్రిషోక్ ఫెడరేషన్ (బీకేఎఫ్) నేత బద్రుల్ ఆలం, బంగ్లాదేశ్ క్రిషోక్ సమితి ఉపాధ్యక్షుడు నిమై గంగూలి, బంగ్లాదేశ్ జాటియో క్రిషోక్ సమితి నేత బోక్తియార్ హుస్సేన్, ఆలిండియా కిసాన్ సభ (ఏఐకేఎస్)కార్యదర్శి కృష్ణప్రసాద్, ఆలిండియా కిసాన్ మహాసభ (ఏఐకేఎం) కార్యదర్శి పురుషోత్తం శర్మ, ఏఐకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామాయన్ సింగ్, దక్షిణాసియా దారిద్ర్య నిర్మూలన కూటమి (ఎస్‌ఏపిఇ) నేత అర్జున్ కర్కి, పాకిస్థాన్ కిసాన్ రబిత కమిటీ (పీకేఆర్‌సి) ప్రధాన కార్యదర్శి తారిఖ్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ పౌరసత్వంపై కేంద్రానికి 4 వారాల గడువు

లక్నో: కాంగ్రెస్ అగ్రనేత, లోకసభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పౌరసత్వం అంశంలో కేంద్రానికి అలహాబాద్ హైకోర్టు గడువు నిర్దేశించింది. నాలుగు వారాల్లో పౌరసత్వం అంశం తేల్చాలని సూచించింది. న్యాయస్థానానికి 8 వారాల గడువు కోరగా.. నాలుగు వారాల గడువు ఇస్తూ తదుపరి విచారణను లక్నో బెంచ్ ఏప్రిల్ 21కి వాయిదా వేసింది. ఆ లోగా స్టేటస్ రిపోర్ట్‌ను కేంద్రం కోర్టుకు సమర్పించాల్సి ఉంటుంది. రాహుల్ గాంధీ పౌరసత్వం అంశం కొన్నేళ్లుగా వివాదంలో ఉంది. రాహుల్ గాంధీ బ్రిటన్ పౌరుడని, భారత పౌరసత్వాన్ని రద్దు చేయాలంటూ బీజేపీ నేత సుబ్రహ్మణ్యస్వామి, కర్నాటకకు చెందిన బీజేపీ కార్యకర్త విఘ్నేశ్ శిశిర్ వేసిన పిటిషన్లపై న్యాయస్థానం తాజా ఆదేశాలు ఇచ్చింది. బ్రిటన్‌లో నమోదైన ఓ కంపెనీకి రాహుల్ గాంధీ డైరెక్టర్, సెక్రటరీగా ఉన్నారని సుబ్రహ్మణ్య స్వామి కొంత కాలంగా చెబుతున్నారు. ఆ కంపెనీ వార్షిక నివేదికలో తనను తాను బ్రిటీష్ పౌరుడిగా గాంధీ పేర్కొన్నట్లు స్వామి తెలిపారు. వేరే దేశంలో పౌరుడిగా ఉన్న వ్యక్తి ఆ దేశ పౌరసత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవాల్సి ఉంటుందన్నారు. అలా చేయకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 9, భారతీయ పౌరసత్వ చట్టం, 1955ని ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. ఇదే అంశంపై గతంలో కేంద్రానికి లేఖ రాశారు. తన వద్ద రాహుల్‌గాంధీ పౌరసత్వానికి సంబంధించిన బ్రిటన్ ప్రభుత్వం సమర్పించిన రికార్డులు ఉన్నాయని విఘ్నేశ్ చెబుతున్నారు.

'హంద్రీనీవా' పనులు పూర్తి చేయండి

రైతు సంఘాల నాయకుల ధర్నా

విశాలాంధ్ర-పత్తికొండ (కర్నూలు): హంద్రీనీవా ప్రాజెక్టు పెండింగ్ పనులను పూర్తి చేసి 61,400 ఎకరాలకు సాగునీరు అందించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథ రామిరెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.రాజా సాహెబ్ డిమాండ్ చేశారు. పందికోన రిజర్వాయర్ ఆయకట్టు సాధన సమితి అధ్వర్యంలో రైతు సంఘాల నేతలు ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ హంద్రీనీవా ద్వారా 61,400 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా, కేవలం 12 వేల ఎకరాలకు మాత్రమే అందుతుందన్నారు. పందికోన రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువలను పూర్తి చేసి సాగు, తాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టులకు రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయించకుండా రైతాంగాన్ని తీవ్ర నిరాశకు గురి చేశారన్నారు. ఖరీఫ్ సీజన్ నాటికి రూ.250 కోట్లు కేటాయించి లక్ష ఎకరాకు సాగునీరు ఇవ్వాలన్నారు. కృష్ణానది నీటి యాజమాన్య బోర్డ్ కర్నూల్ లో ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు శేషాద్రి రెడ్డి అధ్యక్షతన జరిగిన ధర్నాలో రైతు సంఘాల నాయకులు ఆదినారాయణ రెడ్డి, తిమ్మయ్య, సురేంద్ర కుమార్, కారన్న, సుల్తాన్, పెద్ద ఈరన్న, కారుమంచి, తెర్నేకల్, కైరుప్పల సర్పంచ్ అరుణ్, వీరభద్రప్ప, కాశీ విశ్వనాథ్, రామకృష్ణారెడ్డి, శివారెడ్డి, వేణుగోపాల్, ప్రగతిశీల మహిళా అధ్యక్షురాలు మన్నెమ్మ పాల్గొన్నారు.

అరటి రైతులకు రూ.లక్ష పరిహారం

వైఎస్ జగన్ డిమాండ్

విశాలాంధ్ర-లింగాల: వైఎస్సార్ కడప జిల్లా లింగాల మండలంలో భారీ ఈదురుగాలులు, అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. తాతిరెడ్డిపల్లె, కోమన్నూతలలో పర్యటించిన జగన్ అక్కడ నేలవాలిన అరటితోటల్ని చూశారు. బాధిత రైతులతో మాట్లాడి...వారికి జరిగిన నష్టాన్ని ఆరా తీశారు. ఈ సందర్భంగా జగన్ దగ్గర రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. లక్షలాది రూపాయల అప్పు చేసి అరటి పంట వేశామని ఇప్పుడు మా పరిస్థితి ఏంటని వారు వాపోయారు. రైతులకి న్యాయం జరిగేలా చూస్తామని జగన్ ధైర్యం చెప్పారు. లింగాల మండలంలో ఈదురు గాలులు, వడగళ్ల వర్షాలతో దాదాపు 4 వేల ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనావేశారు. రైతులను పరామర్శించిన వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ... చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే... పంటలకు సంబంధించి 2023-24 బీమా ప్రీమియం కట్టకపోవడంతో ఖరీఫ్ రైతులు నష్టపోయారన్నారు. ఆ తర్వాత 2024-25 ప్రీమియం కూడా ఆయన కట్టలేదని... అసలు ఉచిత పంటల బీమా ఉందా? లేదా? అని ప్రశ్నించారు. చంద్రబాబుగారి పుణ్యాన ఇప్పటికే అనేక పంటలకు తీవ్ర నష్టం జరిగిందని, ధాన్యం రంగు మారిందన్నారు. మొక్కజొన్న, జొన్న పంటలకు కూడా భారీగా నష్టం వాటిల్లిందని చెప్పారు. ప్రభుత్వం వెంటనే మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. పంటలకు బీమా ప్రీమియం కట్టాలని... ప్రతి రైతు పంటల వివరాలు ఈక్రాప్ కింద నమోదు చేసి, నష్టం జరిగితే వారికి బీమా వచ్చేలా చూడాలన్నారు. '4 వేల ఎకరాల రైతులకు ఒకటే భరోసా ఇస్తున్నాను. ప్రభుత్వంపై ఒత్తిడి కోసమే నా ఈ పర్యటన. చంద్రబాబునాయుడుగారు కచ్చితంగా ఇక్కడి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలి. ఇన్సూరెన్స్ సొమ్ము కూడా రావాలి. పంట నష్ట పోయిన ప్రతి అరటి రైతు కి ఎకరాకు లక్ష రూపాయలు నష్టపరిహారం చెల్లించాలి' అన్నారు. పార్టీ తరఫున కూడా రైతులకు సాయం చేసేందుకు ప్రయత్నిస్తామని జగన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, పులివెందుల నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు సారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మండల కన్వీనర్ బాబురెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు అలవలపాటి శ్రీనివాసరెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణే అందరి కర్తవ్యం

జల్లి విల్సన్

విశాలాంధ్ర బ్యూరో-బాపట్ల: ప్రజల్లో అభద్రత భావం కలిగిస్తూ... అడ్డగోలుగా పరిపాలన చేస్తున్న నరేంద్ర మోదీ నుంచి దేశాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకోవటమే ప్రజలందరి కర్తవ్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. సీపీఐ పిలుపు మేరకు బాపట్ల జిల్లా చీరాల అయోధ్య నగర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచార జాతా సోమవారం నిర్వహించారు. తొలుత భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా సీపీఐ సీనియర్ నాయకులు పృథ్వి కోట సుబ్బారావులు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిరుమల ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సభలో జల్లి విల్సన్ మాట్లాడుతూ బడా కార్పొరేట్ సంస్థలకు మోదీ తొత్తుగా మారి ప్రభుత్వ అస్తులను అప్పనంగా దోచిపెడుతున్నారని విమర్శించారు. దేశాన్ని కాపాడుకోవటం కోసం, సామాజిక న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంతో కూడిన రాజ్యాంగ పరిరక్షణ లక్ష్యంగా సీపీఐ ప్రచార జాత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నరేంద్ర మోదీ ప్రధాని అయిన తర్వాత దేశం ఆర్థికంగా దివాలా తీసిందని విమర్శించారు. ప్రాంతాలు, జాతులు, కులాల మధ్య గొడవలు పెట్టడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని తెలిపారు. ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ ఎన్నికల హామీ ఏమైందని ప్రశ్నించారు. దేశ ప్రజల ప్రయోజనాల కంటే కార్పొరేట్‌ల ప్రయోజనాలే పరమావధిగా కేంద్రంలోని బీజేపీ పాలన ఉందన్నారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో పేదలను మరింత పేదరికంలోకి నెడుతున్నారని తెలిపారు. మోదీ అధికారం చేపట్టిన నాటి నుంచి కార్మిక, రైతు వ్యతిరేక పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. పన్ను సరళీకరణ పేరుతో కొత్త విధానం తీసుకొచ్చి చిన్న వ్యాపారాలు, మధ్య తరగతి ప్రజలు భారం ఎదుర్కొనేలా చట్టాలు రూపొందించారని, పార్లమెంటులో 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తానని ప్రగల్భాలు పలికి ప్రజలు ఓటుతో కొట్టేసరికి చతికిల పడ్డారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చి అభివృద్ధి చెందిన భారత దేశాన్ని నిర్మించాలని, కుల, మత వైషమ్యాలు, రెచ్చగొట్టే విధానాలు మానుకోవాలని హితవు పలికారు. స్వర్ణాంధ్ర ప్రదేశ్ నిర్మాణం చేస్తానని రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. చీరాల నియోజకవర్గంలో సీపీఐ పిలుపు మేరకు సుమారు 700 మందికి పైగా పేదలు ఇళ్ల స్థలాల కోసం వినతి పత్రాలు సమర్పించారని, ప్రభుత్వం నేటికీ ఎటువంటి చర్యలు ప్రారంభించలేదన్నారు. పేదరికం నిర్మూలన జరగాలంటే బడ్జెట్‌లోని అంకెలు పేపర్లపై కాకుండా పేదలకు చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్, దళిత హక్కుల పోరాట సమితి బాపట్ల జిల్లా కార్యదర్శి పులిపాటి వీరయ్య, బీసీ ఫెడరేషన్ నాయకులు ఊటుకూరి వెంకటేశ్వర్లు, మణి బాబు, వేటపాలెం సీపీఐ మండల కార్యదర్శి వెంకటేశ్వర రెడ్డి, వేటపాలెం సీనియర్ నాయకులు కృష్ణా రెడ్డి, అచ్యుతుని బాబూరావు, పొదిలి శ్రీమన్నారాయణ, కోలా వీరాంజనేయులు, గడ్డం దుర్గాప్రసాద్, కంభం శివయ్య, గడ్డం పున్నారావు, పృథ్వి కోట సుబ్బారావు, నాగరాజు, కోలా సాయి, గడ్డం ప్రభాకర్ రావు, గుత్తి గిరిజాపతి, షేక్ కాలేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.5,258 కోట్ల బడ్జెట్

- టీటీడీ బోర్డు ఆమోదం
- వీఐపీ బ్రేక్ దర్శనాల సమయం మార్పు: బీఆర్ నాయుడు

విశాలాంధ్ర- తిరుమల కల్చరల్: వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.5,258.68 కోట్ల బడ్జెట్‌ను టీటీడీ ధర్మకర్తల మండలి ఆమోదించినట్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. ఈ బడ్జెట్ ప్రతిపాదనలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసిందని ఆయన వివరించారు. తిరుమల అన్నమయ్య భవనంలో ఈవో జె.శ్యామలరావుతో కలసి సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. పోటు కార్మికులకు మరింత మెరుగైన వైద్య సహాయంతో పాటు జీతం పెంపుపై పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఈవోను ఆదేశించినట్లు తెలిపారు. కొడంగల్, కరీంనగర్, ఉపమాక, అనకాపల్లి, కర్నూలు, ధర్మవరం, తలకోన, తిరుపతి గంగమ్మ ఆలయాల పునః నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. శ్రీవారి అన్నప్రసాదాలకు ఆర్గానిక్ ఉత్పత్తులకు సంబంధించిన దాతల విరాళాల పాసు బుక్కులు రద్దు చేయాలని నిర్ణయించామన్నారు. తిరుమలలోని వీఐపీ, నాన్ వీఐపీ అతిథి గృహాలలో కొన్నింటిని తొలగించి...పునఃనిర్మాణం చేపట్టేందుకు, మరికొన్నింటిని ఆధునీకరించాలని నిర్ణయించామన్నారు. తిరుపతిలో అలిపిరి వద్ద సైన్స్ సిటీ, మ్యూజియం ఏర్పాటుకు గతంలో కేటాయించిన 20 ఎకరాల భూమి రద్దు చేశామని, తిరుమలలో లైసెన్స్ లేని హాకర్లను గుర్తించి చర్యలు తీసుకోవాలని నిర్ణయించామన్నారు. వృద్ధులు, ప్రత్యేక ప్రతిభావంతులకు ఆఫ్‌లైన్‌లో శ్రీవారి దర్శనం కల్పించేందుకు సాధ్యాసాధ్యాలను, భక్తుల విజ్ఞప్తి మేరకు ఉదయం 5.30 గంటలకు శ్రీవారి బ్రేక్ దర్శనం సమయం మార్చే అంశాన్ని పరిశీలించాలని బోర్డు నిర్ణయించినట్లు బీఆర్ నాయుడు తెలిపారు. టీటీడీ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ప్రతి మూడు నెలలకు ఒకసారి సుపథం ద్వారా ఆరు టికెట్లు మంజూరు చేయాలని, టీటీడీ కళాశాలలో గత 25 సంవత్సరాలుగా పని చేస్తున్న 151 మంది కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేయాలని, నూతన ఆగమ సలహామండలి మండలి ఏర్పాటుకు ఆమోదం లభించిందని చెప్పారు. తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధి పనులకు రూ.కోటి మంజూరుకు ఆమోదం లభించిందన్నారు. టీటీడీ ఆస్థాన విద్వాంసులు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ మృతికి సమావేశం సంతాపం తెలిపింది.

చికిత్స పొందుతూ కౌలురైతు మృతి

విశాలాంధ్ర-గూడూరు: కర్నూలు జిల్లా గూడూరు మండలం జూలకల్ గ్రామానికి చెందిన కౌలు రైతు దేవరాజు అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం... దేవరాజు 24 ఎకరాలు కౌలుకు తీసుకొని సాగుచేస్తున్నాడు. మూడేళ్లుగా పంట దిగుబడులు తగ్గడం, మద్దతు ధర లభించకపోవడంతో అప్పులు పెరిగి పోయాయి. సుమారు రూ.8 లక్షలు అప్పు చేశాడు. వ్యవసాయానికి చేసిన అప్పులు కట్టలేనన్న దిగులుతో మనస్థాపం చెంది ఈ నెల 22 గూడూరు సమీపంలోని విద్యుత్తు కేంద్రం సమీపంలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య కవిత, ఇద్దరు కొడుకులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ తిమ్మయ్య కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు.

'ఆయుష్' సేవలు విస్తృతి

- ఖాళీ పోస్టుల భర్తీకి సత్వర చర్యలు
- పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ప్రణాళికలు
- మంత్రి సత్యకుమార్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశ, విదేశాల్లో ఆయుష్ సేవల (ఆయుర్వేద, యోగ, యునాని, సిద్ధ, హోమియోపతి) పట్ల ఆదరణ పెరుగుతున్నందున ఈ సేవలను మరింత విస్తరింపజేసేందుకు అవసరమైన ప్రణాళికలు సత్వరమే చేపట్టాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. 'ఆయుష్ అస్తవ్యస్తం' పేరుతో 'విశాలాంధ్ర' ఈ నెల 22న వార్త ప్రచురించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సోమవారం వెలగపూడిలోని ఏపీ సచివాలయంలో రాష్ట్రంలో ఆయుష్ సేవల పరిస్థితిపై సంబంధిత ఉన్నతాధికారులతో రెండు గంటల పాటు విస్తృతంగా చర్చించి తీసుకోవల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. ఆయుష్ డిస్పెన్సరీలు, ఆసుపత్రులు, కళాశాలల్లో భారీ సిబ్బంది కొరతపై ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి ఖాళీల భర్తీకి నిర్దిష్ట కాలంలో ప్రణాళికలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలోని 1,188 ఆయుష్ డిస్పెన్సరీల్లో డాక్టర్ల కొరత 50 శాతం మేర ఉన్నట్లు సమావేశంలో వెల్లడయింది. ఈ ఖాళీల సత్వర భర్తీకి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వైద్య నియామక బోర్డు ద్వారా వెంటనే నియామకాలు చేపట్టాలని సూచించారు. 601 డిస్పెన్సరీలు ఆయుష్ విభాగం అధీనంలో నడుస్తుండగా మరో 587 జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా నిర్వహిస్తున్నారు. వీటితో పాటు 8 ఆసుపత్రులతో కలిపి ప్రతి నెలా 1,63,405 మంది వివిధ ఆయుష్ ఓపీ సేవలు పొందుతున్నారు. నెలవారీగా దాదాపు 1,500 మంది ఇన్‌పేషెంట్ సేవలు పొందుతున్నారు. కోవిడ్ అనంతరం ప్రజల్లో ఆయుష్ సేవల పట్ల ఆసక్తి బాగా పెరిగినందున ఈ సేవలను ప్రస్తుత స్థాయి నుంచి భారీగా పెంచాలని మంత్రి ఆదేశించారు. 2021 నుంచి అధికారం నుంచి దిగిపోయే వరకు గత ప్రభుత్వం మూడేళ్ల పాటు జాతీయ ఆయుష్ మిషన్ కింద ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని, ఆ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో ఆయుష్ సేవలు దెబ్బతిన్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మిషన్ కింద ఖర్చులో గత రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద 40 శాతం నిధులను ఇవ్వకపోవడమే ఈ దుస్థితికి కారణమన్నారు. కూటమి ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జాతీయ ఆయుష్ మిషన్ కింద రూ.41 కోట్లకు పైగా ఖర్చు చేసిందని మంత్రి వెల్లడించారు. అలాగే గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో వెలుగు చూడని ప్రతిష్టాత్మకమైన క్రియాన్ (సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ యోగా, ఆయుర్వేద అండ్ నేచురోపతి) నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేసేలా తగు చర్యలు చేపట్టాలని మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, ఆయుష్ కమిషనర్ డాక్టర్ డి.మంజుల, ఇతర ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

బలభద్రపురంలో క్యాన్సర్ అదుపులోనే ఉంది

బలభద్రపురంలో 31 వైద్య బృందాలతో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం క్యాన్సర్ అదుపులోనే ఉందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పీఆర్సీ చైర్మన్‌ను నియమించండి

ఆర్థిక మంత్రిని కలిసిన ఎన్జీవో, జేఏసీ నేతలు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): ప్రత్యేక శ్రద్ధతో ఉద్యోగుల బకాయిలు విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కె.వి.శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎ.విద్యాసాగర్ ధన్యవాదాలు తెలిపారు. వెలగపూడి సచివాలయంలో సోమవారం ఎన్జీవో, జేఏసీ నేతలు ఆర్థిక మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వం సంక్రాంతికి రూ. 1,300 కోట్లు, ప్రస్తుతం రూ. 6,200 కోట్లు విడుదల చేయడం సంతోషదాయకమని అన్నారు. స్పందించిన పయ్యావుల మాట్లాడుతూ... ప్రభుత్వంలో భాగస్వాములైన ఉద్యోగుల బాగోగులు చూసుకోవడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఉద్యోగుల కోసం సీఎం నిధులు విడుదల చేశారని మంత్రి వివరించారు. పబ్లిక్ సెక్టార్, గురుకుల ఉద్యోగుల పదవీ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగాను, పీఆర్సీ కమిషన్ చైర్మన్‌ను నియమించే చర్యలు తీసుకోవాలని సంఘ నేతలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అగ్రికల్చరల్ ఏవోల రాష్ట్ర అధ్యక్షుడు వేణుమాధవ్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్, ఎన్జీవో ప్రతినిధులు జగదీశ్వరరావు, రంగారావు, భారతి ప్రసాద్, సి.వి.ఆర్ ప్రసాద్, సురేఖ, హర్షవర్ధన్ మంత్రిని కలిసినవారిలో ఉన్నారు.

మామిడి సాగు లాభదాయకం చేస్తాం

మంత్రి పార్థసారథి

విశాలాంధ్ర-నూజివీడు: రాష్ట్రంలో మామిడి రైతుల పరిస్థితి దయనీయంగా ఉన్నందున మామిడి సాగును లాభదాయ కంగా మార్చడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం అనుబంధ నూజివీడు మామిడి పరిశోధన స్థానం అధ్వర్యంలో సోమవారం నూజివీడు లోని నాగేంద్ర కళ్యాణ మండపంలో మామిడి ఎగుమతుల వృద్ధికి యాజమాన్య పద్ధతులపై రైతు సదస్సు. వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథి మంత్రి పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రంలో మామిడి రైతుల పరిస్థితి కొంతకాలంగా దయనీయంగా మారిందని, నూజివీడులో మామిడి కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏటా నష్టాల ఊబిలో కూరుకు పోతూ రైతు మామిడి సాగుకు స్వస్తి చెప్పి ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారిస్తున్నాడని తెలిపారు. నూతన పద్ధతుల్లో సాగు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని, సాగులో ఇబ్బందులను నివారించడానికి శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నప్పటికీ రైతులకు ఆ ఫలితాలు అందడం లేదని అన్నారు. క్షేత్రస్థాయిలో పంట పరిస్థితిపై ప్రభుత్వానికి తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

అమెరికాలో గుడివాడ యువకుడి ఆత్మహత్య

విశాలాంధ్ర - గుడివాడ: అమెరికాలోని ఫిలిక్స్‌లో నివసిస్తున్న కృష్ణాజిల్లా గుడివాడకు చెందిన కొల్లి అభిషేక్ అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు నెలలుగా ఉద్యోగం లేకపోవడం, ప్రస్తుతం అమెరికాలో విధించిన ఆంక్షలతో మనస్థాపం చెంది అభిషేక్ ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. ఏడాది క్రితం అతడికి వివాహమైనట్లు తెలిపారు. అభిషేక్ మరణవార్త విన్న తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతుడి తండ్రి శ్రీనివాసరావు ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.